శివరావుగారి దివాన్గిరీ

రచన

దిగవల్లి వేంకట శివరావు

(1898-1992)

సంపాదకులు

దిగవల్లి రామచంద్ర

దిగవల్లి వేంకట చంద్రశేఖర రావు

శివరావుగారి దివాన్గిరీ
రచయిత కీ.శే. దిగవల్లి వేంకట శివరావు(1898-1992)

సంపాదకులు:
దిగవల్లి రామచంద్ర   Mobile: 8106216512 / 9441190133
దిగవల్లి వేంకట చంద్రశేఖరరావు Mobile: 7680966776

వెల.   రూ. 200/-

ప్రథమ ముద్రణ :500 ప్రతులు

ప్రతులకు:
సంపాదకులు
నవోదయ బుక్ హౌస్, కాచిగూడ,హైదరాబాదు ఫోను:   040 24652387

Printed at

Aakruthy, Hyderabad.

Mobile:9346397234

అంకితం



రచయిత కీ.శే. దిగవల్లి వేంకట శివరావు(1898-1992)గారికి అత్యంతాభిమానులైన శతావధాని కీ.శే. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి(1870-1950) గారి దివ్యస్మృతికి

విషయ సూచిక

అనుబంధాలు:

ఛాయా చిత్రములు:

సంపుటిలో ప్రస్తావించబడినవి- పుట సంఖ్యలతో

సందేశం



పిఠాపురం సంస్థానం వారసులు శ్రీ రావు వేంకట మహీపతి రామ రత్నారావు బహద్దర్ (R.V.M.R. RATNA RAO) గారి సందేశం:

పిఠాపురం సంస్థాన మా వంశ పూర్వపు మహారాజా శ్రీ శ్రీ శ్రీ రాజా రావు వేంకట మహీపతి గంగాధర రామారావు గారి వరకూ ముందు మూడు తరాల (1820- 1888) పరిపాలనా కాలపు వాస్తవిక చరిత్ర 'శివరావు గారి దివాన్గిరీ' అనే పేరుతో గ్రంథముగా వెలువడనుండుట మాకు చాలా ఆనందదాయకం. ఆ మూడు తరాల మా వంశ మహారాజాల దగ్గర కీ.శే. దిగవల్లి తిమ్మరాజు పంతులు, కోర్టు ఆఫ్ వార్డ్స్ మేనేజర్ గా తర్వాత వారి కుమారుడు కీ.శే. శ్రీ దిగవల్లి వేంకట శివరావు పంతులు మేనేజరుగా, దివాన్ గా పని చేసినారు. 68 సంవత్సరముల అనుబంధం వారిది. ఆ దిగవల్లి వంశీయుల నేటి వారసులు శ్రీ దిగవల్లి రామచంద్ర గారి వద్ద ఆనాటి అముద్రిత చేతివ్రాత ప్రతిగా ఈ గ్రంథము లభ్యమైనట్లుగా తెలిసినది.

దివాన్ శివ రావు గారి తమ్ముని కుమారుడు అదే పేరుగల దిగవల్లి వేంకట శివరావు ఈ గ్రంథ రచయిత. వారు వారి తండ్రిగారి డైరీ, గోదావరి జిల్లా మాన్యువల్, కీ.శే. శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి వంటి ఆనాటి ప్రముఖుల నుండి గ్రహించిన ఆధారములతో వ్రాయబడినందున ఈ గ్రంథము యొక్క ప్రామాణికత, వాస్తవికత తెలియుచున్నది.


ఈ గ్రంథములో మా వంశపూర్వపు మహారాజాల పరిపాలనా వైభవము, చూపిన ధైర్య సాహసాలు, ఆత్మాభిమానము మరియు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమములు, ఏలేరు సాగుబడి కాల్వల త్రవ్వకము, పాఠశాలల స్థాపన, బాలికా

పాఠశాల, వైద్యశాలలు, సత్రములు ఏర్పాటు, దానధర్మాలు, కవిపండిత కళాపోషణ, సన్మానాలు తెలియుచున్నవి. బ్రిటిష్ చక్రవర్తులతో ఆనాటి ఇతర సంస్థానాలతో నెరపిన సంబంధ బాంధవ్యాలు వివరించబడినవి.

ఈ గ్రంథము చరిత్ర పరిశోధకులకు, సంస్థానయుగమునాటి పరిస్థితులు, సంస్థానా లయుగముగా ఈ నాటి ప్రజలకు, చదువరులకు, ఆసక్తి, కుతూహలము కల్గించును.

అముద్రిత వ్రాతప్రతిలోని భాషకు, భావాలకు, చరిత్రకు భంగము కలుగకుండా ముద్రణ చేయుచున్నట్లు తెలిసినది.

ఆనాటి దిగవల్లి వంశ నేటి వారసులైన శ్రీ దిగవల్లి రామచంద్ర, శ్రీ దిగవల్లి వేంకట చంద్రశేఖరరావు గారలు సంపాదక, సహసంపాదకులుగా ఈ గ్రంథము ఆవిర్భావ కారకులైన వారికి మా అభినందనలు



R.V.M.R. RATNA RAO

శ్రీ శ్రీ శ్రీ రాజా రావు వేంకట మహీపతి రామరత్నారావు బహద్దర్

పిఠాపురం సంస్థాన వారసులు

ప్రవహించిన కాలానికి ప్రభవించిన సేతువు"

డా. వోలేటి పార్వతీశం



అది ఎప్పుడు మొదలైంది? అన్న వివరం మనకు బొత్తిగా తెలియదు. అలాగే అది ఫలాన అప్పుడు ముగిసిపోతుందని మనం ఖచ్చితంగా లెక్కలు కట్టి చెప్పలేము. అంటే అది ఆద్యంతాలకు అందనిది. అదే కాల ప్రవాహం. తుది మొదలు లేనిది. భగవత్సత్యం. కనుకనే కాలం భగవత్సరూపం. ఆరంభము, అంతము తెలియకుంటే మనిషి అయోమయంలో పడతాడు. అందుకే మనిషి కాలాన్ని ఖండాలుగా విభజించుకున్నాడు. ఆ ఖండికలకు నామకరణాలు చేసుకున్నాడు. అందులో క్షణాలు ఉన్నాయి, నిమిషాలున్నాయి, పూటలున్నాయి, రోజులు ఉన్నాయి, వారాలు, నెలలు సంవత్సరాలు ఇలా ఇవన్నీ యుగాల వరకు విస్తరించి ఉన్నాయి. ఇలా అనంతంగా సాగే కాలంలో నిన్నా మొన్నలుగా గతించిపోయిన కాలంలోని కొన్ని విశేషాంశాలు, కొందరు విశిష్టులైన వ్యక్తుల జీవితాలు, అనూహ్యమైన సందర్భాలు, చిత్రమైన సంఘటనలు ఇలాంటివి కొన్ని వర్తమానానికి చరిత్రలుగా మిగులుతున్నాయి. రేపటి భవిష్యత్తు సౌధాన్ని చేరడానికి నిన్నటి చరిత్రలు వర్తమానపు రహదారుల్లో సోపాన పంక్తులై నిలుస్తాయి. అందుకే వర్తమానం ఎప్పుడు చరిత్ర అనే సోపాన పంక్తిని నిర్మిస్తూ ఉండాలి. ఒకవేళ ఇప్పటికే నిర్మితమై ఉంటే ఆ నిర్మాణాన్ని పదిల పర్చాలి. ఈ రంగంలో ఇప్పటికే విశేషమైన కృషిచేసిన మహనీయులు ఉన్నారు. ఆ వరుసలో విశిష్ట వ్యక్తిత్వం కలిగిన ఇద్దరు వ్యక్తులు మనకి తారస పడుతున్నారు. వీరు దిగవల్లి వంశ దీపకులు. ఒకరు దిగవల్లి రామచంద్ర గారు మరొకరు దిగవల్లి వేంకట చంద్రశేఖర రావు గారు. వీరిరువురూ పిఠాపురం సంస్థానంలో దివాన్గిరీ నెఱపిన దిగవల్లి వేంకట

శివరావు గారి చారిత్రకమైన విశేషంశాలతో కూడిన రచనను పదిలం చేసే పనిలో పడ్డారు.

పిఠాపురం అత్యంత ప్రాచీనము. దీనికి పురుహూతికాపురమనే నామాంతరమూ ఉన్నది. అంతేకాదు. ఇంకొన్ని నామవాచకాలతో కూడా ఈ ప్రాంతం చరిత్ర ప్రసిద్ధం. శ్రీనాధుని పేరిట ఒక చాటువు, తెలుగు సారస్వతానికి సుపరిచితం

దీనారుటంకాల తీర్థమాడించితి దక్షిణాధీశు ముత్యాల శాల...

అన్న సీస పద్యం అంత్య భాగంలోని తేటగీతిలో

ఎటుల మెప్పించదో నన్ను నింకమీద రావు సింగ మహీపాలు ధీవిశాలు నిండు కొలువున...

అక్కడ పేర్కొన్న రావు సింగమహీపాలుడే శ్రీనాధుడు దర్శించిన రావు సర్వజ్ఞ సింగమ భూపాలుడు.

ఈ ప్రభువు పిఠాపురం జమీందారులకు పూర్వీకుడు.

అష్టాదశ శక్తి పీఠాలలో ఇది పురుహూతికాంబకు నివాసస్థలి. ఆకారణంగా ఇది పురుహూతికాపురమని ఒక ఐతిహ్యము. కుంతీ మాధవుడు, బిందు మాధవుడు, వేణు మాధవుడు, లీలామధవుడు , సేతు మాధవుడు. ఇవి మాధవుని ఐదు మూర్తి రూపాలు. ఆ మూర్తులు కొలువైనవి పంచమాధవ క్షేత్రాలు. అందులో కుంతీ మాధవుడు కొలువైనది ఈ పిఠాపురం పుణ్యక్షేత్రం. తెలుగునేల కుతుబ్ షాహీ పరిపాలనలో ఉన్నకాలం. పిఠాపురం సంస్థానాధీశుల పూర్వీకులు కోసల దేశంనుంచి దక్షిణ దేశానికి వలస వచ్చి మెతుకో, కైలాస కోటలను ఆక్రమించుకుని తురుష్క ప్రభువులతో నేస్తం చేస్తుండేవారు. వీరు రావు వంశస్థులు. గోల్కొండ పాదుషా ఏలుబడి సాగుతున్న కాలంలో ఒక ముష్కరుడు పాదుషా వారిని సంహరించబోతే కారణాతరం వలన అక్కడ ఉన్న తెనుగు రాయణింగారు ముష్కరుని సంహరించి పాదుషా ను రక్షించారు. అమితానందుడైన పాదుషా వారు తెనుగు రాయణింగారిని ఈ ప్రాంతానికి

రాజ్యాభిషిక్తుణ్ణి చేశారు. అలా పిఠాపుర సంస్థానాధిపత్యం తెనుగు రాయణింగారితో ప్రారంభమైంది. వారి ఏడుగురు తనయులలో మధ్యముడైన రామచంద్రరావు పీఠాధిపత్యంతో రావు వంశ ప్రతిష్ఠాపన సుస్థిరమై పరిపాలనా క్రమం ప్రవహించడం మొదలుపెట్టింది. పిఠాపురం సంస్థానం విస్తృతిలో కూడా చాలా విశాలమైనదే. 128 గ్రామాలపై అధిపత్యం కలిగిన సంస్థానం ఏలుబడి 168 గ్రామాల వరకు విస్తరించింది. ఆ రోజుల్లో దేశాన్ని పాలిస్తున్న తెల్లదొరలు నిర్ణాయలన్నీ ఏకపక్షంగా ఉండేవి. వారు ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తల యొగ్గి ఉంచాల్సిందే. బహుశః 1802 సం.లో అనుకుంటాను ఈ సంస్థానాధి పతుల ఆయుధ బలాన్ని తీసివేసి, అధికారాన్ని కుదించి ప్రభుత్వమే వీరికి కొంత ధనాన్ని శిస్తుగా చెల్లించేది. ఫలితంగా సంస్థానాధీశులు జమీందారులుగా రూపాంతరం చెందారు. పిఠాపురం కూడా జమీందారీగా మారిపోయింది.

కొంతకాలం సంస్థానంగాను మరికొంత కాలం జమీందారీ గాను ఏలుబడి సాగించిన పిఠాపురం రావు వంశీకుల ఆధీనంలో ఉంది. వారికి సేవలందించడానికి అనుసంధింపబడినది దిగవల్లివంశం. కాలక్రమంలో పీఠాపురం జమీందారీకి అధినేత అయిన రావు వెంకట సూర్య రావు గారు మరణించినప్పుడు వారసులైన నీలాద్రి రాయనింగారు బాల్య దశలోనే ఉన్నకారణంగా అప్పటి కలెక్టర్ దిగవల్లి తిమ్మరాజు గారిని ఎస్టేట్ మేనేజర్ గా నియమించారు. ఇది రావు వారి వంశానికి దిగవల్లి వంశీకుల సేవా సహకారం అందించిన తొలి సన్నివేశం.

అప్పటికి ఇంకా గోదావరి నది పైన ఆనకట్ట నిర్మాణం పూర్తి కాలేదు. ధవళేశ్వర గ్రామం పిఠాపురం జమీందారీలో భాగమై ఉండేది. ఆర్థర్ కాటన్ దొర నాయకత్వంలో నిర్మాణం జరుగుతున్న ఆనకట్టకు చెందిన కార్యాలయంలో పనులన్నీ సక్రమంగా జరిపించడానికి కూలీలు, తాబేదారుల వంటి వారి పనులను రోజువారి పర్యవేక్షించడానికి హెన్రీ ఫోర్స్ అనే దొరను సబ్ కలెక్టర్ గా నియమించారు. వారి ఆగ్రహానికి తిమ్మరాజు గారు గురైన సందర్భం ఒకటుంది.

అప్పుడాయనకు ఒక అణా జుల్మానా కూడా విధించారు. అయితే కొన్నాళ్ళకు తిమ్మరాజు గారి నిజాయితీని గుర్తించి జుల్మానా రద్దు చేయడంతో పాటు నీతిపరుడని, సమర్ధుడని యోగ్యతాపత్రం కూడా ఇచ్చారు. అలా గొప్ప గుర్తింపు తెచ్చుకున్న తిమ్మరాజు గారి తొలి సంతానమే ఈ గ్రంథంలోని కథానాయకులు కీ.శే. దిగవల్లి వేంకట శివరావు పంతులుగారు. ఆయన సోదరులు వెంకటరత్నం గారు. ఆ వెంకటరత్నం గారి కుమారులే ఈ గ్రంథకర్త. విశేషమేమిటంటే వీరి నామధేయం కూడా దిగవల్లి వెంకట శివ రావు గారు. "శివరావు గారి దివాన్గిరీ" అనే శీర్షికతో దాదాపు ఒక అర్థ శతాబ్దానికి మునుపు వ్రాయబడిన ఈ గ్రంథం వ్రాత ప్రతి ఇప్పుడు ముద్రణకు నోచుకుంది. ఈ విషయంలో గ్రంథము ముద్రణకు భాగస్వామ్యం వహిస్తున్న సంపాదకులు దిగవల్లి రామచంద్ర గారు, దిగవల్లి వేంకట చంద్రశేఖర రావు గారు బహుధా ప్రశంసనీయులు. ఈ ప్రశంస కేవలం వంశీకుని గ్రంథాన్ని వెలుగులోకి తెస్తున్నందుకు మాత్రమే కాదు . గతకాలాపు చరిత్రను ఈ గ్రంథ ముద్రణ ద్వారా ముందు కాలానికి పదిలం చేస్తున్నందుకు. ఇటువంటి గ్రంథాలు వర్తమాన కాలానికి అత్యంత ఉపయుక్తాలు. కరిగిపోయిన కాలంలో సామాజిక పరమైన, పాలనాపరమైన, సాంస్కృతికపరమైన కౌటుంబీకపరమైన ఇంకా వివిధ అంశాల స్థితిగతులను అద్దంలో చూపినట్లు చూపగలవు ఈ గ్రంథాలు. కనుకనే ఈ గ్రంథకర్త కీ.శే. దిగవల్లి వేంకట శివరావుగారు వందనీయుడు, వంద్యనీయుడు కూడానూ. అంతేకాదు వారు(రచయితగారు)విశేషంగా అభిమానించే శతావధాని వాగ్దేవికి ఛాయా రూపం అయిన కీ.శే. చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి గారికి అంకిత మివ్వాలని (సంపాదకులు)సంకల్పించు కోవడం మనం ప్రస్తుతించవలసిన విశేషాంశం.

ఆనాటికి ఈ దేశ పరిపాలన వ్యవహారాలన్నీ తెల్ల దొర్ల చేతుల్లోనే ఉండేవి. ఎక్కడో బెంగాల్ ప్రాంతంలో గవర్నర్ జనరల్ పరిపాలనలో ఒక సంస్కరణ తీసుకొని వస్తే అది మద్రాసు ప్రాంతం వరకూ కొనసాగేదట. ఆ కాలంలోనే రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా రూపొందిన సంగతి, కలెక్టర్ నే

మేజస్ట్రేటుగా పరిగణించిన సంగతి, ఆ రోజుల్లో కొత్తగా తపాలా సౌకర్యం ప్రవేశపెట్టిన సంగతి, తపాలా కార్యకలాపాలలో ప్రధానమైన ఉత్తరాల బట్వాడాతో సహా అన్నీ జిల్లా కలెక్టర్ అధీనంలోనే ఉన్న సంగతి, ఇలాంటి ఎన్నో అంశాలు ఈ గ్రంథం వలన మనకు అంది వస్తాయి. గ్రంథకర్త దిగవల్లి వెంకట శివరావు గారి విషయ సేకరణ, నిశిత పరిశీలన వంటివి గమనార్హమైన విశేషాంశాలు ముందే చెప్పాను కదా! రచయిత తండ్రిగారు దిగవల్లి వెంకటరత్నం గారు. ఆయన దివాన్ గిరీ నెఱపిన శివరావు పంతులు గారి సోదరులు. వెంకటరత్నం గారు స్వతహాగా రచయిత కాదు, సాహితీవేత్త కాదు. అయినా ఆయన ఒక పుస్తకంలో తేదీల వారీగా సంవత్సరాల వారీగా కొన్ని వివరాలు పొందుపరచుకున్నారు. ఇవి బహుశః తదనంతర కాలంలో అనుకుంటాను రచయిత శివరావు గారి కంటపడ్డాయి. వాటితో పాటు మద్రాసులో కలిసి ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వం ప్రకటించిన గోదావరి జిల్లాల రికార్డుల నుంచి ఇంకొన్ని అనుబంధ విశేషాలు సేకరించారు. ఈ వివరాల సమాకలనాన్ని ఒక ప్రకరణంగా ఆవిష్కరించారు. తద్వారా గ్రంథం యొక్క సాధికారత ద్విగుణీకృతమైంది. కాకినాడలోని బాలా త్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయం దిగవల్లి తిమ్మరాజు పంతులుగారి నిర్మితియని నిర్ధారించారు. 1850సం.లో పిఠాపురం జమీందారులు రావు సూర్యారావు గారు మరణించిన వివరం ధృవపరిచారు. మనకు తెలిసిన దివిసీమ ఉప్పెన లాగ అంతకు ముందే 1864 నవంబరు ఒకటవ తేదీ బందరులో పెద్ద ఉప్పెన వచ్చి 30 వేలకు పైగా ప్రజలు దుర్మరణం పాలైన సంగతి ఇప్పటి కాలానికి తెలియచెప్పారు. మహిళలకు విద్య ఎంత ఆవశ్యకమో ఆ కాలనికే గుర్తించిన పిఠాపురం రాజా గారు, 1868వ సంవత్సరం నాటికే కాకినాడలో బాలికా పాఠశాలను స్థాపించిన విషయం మన జ్ఞాపకానికి తెస్తారు. ఆనాడే కాకినాడలో జగన్నాధపురం వంతెన నిర్మించడానికి అవసరమైన పదహారు గర్డరులు, ధవళేశ్వరం గోదావరి ఆనకట్ట నిర్మాణం కోసం ఏర్పాటైన కర్మాగారంలోనే తయారైన వివరాన్ని స్పష్టపరుస్తారు. ఇంకొక వివరాన్ని కూడా

మన దృష్టికి తెచ్చారు. 1877వ సం.లో జనవరి ఒకటో తేదీన విక్టోరియా రాణి భారతదేశానికి కూడా మహారాణి అని ఢిల్లీ దర్బారులో లిట్టన్ ప్రభువు ప్రకటన చేశారట. అప్పుడే రాజమహేంద్రి కలెక్టర్ దర్బార్లో గంగాధర్ రామారావు గారికి రాజా అనే బిరుదునిచ్చారట. మరొక విశేషమైన ,ఆశ్చర్యకరమైన అంశం కూడా తెలియచెప్పారు. ఒక సందర్భంలో శ్రీ శంకరాచార్యులు వారు పోస్ట్ కార్డు మీద శ్రీముఖం వ్రాసి పంపారట. దీనిని కారణంగా చూపుతూ 1884వ సంవత్సరం, ఏప్రిల్ 20వ తేదీన అప్పటి ఉన్నత న్యాయస్థానం, వారికి 200 రూపాయలు జరిమానా విధించిందట. ఈ వివరం మనల్ని విస్మయానిష్ఠులను చేస్తుంది. పిఠాపురం జమీందారీలో దివాన్గిరీని అత్యంత సమర్థవంతంగా నిర్వహించిన దిగవల్లి శివరావు గారి షష్ట్యబ్దిపూర్తి మహోత్సవం కాకినాడలో ఆయన స్వగృహంలోనే జరిగిందట. ఇలాంటివే మరికొన్ని వివరాలు మనకు తెలిసి వస్తాయి. పిఠాపురం రాజావారు తమ ఎస్టేట్ ని వేంకట కుమార మహీపతి సూర్యారావు గారికి చెందచేస్తూ విలునామా వ్రాశారట. ఈ సంఘటన 1890వ సం. మె నెల ఒకటో తేదీన జరిగినట్లు విశదం చేస్తారు. రాజావారు 1990వ సం. జూలై నెల 22 తేదీన స్వర్గస్థులైనట్లు, జమీందారీ దివాన్ గా సేవలందించిన దిగవల్లి వేంకట శివరావుగారు 1892 సం. మార్చి 23వ తేదీన పరమపదం చేరినట్లు నిర్ధారిస్తారు. ఇలా ఎన్నెన్నో విశేషాంశాల, చారిత్రకాంశాల సమాహారం ఈ విశిష్ఠ గ్రంథం.

శ్రీమాన్ మాడభూషి వెంకటాచార్యులు గారు అవధాన విద్యకు ఆది పురుషులు. నూజివీడు సంస్థాన భవనంలో ఆగిరిపల్లి లో 1872 వ సం. ఫిబ్రవరి 21వ తేదీన అప్పటి జమీందారు నారయప్పారావు గారి సమక్షంలో శతావధానం చేశారు. ఆనాటి సభకు పిఠాపురం రాజావారు గంగాధర రామారావు గారు అధ్యక్షత వహించారు. ఈ వివరం ఈ గ్రంథంలో పొందుపరిచారు. ఇక్కడ మరొక అదనపు సమాచారమేమంటే ఈ అవధాని గారు అనంతర కాలంలో పిఠాపురం సంస్థానంలోనూ శతావధానం నిర్వహించారు. అప్పటి ఆ అవధానంలో పాల్గొన్న

ఒక పండితుడు పిఠాపురం రాజా గంగాధర రామారావు గారి పైన ఒక పద్యం చెప్పమని అడిగాడు. సమాధానం గా వెంకటాచార్యులు వారు రాజావారిపై సీస పద్యం చెప్పారు

సీ॥ శ్రీ మన్మహారాజ శ్రితజన మందార
మందారతాత్మీయ మానసాబ్జ
సద్భాగ నిర్జితో చ్చైశ్రవో బాహట
బాహటబిరుద సంభావ్యమాన
మహనీయకోటి మన్మథసుందరాకార
రాకార మాసోదరాయితాస్య
శ్రీశైలరాట్ కృపార్జిత శంఖచక్రాంక
చక్రాంకనాద సంసక్తచిత్త
తే॥ గీ॥ సురుచిరానంత కళ్యాణ సుగుణసాంద్ర
సత్యవాక్యప్రధా హిరశ్చంద్ర భవ్య
రావు వంశ సుధాంభోధి రాజచంద్ర
రామరాయేంద్ర వసుమతీ రాణ్మహేంద్ర

పిఠాపురం సంస్థానాధీశులైన గంగాధర రామారావు గారి విభవాన్ని సన్నుతి చేస్తూ చెప్పబడిన ఈ పద్యం "అవధాన విద్యా సర్వస్వము" అనే అవధాన చరిత్రకు సంబంధించిన గ్రంథంలో ఉటంకింపబడి ఇప్పటికీ కాలంతో కలసి ప్రవహిస్తోంది.

రాజ్యాలు విస్తరించి ఉన్న కాలంలో రాజు మంత్రి సాంగత్యంలా, సంస్థానాలు, జమీందారీలు, విస్తరిల్లిన కాలంలో అప్పటి రాజాలు ,దివానులు కలిసికట్టుగా పరిపాలన సాగించిన వైనం మనకు తెలియ వస్తోంది. ఎన్నో సాంస్కృతిక, సామాజిక, కౌటుంబిక సత్యాలను అక్షర గర్భాన్న దాల్చింది ఈ గ్రంథం. దిగవల్లి రామచంద్ర, వేంకట చంద్రశేఖరరావు గారల

వర్ణసమామ్నాయంగా అందిస్తున్నది ఈ కానుక; “ప్రవహించిన కాలానికి ప్రభవించిన సేతువు”

శుభం జయం

డా. వోలేటి పార్వతీశం

మొబైల్: 9440031213

విజ్ఞాపన

కీ.శే దిగవల్లి వేంకట శివరావు(1898-1992) గారు 1980 సం.లో రచించిన ఈ సంపుటి చేతి వ్రాత ప్రతికి డా. గూడూరి నమశ్శివాయ[1] గారు 1985 సం.లో శుద్ధ ప్రతి వ్రాశారు. వ్రాతప్రతిలో మొదటి 37 పుటలలోని సమాచారమునకు శీర్షిక ఏమీ లేదు. ఈ పుటలలో సమాచారం వంశం-కుటుంబము మరియూ దివాన్జీ శివరావు పంతులుగారి బాల్యంనాటి విశేషాలు గురించి యుండినవి. అందుచేత రచయిత వ్రాసిన సమాచర సమగ్రతకు భంగం కలిగించకుండా మేము సంకలనం నిమిత్తము ఈ సమాచారమును రెండు శీర్షికల క్రింద మొదటి రెండు ప్రకరణములుగా ప్రకటించితిమి. మిగతా ప్రకరణములకన్నిటికినీ శీర్షికలు రచయిత గారిచే ఇవ్వబడినవి.

రచయిత శివరావుగారు ఈ సంపుటిలో తమ పెదతండ్రి శివరావుగారిని 'శివరావు పంతులు' గారని సంబోధించారు. వారిద్దరూ ఒకే పేరువారగుటవలన ఈ భేదము గుర్తించుటకు వారినిక్కడ దివాన్జీ శివరావు పంతులు గారనీ, రచయిత శివరావుగారనీ సంబోధించుటయే గాక వారి పేర్ల ప్రక్కన జీవితకాలములు పేర్కొనుట కూడా ఈ కారణము వలననే.

ఇంతకుముందు ప్రకటించిన దిగవల్లి తిమ్మరాజుపంతులు(1794-1856) గారి జీవిత చరిత్ర చదివిన పాఠకులకు పిఠాపురం సంస్థానంతో దిగవల్లి వారి సంబంధము 1820సం. తో మొదలైనదని తెలియగలదు. ఈ సంపుటిలోని దివాన్జీ

---

[1] గూడూరి నమశ్శివాయ గారు ఆయుర్వేద వైద్యులు, సాహిత్యకారులు. వారి తండ్రి వియ్యన్నగారు మచిలీపట్నంలో శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి గారికి వైద్యంచేసేవారని రచయిత శివరావుగారు తమ జ్ఞాపకాల పుస్తకం 2వ భాగములో వ్రాశారు. ఆకాశవాణిలో వారి ప్రసంగం తెలుగు వార్తా పత్రిక 'ఈ మాట' పత్రికలో (ఆన్ లైను పత్రిక జులై 2008 సంచికలో) రికార్డు ప్రకటించబడినది. వినగలరు.

https://eemaata.com/em/issues/200807/1304.html. ఈ ప్రసంగం బహుశః 1970-72 సం.ల మధ్య చేసినది కావచ్చును.

శివరావు పంతులుగారికి ఈ సంస్థానముతో సంబంధము వారి తండ్రిగారు ఆ సంస్థానమునకు కోర్టు ఆఫ్ వార్డ్సు(Court of Wards) మేనేజరుగానుండగా 1850సం. నుండీ చిన్న గుమాస్తాగా మొదలై 1875 సం.నాటికి దివాన్జీగా 1888సం వరకూ మొత్తం 38 సం సంవత్సరాలని తెలియుచున్నది . తిమ్మరాజుగారి సేవాకాలం కూడ కలిపితే దిగవల్లి వారికి ఆ సంస్థానంతో మొత్తం 68 సంవత్సరాల సంబంధము గలదు.

ఈ రచనలో కేవలం దివాన్జీ శివరావు పంతులుగారిని గురించియే గాక వారు పనిచేసిన పిఠాపురం సంస్థానం రాజా గంగాధరరామారావు గారిని గురించి, వారి సంస్థానమును గురించి చాలా వివరాలు రచయిత శివరావుగారు తమ తండ్రిగారి డైరీలోనుండీ, మరికొన్ని వివరాలు కడియం వాస్తవ్యులైన శతావధాని శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి(1870-1950)గారి వల్ల తెలుసుకున్నవీ, వారు ప్రచురించినవీ, శనివారప్పేట రాజాగారిని స్వయంగా నెరిగిన బెజవాడ న్యాయవాది పాటిబండ వెంకటరమణయ్య[2] గారు చెప్పినవీ, మరియూ కొన్ని గోదావరి జిల్లా మాన్యువల్ నుండి కూడా సేకరించి వ్రాశారు. ఇంతేగాక సమకాలీన, సంబంధిత విషయాలు పలు గ్రంథములనుండీ కూడా సేకరించి సమన్వయించేసి వ్రాశారు. దివాన్జీ శివరావు పంతులుగారి కాలంలో దివాన్ అనే పదవి లేనప్పటికీ ఈ సంపుటి శీర్షికలో దివాన్గిరీ అని ఎందుకు పెట్టినారన్న సందేహ నివారణకు రచయితయే ఇలా తెలిపారు "ఆ కాలంలో శిరస్తాదారునే దివాన్ అని వ్యవహరించేవారు. ప్రత్యేకంగా దివాన్జీ హోదా గల ఉద్యోగము లేదు. రాజాగారి దివాణంలోని వారు వీరిని దివాన్జీ [*అని*]అనే వారు".

పిఠాపురం సంస్థానం రాజాగారి వేష భాషలు, సంస్కృతీ సాంప్రదాయాలను వివరించిన విషయంలో కూడా రచయిత శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి మాటలు ప్రస్తావించి ఇలా చెప్పారు "పూర్వపు జమీందారుల మర్యాదలు, వేష భాషలు

---

[2] విజయవాడలో ప్రముఖ న్యాయవాది, స్వాతంత్ర సమర యోధులు సింగరాజు సుబ్బారావు(1844-1890) గారి వద్ద అప్పట్లో ప్లీడరు గుమాస్తాగా నుండి తదుపరి ప్లీడరు అయినారు.

ఇప్పుడు మనం కథలలో చెప్పుకోవాల్సిందే గాని అనుభవంలో కనబడవు”. అలాగే ఆ నాటి సంపన్న గృహస్థుల జీవిత శైలిలో వారు ప్రయాణాలు చేసిన విధానం, వివాహాలు, వేడుకలు జరిపించిన విధానం ఈ నాడు కనబడవని కూడా వివరించారు. ఆనాటి రక రకాల పేర్లు కలిగిన భాజా భజంత్రీలు, దుస్తులు, అలంకారాలు, ఆభరణాలు వివరించారు.

ఇంతేకాక పిఠాపురం రాజా శ్రీ గంగాధరరామారావుగారి పరిపాలనలోనూ శ్రీ శివరావు పంతులు గారి దివాన్గిరీ లోనూ గల విశేషములను వివరించారు. ఆ కాలంనాటి అనేక చట్టములను ప్రస్తావించి సంస్థానాధీశులను భూస్వాముల స్థాయికి తగ్గించిన బ్రిటిష్ వారి నిరంకుశ పరిపాలనను, శిస్తుల నిర్ణయాలలో రైతులకు, జమీందార్లకు కలిగిన వివాదాలు, ఆ కాలంనాటి రాజకీయ, ఆర్థిక, మత, వైజ్ఞానిక పరిస్థితులు, బ్రిటిష్ ప్రభుత్వమువారు సంస్థానాధీశులకు, తదితర ప్రముఖులకు ఇచ్చిన బిరుదులు మొదలైన విశేషాంశములు చదువరులకు కుతూహలము కలిగించును.

ఈ సంపుటిలో వాడిన వ్యవహారిక పదాలన్నిటికీ ఈ కాలంనాటి వారికి అర్థం తెలియక పోవచ్చు. దివాన్జీ శివరావుగారి తండ్రి, తిమ్మరాజు గారి జీవిత చరిత్రలో 19వ శతాబ్దంలోని బ్రిటిష్ కంపెనీ పరిపాలనలో రెవెన్యూ విభాగములోని ఉద్యోగుల పదవుల పేర్లు, కొన్ని వ్యవహారిక పదాలను అనుబంధములో ప్రకటించినట్లే ఈ సంపుటిలో కూడా జమీందారీ పరిపాలనలో ఉద్యోగుల పదవులు, 19వ శతాబ్దములో వాడుకలోనుండి వ్యవహారిక మాటలుగా వచ్చినవాటిని సాధ్యమైనంతవరకు అర్థాలు, పారిభాషిక పదాలు ఇవ్వ ప్రయత్నించి అనుబంధముగా ప్రకటించాము.

ప్రస్తావించబడిన ఆ కాలంనాటి కలెక్టర్లు, ఇతర దొరల పేర్లు సాధ్యమైనంత వరకు ఇంగ్లీషులో కూడ సేకరించి ప్రకటించినాము. అంతేకాక కొందరి ప్రముఖుల గురించి, ఇతర సంబంధిత సమాచారములు అధోజ్ఞాపికలో (Foot Note)వివరింప ప్రయత్నించాము. రచయిత తండ్రి గారైన వెంకటరత్నం(1850-1908) గారి దినచర్య పుస్తకమునుండి తారీఖు వారీగా యిచ్చిన సమాచారములో వున్నవే కాక గోదావరి జిల్లా మాన్యువల్ నుండి కూడా సమకాలీనమైన అనేక సామాజిక, సాంఘిక,

రాజకీయ విశేషాలు చేర్చినారు. ఇంకా మరి కొన్ని స్వవిషయములైననూ చాలా వరకు 19వ శతాబ్దపు నాటి జీవిత విధానాలను చాటునవిగా నుండినందువలన వాటిని అలాగే వుంచి అతి సాధారాణమైనవాటిని తొలగించినాము.

ఈ సంపుటిలో ప్రస్తావించిన అనేక సంస్థానాధీశులు(జమీందార్లు) వారి దత్త పుత్రులు, ఔరస పుత్రులు, దాయాది / జ్ఞాతి కుటుంబ శాఖలు ఉండడం వల్ల చదువరుల సౌకర్యముకొరకు కొందరు ముఖ్యమైన రాజాల పేర్లు, సంబంధ బాంధవ్యాలు తెలుపుతూ జాబితా జతచేసినాము. దివాన్జీ శివరావు పంతులు (1829-1892) గారి కుటుంబ సభ్యులు పేర్లను అనుబంధములో సూచించడమైనది. పిఠాపురం రాజాగారి, శివరావు పంతులు గారి సంక్షిప్త వంశ వృక్షములు అనుబంధముగా జతచేసినాము.

సంపుటిలో ప్రస్తావించబడిన అనేక వ్యాసములకు, గ్రంథములకు అంతర్జాల లంకెలు కూడా ప్రకటించినాము. కానీ వాటిని తెరచి చూచుట ఈ సంపుటిలో సాధ్యముకాదు. త్వరలో వెలువడనున్న ఈ సంపుటియొక్క ఇ- పుస్తకము లో చూడగలరు. ఆ లంకెలను ఇ-పుస్తకములో జాబితాగా కూడా ప్రకటించియుంటిమి. ఈ సంపుటి యొక్క ఇ-పుస్తకమును PDF ప్రతిగా pothi.com నుంచి Free గా Download చేసుకుని చూడవచ్చును. అంతేకాక ఈ సంపుటి లో ప్రస్తావించబడిన వివిధ వ్యాసములు, గ్రంథములు మొదలగునవి ఇంటర్నెట్ అర్కైవ్స్ లోకి కూడా అప్ లోడ్ చేసి ఉపలబ్ధి చేసినాము. వాటి అంతర్జాల లింకులే ఇ-పుస్తకము లో ఇవ్వబడినవి. చరిత్ర పరిశోధకులకు ఈ వ్యవస్థ ఉపయోగపడగలదు.

ఈ సంపుటిలో పిఠాపురం సంస్థానం గురించిన కథ ఎక్కువ భాగము దివాన్జీ శివరావు పంతులు(1829-1892)గారి ఉద్యోగ నిర్వాహణా కాలానికే (19వ శతాబ్దంలోనే) కేంద్రీకృతమై ఉన్నందున ఆ సంస్థానపు చరిత్ర విశేషాలను వివరంగా తెలియచేస్తూ రచయిత శివరావుగారు రచించిన రెండు వ్యాసములున్నూ అనుబంధములు 1,2 గా చేర్చినాము. ఈ సంపుటిలో సంస్థానాధీశులు, 19వ శతాబ్దపు పిఠాపురం రాజాల సమకాలీన దాయాదులు, వీరి ప్రక్క సంస్థానాలైన బొబ్బిలి, వెంకటగిరి, గొల్లప్రోలు, కోలంక-వీరవరం,కిర్లంపూడి మొదలగు ఇతర

సంస్థానాలతో పరస్పర సంబంధబాంధవ్యాలవలన కలిగిన క్రొత్త తరంవారు, వారి అసలు పేర్లు, దత్తత వలన కలిగిన క్రొత్త పేర్లు ప్రస్తావించబడినవి. ఇంతేకాక ముందు తరంలోని వారి పేర్లు కొన్ని క్రొత్త తరంలోనుండుటవలనూ సంక్లిష్టత అధికమైనది. సంపుటి చివర సంస్థానాధీశుల జాబితాగా ప్రకటించినప్పటికీనీ ఆ జాబితాలో సంపుటిలో ప్రస్తావించబడినవారి అందరి పేర్లకు వివరణ ఇచ్చుట సాధ్యపడలేదు.

ఈ సంపుటి చిత్తు వ్రాతప్రతిలో చేతివ్రాతను అవగాహనం చేసుకొనుటయే మొదటి అవరోధము. ఇందలి విశేషాలు 19వ శతాబ్దములో వాడుకలోనుండిన ఉర్దూ-పారసీక పదాలు తెలుగు నుడికారములతో కూడినవగుటవలన వాటిని నిర్ధారించుట ఇంకా కష్టతరమైన పని. అట్టివి పరిశీలించి నిర్ధారించుటలో అమూల్యమైన సహాయంచేసిన మా ముంబై మిత్రులు, శ్రీ చీర్ల చంద్రశేఖర్[3] గారికి వారికీ మా హృదయ పూర్వక ధన్యవాదములు.

అక్కడక్కడ అవగాహన చేసుకోలేని సందర్భములలో రచయిత వ్రాసిన సమాచార సమగ్రతకు భంగం కలిగించకుండా సంపాదకులుగా మా సూచనలు కుండలీకరించి వాలు అక్షరములతో(italics in parenthesis) ప్రకటించామని పాఠకులు గమనించగలరు.

ఈ సంపుటి చివరిలో ప్రకటించిన సుమారు 150 పారిభాషిక పదాలు చాలా ప్రయాస, ప్రయత్నము వలన సాధ్య పడినవి. రచయితయే కొన్నిటిని సందర్భానుసారంగా వివరించియున్నారు. ఇంకా కొన్నిటిని బ్రౌను నిఘంటువు, 1934 సం. రచయిత ప్రకటించిన వ్యవహార కోశము[4], కురుగంటి సీతారామాచార్యులు గారి శబ్దరత్నాకరము, ఆన్ లైను ఆంధ్ర భారతిలనుండి సేకరించాము. ఇంకా చాలా పదాలను సాహిత్యకారులైన మా ముంబై మిత్రులు శ్రీ చీర్ల

---

[3] Shri Cheerla Chandrasekhar: retired as Assistant General Manager, Bank of India and later worked as Vice President in a foreign bank and as a senior consultant to a leading FX consultancy firm, Mumbai

[4] 1934 సం. కీ.శే. దిగవల్లి వేంకటశివరావుగారు(1898-1992)ప్రకటించిన వ్యవహార కోశము ఇంటర్నెట్ ఆర్కైవ్సులో చూడగలరు.

https://archive.org/details/1934_20250130

చంద్రశేఖర్ గారు తెలియచేశారు. మరి కొన్ని వ్యవహారిక పదాలను వయోవృద్ధులు శ్రీ చయనం సుబ్రమణ్య శర్మ దంపతులు అందించారు. వీరికి మా కృతజ్ఞతాభివందనాలు.

మా చిరకాల మిత్రుడు శ్రీ జి.ఆర్.కె మూర్తి[5], వారి సాంకేతిక సిబ్బంది సహాయానికి, సంపుటి సంకలనానికి వన్నె తెచ్చే అమూల్య సూచనలందించిన మా లండను మిత్రుడు శ్రీ పరుచూరి శ్రీనివాస్ గారికి మా కృతజ్ఞతాభినందనలు.

.

కాపీ రైటు కలిగిన డా. డి.వి శివరావు[6] (రచయిత శివరావుగారి మనుమడు) సహకారం అభినందకరం.

శ్రీ యామిజాల ఆనంద్ గారి ద్వారా కీ.శే. శతావధాని చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారి అపురూప ఛాయాచిత్రములిచ్చిన వారి ముని మనుమడు శ్రీ చెళ్ళపిళ్ళ సుబ్రహ్మణ్యం గారికి మా కృతజ్ఞతలు.

అనేక నిర్విరామ కార్యక్రమాలతో వుండినా మా అభ్యర్ధనను అంగీకరించి వారి ముందు మాటతో ఈ సంపుటికి మరింత విలువ చేకూర్చిన ప్రముఖ కవి, సాహిత్యకారులైన డా. వోలేటి పార్వతీశం[7]గారికి మా కృతజ్ఞతాపుర్వక ధన్యవాదాలు.

---

[5] Shri G.R.K. Murty retired as Assistant General Manager of Bank of India. Presently he is Managing Editor of IUP Publications, Hyderabad

[6] Dr. D. V. Siva Rao is a Google Scholar. He is professor of Pharmacology in Bill Gaton College of Pharmacy, East Tennessee State University, U.S.A

[7] Dr. Voleti Parvateesam has a Ph.D. in Literature and is a former Executive Programme Officer of Doordarshan and much earlier in All India Radio also.

ఈ సంపుటిలో ప్రస్తావించిన అలనాటి పిఠాపురం సంస్థానమునూ, అప్పటి రాజా గంగాధరరామారావుగారు చేసిన అనేక మహత్తర కార్యముల స్మరణీయకములు సేకరించుటకు ఆసక్తితో వచ్చిన సహ సంపాదకులవారిని కోటలోనికి ఆహ్వానించి, అనేక విషయాలపై చర్చించి, కోటలోపల సంచరించి ఛాయా చిత్రములు తీసుకునుటకు తమ ఆమోదము తెలిపిన శ్రీ రావు వేంకట మహీపతి రామరత్నా రావు బహద్దర్ (జననం1951) శ్రీ మహరాజా వేంకట కుమార మహీపతి సూర్యారావు బహద్దర్ CBE [8] (1885-1964)వారి కుమారులు మరియూ సంస్థానంకోట వారసులు గారికి మా కృతజ్ఞతాభివందనాలు.

సంపాదకులకు,సహసంపాదకులకు ఈ సంకలనానికి వివిధ రకములుగా సహకరించిన బంధుమిత్రులందరకూ మా మనఃపూర్వక కృతాభినందనలు.

06-04-2026 దిగవల్లి రామచంద్ర
హైదరాబాద్ దిగవల్లి వేంకట చంద్రశేఖర రావు

[8] CBE (Commander of the Order of British Empire)

దిగవల్లి వంశం,కుటుంబం

పిఠాపురం సంస్థానాధిపతి అయిన శ్రీ రాజా రావువెంకట గంగాధరరామారావు గారి దగ్గర 1-6-1863 తేదీ మొదలు శిరస్తాదారు గాను, మేనేజరు గాను, దివాన్ గాను మొత్తం 18 సంవత్సరాలు ఉద్యోగం చేసి 1892 సం. లో దివంగతులైన దిగవల్లి వేంకటశివరావు పంతులుగారు మా పెద్దతండ్రి గారు .

మా పితామహుడైన తిమ్మరాజు పంతులు[9] గారి జేష్ట పుత్రులు. వారి [*తిమ్మరాజు పంతులుగారి*] రెండవ కుమారుడు మా తండ్రిగారైన వెంకటరత్నం పంతులు గారు. వీరు పూర్వపు తూర్పు , పశ్చిమగోదావరి జిల్లాల లోని చాలా ఊళ్ళలో డిప్యూటీ తాశీల్దారు గాను, సబ్ మెజిస్ట్రేట్ గాను పని చేసి, 1908 సం.లో స్వర్గస్తులైనారు. అందువల్ల నాకు వారి(మా పెద తండ్రి) పేరు పెట్టినారు. నా పెదతండ్రి గారికి పిల్లలు లేరు.

మా వంశవృక్షములో కనబడే మూల పురుషుడైన ఎర్రం రాజుగారికి మా పితామహుడైన తిమ్మరాజు గారు ఆరవతరం వారు . ఎర్రంరాజు గారి కుమారుడు రాగరాజు గారికి ఇద్దరు కుమారులు. రెండవ కుమారుడు రాజులు గారికి ఆరుగురు కుమారులు. (*ఆరుగురులో*) రెండవ

---

[9] దిగవల్లి తిమ్మరాజు గారి పూర్తి వివరాలకు: దిగవల్లి తిమ్మరాజు పంతులు(1794-1856) జీవిత చరిత్ర సంపుటి(2023సం) 132 పుటలు ప్రతులకు నవోదయా బుక్ హౌస్. Internet Archives నుంచి గాని, pothi.com లో ఇ-పుస్తకముగ గానీ డౌన్లోడు చేసుకొనవచ్చును.

https://archive.org/details/ebook_20241222

కుమారుడైన వానప్ప గారికి 9 మంది సంతానము. వారిలో ఆరవ వాడు వెంకయ్య గారు. వెంకయ్యగారి భార్య నాగమ్మ గారు. వారికి రామలింగము గారు, నాగన్న గారు అనే ఇద్దరు కుమారులు. ఆ రామలింగము గారే మా ప్రపితామహులు. వారి భార్య పేరు సీతమ్మ. మేము ఆరు వేల నియోగి బ్రాహ్మణులము. కౌండిన్యస గోత్రులము. ఆపస్తంభ సూత్రులము. యజు శ్శాఖకు చెందిన స్మార్త బ్రాహ్మణులము. మా ఇంటి పేరును బట్టి మా వంశీకులు అసలు స్వగ్రామం కృష్ణాజిల్లాలోని నూజివీడుకు ఆరు మైళ్ళ దూరంలో ఉన్న దిగవల్లి గ్రామం అని తెలుస్తూనే ఉన్నది. అయితే, మా కుటుంబము వారు ఆ గ్రామమును చిరకాలం క్రిందటనే వదిలి, దగ్గరలో ఉన్న కొయ్యూరు గ్రామంలో స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. ఆ కారణంగా దిగవల్లి వారు అనే ఇంటి పేరు స్థిరపడి పోయింది.

మా పితామహుడైన తిమ్మరాజు గారికి పిత్రార్జితము లైన ఇళ్ళు, వాకిళ్ళు, భూములు, పుట్రలు ఆగ్రామంలోనే ఉండేవి. అవేగాక దాని దగ్గరలో ఉన్న బొమ్ములూరు, రమణక్కపేట గ్రామాలలో కూడా భూములు ఉండేవి. మా కుటుంబం వారికి పూర్వంలో గోల్కొండ హైదరాబాదు నవాబుల కాలంలో గ్రామ ఉద్యోగుల జీతాల పైన సంప్రతి కరణాలు[10] వసూలు పరచుకొనే లావాజ్ మాల్[11] అనే రుసుమును వంశ పారంపర్యముగా అనుభవించే మిరాశి[12] ఉన్నదని మా పితామహుడు వ్రాసి ఉన్నందువల్ల మా కుటుంబము వారు మూడు

---

[10] సంప్రతి కరణాలు = కొన్నిగ్రామాలకు కరణీకం చేసే వారు

[11] లావజ్ మాల్ = ఉద్యోగస్తుల జీతాలపై పన్ను

[12] మిరాశీ = వంశపారంపర్యం గా వచ్చు హక్కు

వందల సం.ల పూర్వకాలముననే ప్రముఖ కుల కరణాలై ఉండినట్లు కనబడుతోంది.

మా ప్రపితామహుడు రామలింగం గారు 1849 సం. వరకు జీవించి ఉన్నారు. ఆయనకు తిమ్మరాజు, రాజన్న, అప్పన్నలనే కుమారులును; అచ్చమ్మ, రాజమ్మ లనే కుమార్తెలును కలిగినారు. ఈ తిమ్మరాజు గారే మా పితామహులు. వీరి పెద్ద భార్య వెంకమ్మ గారు. రెండవ భార్య అచ్చమ్మ గారు కూడా నిస్సంతులుగా చనిపోయినారు. మూడవ భార్య అయిన సీతమ్మ గారికి వేంకటశివరావు, వెంకటరత్నం అనే కుమారులును; వెంకట మాణిక్యాంబ అనే కుమార్తెయును కలిగినారు. తిమ్మరాజు గారి జనన తేదీ, సం. తెలియదు. కానీ వారు బహుశా 1794 సం. ప్రాంతాన జన్మించారని చెప్పడానికి కొన్ని నిదర్శనాలు ఉన్నాయి

మా పితామహుని బాల్యం నాటికి కుటుంబం ఋణగ్రస్తమైనది. ఆయన బాల్యంలోనే స్వగ్రామమైన కొయ్యూరు వదిలి, అప్పట్లో బందరు తర్వాత దగ్గరలో ఉన్న పెద్దపట్టణం అయిన ఏలూరు వెళ్లి, అక్కడ మూడేళ్లు చదువుకొని, ఇంగ్లీషు కూడా నేర్చుకుని, ఉద్యోగం కోసం 1802 సం.లో కొత్తగా స్థాపించబడిన కోర్టు గల పట్టణమైన రాజమహేంద్రవరం వెళ్లారు. ఆ కాలంలో నూరు ఇంగ్లీషు మాటలు వస్తే, కచేరీలలో ఉమ్మేదువారీ పని ఇచ్చేవారు. 1811 సం.లో ఉద్యోగం దొరికింది.

మా పితామహుడు రాక్షస నామ సంవత్సర పుష్య శుద్ధ షష్టి ఆదివారం ది. 13-01-1856 వ తేదీన వ్రాయించిన వీలునామాలో ఇట్లు వ్రాసిరి. నేను బాల్యం మొదలుకొని పిత్రార్జితమైన సొమ్ము ఎంత

మాత్రము తెచ్చుకొనకుండా, కొన్ని సం.లు ఏలూరులో ఉండి, ఇంగ్లీషు వగైరాలు చదువుకొని, అక్కడి నుండి రాజమహేంద్రవరం వచ్చి, అక్కడ మా తల్లిగారి పెద్ద తల్లి కుమారుడైన ముదిగొండ గురవయ్య గారి వద్ద కొన్ని రోజులు ఉన్నంతలో ఆయనకు కాయిలా వచ్చినప్పుడు ఆయన పని అనగా జిల్లా కోర్టులో శిరస్తా ముదత్ గారీ పని యాక్టింగ్ కూడా చేసినాను. అంతట ఆయన దైవగతి తప్పి చనిపోయినందున ఆ పని నిలిచిపోయినది. తరువాత మేస్తర్ పీటర్ ర్రీడ్ కాజులెట్టు(Mr. P. R. Cazalet) జడ్జి గారితో కామరాజు గడ్డ లింగయ్య గారు మొదలైన వారు సిఫారసు చేయగా ఆ కోర్టులో రికార్డుకీపర్ మదత్ గారీ, తరువాత సిరస్తామదత్ గారీ, శిరస్తా హెడ్ మద్దతుగారి వగైరా పనులను, ఆ తరువాత కలెక్టర్ ఆఫీసులో మేస్తర్ పై బార్డు(Mr. H. Vybard) దొరగారి సిఫారసు మూలముగా ఇంగ్లీషు రికార్డుకీపరీ పని, సాల్ట్ రైటరీ అమల్ దారీ, నాయబు శిరస్తాదారీ, ఆక్టింగ్ హెడ్ శిరస్తాదారు, యాక్టింగ్ సదరీ పనులు, కొంచెం తక్కువ 40 సం.లు పర్యంతము ఇదివరకు చేసి ఉన్నానని వ్రాశారు. రికార్డ్ మదత్ గారి పనిలో చేరినది 1811 సం.రం అని రాజన్న గారి ఖరారునామా వల్ల తెలుస్తోంది. మదద్గారి అనే మాట మహారాష్ట్ర పదము. సహాయకుడు అనే అర్థము. రికార్డు కీపర్ మదద్గారి అనగా రికార్డ్ కీపర్ క్రింది సహాయ ఉద్యోగి. నాయబ్ శిరస్తాదార్ అనగా డిప్యూటీ శిరస్తాదార్. తిమ్మరాజు పంతులుగారు జన్మించే నాటికి అనగా 1794 సం. నాటికి కృష్ణ, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, విశాఖపట్నం జిల్లాలలో ఇంగ్లీషు వర్తక కంపెనీ వారి పరిపాలన సాగు తున్నది. ఆ జిల్లాలను ఆ కాలంలో ఉత్తర సర్కారులనేవారు. వాటిని 1766 సం.లో కంపెనీవారు హైదరాబాదు నవాబు నిజాం అలీఖాన్ వలన కౌలు పొంది, 1769 సం.లో స్వాధీనం పొందారు. అప్పటినుండి

మచిలీపట్నంలోని కంపెనీ వారి ఏజెంటు చీఫ్-ఇన్-కౌన్సిల్ అనే పేరుతో వర్తక వ్యాపారం తో పాటు, దేశ పరిపాలనము కూడా జరిగించారు. అప్పట్లో దేశమంతా చిన్న పెద్ద సంస్థానముల కింద ఉండేది. అక్కడక్కడ సైనిక దళాలను ఉంచి జమిందార్లు తిరుగుబాటు చేయకుండా అణచి యుంచి వారి వల్ల పేష్కషు వసూలు చేసేవారు. ఆనాటికి దేశ పరిపాలనకు , న్యాయ పరిపాలనకు, శాసన విధులు లేవు. చెన్నపట్టణం గవర్నర్, ఆయన సలహా సంఘం వారు పంపే తాఖీదుల ప్రకారం పరిపాలన జరిగేది. **1786 సం.లో రెవెన్యూ బోర్డు స్థాపించారు.** వంగ రాష్ట్రంలో గవర్నర్ జనరల్ కారన్ వాలిస్(Charles Cornwallis) చేసిన పరిపాలనా సంస్కరణలు, రెగ్యులేషన్ లనే శాసన విధుల ననుసరించి మద్రాసు రాజధాని పరిపాలన కూడా జరిగేది.

1794 సం.లో మచిలీపట్నం చీఫ్ పరిపాలన రద్దుచేసి, దేశాన్ని జిల్లాలుగా విభజించారు. గుంటూరు, మచిలీపట్నం, విశాఖపట్నంలలో జిల్లా కలెక్టర్లను నియమించారు. కాకినాడ, రాజమహేంద్రవరం, మొగలి తుర్రులలో ముగ్గురు డివిజనల్ కలెక్టర్లు ఉండేవారు . ఈ ముగ్గురు కలెక్టర్ల మండలాలు కలిపి **1820 సం.లో రాజమహేంద్రవరం జిల్లాగా రూపొందించారు.** 1802 సం.లో దేశ పరిపాలన కట్టుదిట్టంగా జరపడానికి 34 రెగ్యులేషనులను మద్రాసు గవర్నర్ సభ వారు జారీ చేశారు. జమీందారుల అధికారాలు తీసివేసి నారు. పూర్వపు దేశీ ఉద్యోగులలో దేశపాండ్య, మజుందార్ మొదలైన వారిని తొలగించినారు. గ్రామ కరణమును నెలవారీ జీతగానిగా చేసి కలెక్టర్ల కింద రెవెన్యూ పరిపాలనా విధానమును స్థాపించారు. ప్రతీ జిల్లాలో ఒక ఇంగ్లీషు జడ్జి క్రింద

కోర్టును స్థాపించారు. జిల్లా జడ్జినే జిల్లా మెజిస్ట్రేట్ గా నియమించి, పోలీసులపై అధికారిగా చేశారు.

1816 సం.లో జిల్లా జడ్జి అధికారం తొలగించి, జిల్లా కలెక్టరునే మెజిస్ట్రేట్ గాను, పోలీసులపై అధికారిగాను నియమించారు. 20 చదరపు మైళ్ళకు ఒక ఠాణా ఉండేది. 1835 వ సం వరకు జిల్లాలో హెడ్ ఆఫ్ పోలీసు అనే ఉద్యోగి ఉండేవాడు. ఇంగ్లీషు విద్యా విధానం లేదు. పాఠశాలలు కూడా లేవు. ప్రైవేటుగా నూరు ఇంగ్లీషు మాటలు నేర్చుకుని సర్కారు కచేరీలో ఉమ్మేదువారీగా పని నేర్చుకుంటే, చిన్న ఉద్యోగం దొరికేది. 1837 సం. వరకు ప్రజలకు తపాలా సౌకర్యాలు లేవు. సర్కారు వారికి వారి ఉద్యోగులుకు మాత్రం తపాలా సౌకర్యాలు ఉండేవి. తరువాత క్రమక్రమంగా తపాలా సౌకర్యాలు వృద్ధిచేసి, జిల్లా కలెక్టర్ క్రింద ఉత్తరాల బట్వాడా ప్రారంభించారు. 1854సం.రం తర్వాతనే నేటి తపాలా పద్ధతులు వచ్చినవి. 1850సం.రం నాటికి కూడా రాకపోకలకు సరి అయిన రోడ్లు లేవు. ఉద్యోగులు గుఱ్ఱాలపైన, సవారీలలోను పర్యటించేవారు. 1820వ సం. లో రాజమహేంద్రవరం జిల్లా ఏర్పాటు చేసినప్పుడు జిల్లా కలెక్టర్ కచేరి కాకినాడలో స్థాపించారు. జిల్లా కలెక్టరు క్రింద శిరస్తాదారు, రెవెన్యూ లెక్కల ఉద్యోగి మున్షి , నేటి కరస్పాండెన్స్ శాఖ, ఇంగ్లీషు, లెక్కల కరస్పాండెన్స్ శాఖ, ఖజానా ట్రెజరీ, రికార్డు ఆఫీసు, సాదరవాడి అనే శాఖలు ఉండేవి. ఆ కాలంలో మహారాష్ట్ర దేశస్థ మాధ్వ వ్యాపారులు అన్ని శాఖలలోనూ అత్యధిక సంఖ్య ఉద్యోగులుగా ఉండేవారు. వారికి వారి శాఖాభిమానం హెచ్చు. సాధారణంగా ఇతర శాఖల వారిని తమ బంధు వర్గములో చేరిన కరణ, కమ్మ వ్యాపారులను, గోల్కొండ వ్యాపారులను తప్ప ఇతర శాఖల బ్రాహ్మణులను చేర నిచ్చే వారు కారు. ఆ కాలంలో

దొరలకు దేశ భాషలు రావు. ఈ వ్యాపారులు సులభముగా ఇతర భాషలు నేర్చుకునే వారు. వారు లెక్కలలో ప్రవీణులు. సాధారణంగా కలెక్టర్ తన శిరస్తాదారు పైన ఆధారపడేవాడు. జిల్లా పరిపాలన మంచి చెడ్డలు కలెక్టర్ల యోగ్యతను బట్టి, శక్తి సామర్థ్యాలను బట్టి ఉండేవి. కొందరు కలెక్టర్లు కఠినముగాను, కొందరు సోమరిపోతులు గాను ఉండేవారు. కొద్దిమంది అవినీతిపరులుగాను కూడా ఉండేవారు. ఈ కలెక్టర్ కచేరి లో పనిచేసే శిరస్తాదారు మొదలైన వారిలో చాలామంది అవినీతిపరులుగాను, లంచగొండులుగాను ఉండేవారు. కచేరీలో కుట్రలు, కక్షలు కూడా ఉండేవి. దీని వల్ల జిల్లా పరిపాలన పాడయ్యేది. దీనిని గురించి రాజమండ్రి, గుంటూరు, మచిలీపట్నం జిల్లాలలో 1843సం. నుండి 1849సం మధ్య విచారణలు జరిగినవి.

మా తాతయ్య గారు చాలా కాలం రికార్డు కీపరుగా, మధ్య మధ్య ఇతర ఉద్యోగాలు చేసినట్లు కనపడుతుంది. శివరావు పంతులుగారు విరోధి నామ సంవత్సర వైశాఖ శుద్ధ ఆదివారమునకు సరి అయిన ది. ది.17-5-1829వ తేదీన జన్మించారు. వీరి తల్లి గారు తిమ్మరాజు పంతులు గారి మూడవభార్య అయిన సీతమ్మ గారు. అప్పటికి వీరి తండ్రి గారు కాకినాడలోని తాలూకాలో అమల్దారు లేక తహసీల్దారుగా ఉండేవారు. వారికి కాకినాడ రాబర్ట్ సన్ పేటలో కలెక్టర్ గారు ఇచ్చిన విశాలమైన స్థలములో రెండు మండువాల భవంతి, ఇంకొక లోగిలి, కొట్లు కట్టించుకుని కాపురమున్నారు. ఆ వీధిలోనే పెద్ద బజారు వచ్చి కలిసే చోట శ్రీ త్రిపుర సుందరీ సమేత శ్రీ భీమేశ్వరస్వామి వారిని ప్రతిష్టించి, పెద్ద గుడి, గోపురములు, ప్రాకారములు నిర్మించారు. శిలామయ మండపమును 1828 సం.న నిర్మించినట్లు, ముఖ్యాలయము, జగజ్జనాలయము, కళ్యాణ

మండపము, గోపుర ప్రాకారములు, 1831సం.లో నిర్మించినట్లు దేవాలయములోని శిలాశాసనములు[13] తెలుపుతున్నవి.

శ్రీ సాంబశివుని అనుగ్రహం వల్లనే తమకు పుత్రుడు కలిగినాడనే విశ్వాసంతో తిమ్మరాజు గారు తమ కుమారునికి వేంకటశివరావు అనే నామకరణం చేశారు.

తిమ్మరాజు గారు తమకు గల పలుకుబడి ఉపయోగించి అరట్లకట్ల ప్రొప్రైటర్ శ్రీ రాజా బుచ్చి సీతయ్యగారి చేత రెండు పుట్ల భూమిని, పలివెల ప్రొప్రైటర్ శ్రీ రాజా చెలికాని జానయ్య రావు గారి చేత ఒక పుట్టెడు భూమిని శ్రీ భీమేశ్వర స్వామి వారికి సమర్పింప చేశారు. పుట్టి అనగా 8 ఎకరాలు.

పంతులుగారు తమ తమ్ముడైన రాజన్న గారికి చదువు చెప్పించి, వివాహము చేసి అప్పటి కలెక్టర్ అయిన ఆన్ స్లే దొరగారితో చెప్పి ది.1-3- 1828 తేదీన కాకినాడ తాలూకా ఆఫీసులో పేష్కారు పని ఇప్పించారు. పేష్కారు అనగా అమల్దారు క్రింద చిన్న ఉద్యోగము. రాజన్నగారు, భార్య, తిమ్మరాజుగారి ఇంట్లోనే ఉండేవారు. తరువాత 1834 సం.మున వేరింటి కాపురం పెట్టారు.

దివాన్జీ శివరావుగారి బాల్యం-నాటి రాజమండ్రీ జిల్లా

శివరావుగారికి ఐదవ ఏట అక్షరాభ్యాసమైనది. ఆ కాలంలో బ్రాహ్మణ కుటుంబాల ఆచారం ప్రకారము గర్భాష్టమమున అనగా ఏడవఏట ఉపనయనము జరిగినది. ఇంకొక తమ్ముడైన అప్పన్న గారికి

---

[13] రెండు శిలాశాసనముల ఛాయాచిత్రములు అనుబంధము16 గా చూపబడినవి

విద్య చెప్పించి, ఉపనయనము, వివాహము కూడా జరిపించారు. ఆయన దేశాంతరం వెళ్లి తిరిగి రాలేదు. చిన్నతనములోనే శివరావుగారికి కూడా వివాహము చేశారు. భార్య పేరు మహాలక్ష్మమ్మ గారు.


ఆయన బాల్యం నాటికి ఇంగ్లీషు విద్యా విధానము లేదు. మద్రాసు గవర్నర్ సర్ థామస్ మన్రో (SirThomas Munroe) గారి ప్రోత్సాహంతో కాకినాడలోనూ, రాజమండ్రిలోనూ, నరసాపురంలోనూ బేయర్డ్ (R. Bayard)అనే కలెక్టర్ 1826వ సం.లో మూడు పాఠశాలలు స్థాపించారు. అవి 10 సం.ల పాటు పనిచేసి అంతరించినాయి.

ఆ కాలం నాటి అందరు పిల్లల లాగానే శివరావుగారు వీధి బడిలో గుంట ఓనమాలు దిద్దారు. వర్ణ క్రమము, పెద్ద బాలశిక్ష లో కనబడే పాఠాలను, ఎక్కాలను, వెరసులను[14] నేర్చుకొని పుస్తకం పట్టి భారత, భాగవతములు మొదలైనవి చదివారు. సంస్కృతం అభ్యసించారు. ఇంగ్లీషు కూడా నేర్చుకున్నారు. ఆ కాలంలో పాఠశాలలు గాని, పరీక్షలు గాని లేవు. శివరావు పంతులు గారి తెలుగు దస్తూరి మంచి అందమైన కలుపు వ్రాత(*కలగలపు*). అందులో కొట్టివేతలు ఉండవు. ఆయన స్వదస్తురీతో వ్రాసిన ఉత్తరాలు, అర్జీలు వగైరా ఆయనకు గల భాషా జ్ఞానము, వ్యవహార జ్ఞానము తెలుపుతాయి. ఆయన ఇంగ్లీషులో సంతకము చేసిన కాగితాలు కొన్ని కనబడుతున్నాయి.


---

[14] కూడికలు, లెక్కలు, పద్దులు

తిమ్మరాజు పంతులు గారు కాకినాడలో రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కచేరీలో 1834 - 35 సం.ల నాటికి ఇంగ్లీషు రికార్డు కీపరుగా ఉద్యోగం చేస్తున్నారు. అయితే, ఆయనను కలెక్టర్ గారు అనేక ఇతర డ్యూటీలకు పంపుతూ ఉండేవారు. అప్పట్లో కొత్తపల్లి అమల్దారుడు జొన్నలగడ్డ కొండయ్య, ఆయన అన్న, మల్లప రాజు గార్లు అక్కడ జరిగిస్తూ ఉన్న అక్రమ చర్యలను గూర్చి విచారించడానికి కలెక్టర్ క్రాలె (A. Crawley) దొరగారు పంపగా, తిమ్మరాజు గారు విచారించి, రిపోర్టు దాఖలు చేశారు. అటు తరువాత కలెక్టర్ కచేరీ లో అకౌంటెంట్ గాను, హెడ్ క్యాష్ కీపర్ గాను పనిచేసిరి. 1847-50 సం.ల మధ్య ఆనకట్ట స్పెషల్ డ్యూటీ సబ్ కలెక్టర్ ఫోర్బ్స(Forbs) గారు ధవళేశ్వరంలో, రాజమహేంద్రవరంలో ఆయా పనులు నిర్వహిస్తూ ఉన్న సందర్భంలో తిమ్మరాజు గారు ఆయన క్రింద కొన్నాళ్లు పనిచేశారు. గోదావరి నది ఆనకట్ట నిర్మాణ పథకాన్ని గురించి పరిశీలించి, రిపోర్ట్ చేయడానికి నియమింపబడిన ఇంజనీరు అయిన కెప్టెన్ ఆర్థర్ కాటన్ (Captain Arthur Cotton) దొర ధవళేశ్వరం దగ్గర ఆనకట్ట నిర్మించడానికి నిశ్చయించాడు. ఆనకట్ట యొక్క ఆకారము, దాని పొడుగు, అందుకు కావలసిన రాయి, సున్నము, ఇనుము వగైరాల అంచనాల వివరాలనే గాక గోదావరి డెల్టా లో అప్పటికి సాగు అవుతున్న భూములు, వాటి విస్తీర్ణం, ఆనకట్ట క్రింద సాగుబడి కాగల పంట విస్తీర్ణము, ఆదాయ వ్యయాలు వగైరా లెక్కల


GENERAL SIR ARTHUR T. COTTON, K.C.S.I., LATE MADRAS ENGINEERS.

అంచనాలు కూడా తయారు చేసి , గవర్నమెంట్ కు పంపాలి. అందుకోసం



కలెక్టర్ కచేరీలో ఆ వివరాలన్నీ సేకరించి, అంచనాల లెక్కలు తయారు చేయవలసి వచ్చినది. తిమ్మరాజు గారు ఈ పనిలో ఉన్నారు. అప్పటి కలెక్టర్ అయిన ప్రెండరు గాస్టు(T.Prendergast) గారు ఈ అంచనాలను తన రిపోర్టుతో రెవెన్యూ బోర్డు కు పంపించాడు. ఇంజనీరింగ్ రిపోర్టును, ఈ రిపోర్టుతో పరిశీలించి, రెవెన్యూ బోర్డు వారు ఆమోదించారు. ఆనకట్ట నిర్మాణానికి సీమలోని తూర్పు ఇండియా వర్తక సంఘం డైరెక్టర్ అనుజ్ఞ కోసం మద్రాస్ గవర్నర్ ట్వీడ్ డేల్ (Marquis Twiddale) ప్రభువు వారికి సిఫారసు చేశాడు. డైరెక్టర్ల అంగీకారం త్వరలోనే వచ్చినది. అంతట 1847సం. ఏప్రిల్ నుండి ఆనకట్ట నిర్మాణానికి సన్నాహాలు చేయడం ప్రారంభించారు. ముందుగా చేయవలసిన పనులు ఎన్నో ఉన్నవి. ధవళేశ్వరానికి దగ్గరలోనే దానికి కావలసిన ప్రశస్తమైన రాయి, సున్నము కొండలలో నున్నవి. అక్కడ క్వారీలలో తవ్వి , తీసి ట్రాము, రైలుపేగనులలో నది ఒడ్డుకు చేర్చవచ్చును.

రాయి, సున్నము, ఇతర సరుకులు చేరవేయడానికి పడవలు కావాలి. ఈ రైలు వేగనులు, పడవలు, ఇతర సామానులు తయారు చేయడానికి ఒక కర్మాగారం నిర్మించాలి. అక్కడ పనిచేసే ఇంజనీర్లకు, ఉద్యోగులకు, సిబ్బంది నివాసానికి, బంగళాలు, ఇండ్లు, కార్యాలయాలు కట్టాలి. ఆనకట్ట పనులు చేయడానికి రోజుకు పదివేల మంది కూలీలు, 500 మంది కమ్మర్లు, 500 మంది వడ్రంగులు, కావాలి. ఈ పనివారిని,

సరుకులను సప్లై వగైరా పనులు, అజమాయిషీ సక్రమంగా జరిగించడానికి అధికారులు కావాలి.

ధవళేశ్వరం పిఠాపురం జమీందారీలో చేరిన గ్రామం. అప్పటి జమీందారైన శ్రీ రావు వెంకట సూర్యారావు గారు(1844-50) ఆనకట్ట నిర్మాణానికి కావలసిన సదుపాయాలన్నీ కంపెనీ అధికారులకు కలుగ చేశారు. అక్కడ వర్క్ షాపునకు, కార్యాలయాలకు, బంగళాలకు, ఇండ్లకు కావలసిన నివేశన స్థలాల నిచ్చారు. ఆనకట్ట నిర్మాణానికి నియమింపబడిన ఇంజనీరులైన కెప్టెన్ ఆర్థర్ కాటన్, కెప్టెన్ ఆర్ (ORR) [15]గార్లకు రెవెన్యూ శాఖలోని గ్రామోద్యోగులు, తాశీల్దార్లు తోడ్పడాలని ఒక్కొక్క గ్రామం ఇంతమంది కూలీ జనాభా సప్లై చేయాలనీ కలెక్టరుగారు తాఖీదు జారీ చేశారు. వారిచ్చే కూలి చాలా స్వల్పం. కూలీల చేత చాలా కఠినంగా పని చేయించేవారు. అందువల్ల కూలీలు పారిపోయేవారు. వారిని పట్టుకోవడానికి పోలీసు కాపలా ఉంచారు. శిక్షించడానికి మెజిస్ట్రేటును ఉంచారు. శిక్షించి, వారి చేత వెట్టిచాకిరి చేయించేవారు. ఈ పనులన్నీ సక్రమంగా జరగడానికి ప్రత్యేక అధికారాలతో హెన్రీ ఫోర్బ్స్ అనే దొరను సబ్ కలెక్టరుగా నియమించారు. అతని క్రింద ధవళేశ్వరంలో ఒక కచేరిని నెలకొల్పి, అకౌంటెంట్లను, గుమాస్తాలను, ఇతర సిబ్బందిని నియమించారు. సబ్ కలెక్టరుకు హుజూర్ ఉద్యోగులందరూ తాబేదారులు . సబ్ కలెక్టరు చాలా చురుకైన వాడు. అయితే, కఠినుడు. సరుకులు సరఫరా, ఆనకట్ట పనులన్నీ చాలా త్వరగా జరగాలని, సరుకుల సప్లై, కూలీల సప్లై లలో గాని మరి ఏ పనిలో కానీ ఆలస్యం జరిగినా, లోపం జరిగినా క్షమించనని


[15] Major General Charles Orr

గ్రామాధికారులకు, తాశీల్దారులకు తాఖీదులు పంపించాడు. అతడు రాజమహేంద్రవరము, కోనసీమలోని గన్నవరం , అమలాపురం వగైరా ప్రదేశాలలో పర్యటించేవాడు. ది. 8-0-1850 తేదీ వరకు అతడు సబ్ కలెక్టరుగా, తరువాత ఇతర పని మీద బదిలీ అయి వెళ్ళాడు. ఫోర్బ్స దొర ఆగ్రహానికి గురి అయ్యి శిక్షింపబడిన వారిలో తిమ్మరాజు గారి తమ్ముడు రాజన్న గారు కూడా ఉన్నారు. 1849 సం.లో ఆయన పెద్దాపురం తాశీల్దారుగా ఉండగా కూలీలను సప్లై చేయలేదని , 10 బళ్ళ సున్నం సప్లై చేయలేదని సబ్ కలెక్టర్ ఆయనను బర్తరఫ్ చేయమని పెద్ద కలెక్టర్ ప్రెండరు గ్రాస్టు (T.Prendergast) దొరకు వ్రాశాడు. కలెక్టరు రాజన్న గారిని బర్తరఫ్ చేశాడు. అయితే, తన లోపం కాదని అర్జీ ఇచ్చుకోగా 1849సం. జూన్ నెలలో ఆ ఉత్తర్వులు రద్దు చేశారు. మరొక ఉద్యోగం ఇచ్చి, రెవెన్యూ బోర్డు కు వ్రాశారు.

ఈ సబ్ కలెక్టర్ కాలంలో ఒక మారు కూలీల సరఫరాలో ఆలస్యం జరిగినదనో, తగినంత మందిని సమకూర్చలేదనో లేక ఇంకేదో లోపం జరిగినదనో ఆగ్రహించి అందుకు సంబంధించిన తాశీల్దారులను, ఇతర ఉద్యోగులను సస్పెండ్ చేసి ఇతర విధంగా శిక్షించి హుజూర్ హెడ్ క్యాష్ కీపర్ అయిన తిమ్మరాజు గారికి కూడా ఒక అణా జుల్మానా విధించాడు. ఇందులో తమ లోపం లేదని ఇది అన్యాయమని తిమ్మరాజు గారు కలెక్టర్లందరి పైన రెవెన్యూ బోర్డు యొక్క అధికారులతో 1849సం.లో నియమింపబడ్డ ఉత్తర సర్కారు కమిషనర్ సర్ వాల్టర్ ఇలియట్(Sir Walter Elliot) గారికి అప్పీలు చేశారు. ఆయన ఆ కేసు రికార్డులను, తిమ్మరాజు గారి సర్వీసు రికార్డును పరిశీలించి ఆ జుల్మానా తీసివేయటమే గాక ఉత్తర సర్కారులలోని దేశీయ ఉద్యోగులందరిలో తిమ్మరాజు గారు నీతిపరుడని, సమర్ధుడని సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్ అనే

యోగ్యతా పత్రము ఇచ్చారు. అప్పట్లో రాజమహేంద్రవరం జిల్లా పెద్ద కలెక్టరుగా ఉన్న పెండరుగాస్ట్ గార ఈ యోగ్యతాపత్రమును చూచి ఇటువంటి మంచి ఉద్యోగిని తగిన విధంగా ప్రోత్సహించాలని నిశ్చయించుకున్నారు. ఆ అవకాశం త్వరలోనే కలిగింది. పిఠాపురం జమీందారు శ్రీ రావు వెంకట సూర్యారావు గారు ది. 27 - 11- 1850వ తేదీన చనిపోయారు. ఆయన కుమారుడును, జమీందారీకి వారసుడును అయిన శ్రీ నీలాద్రి రాయణం గారు మైనర్ గా ఉన్నారు. అందువల్ల కోర్టు-ఆఫ్- రెగ్యులేషన్ క్రింద ఎస్టేటును కలెక్టర్ స్వాధీనపరచుకొని రెవెన్యూ బోర్డు అధికారం క్రింద మేనేజ్ చేయాలి. ఈ సందర్భంలో కలెక్టర్ తిమ్మరాజు గారిని నెలకు 250 రూపాయలు పెద్ద జీతం పైన పిఠాపురం ఎస్టేట్ కు మేనేజర్ గా 1851సం. ప్రారంభంలో నియమించారు. ఆ కాలంలో దేశీయులకు ఎవ్వరికీ అంత పెద్ద జీతం ఇచ్చేవారు కాదు. తన కచేరీలో ఉద్యోగం కోసం నిరీక్షిస్తూ ఉన్న ఒక వాలంటీరును కలెక్టర్ గారు మేనేజర్ చేతి క్రింద అమల్దారు లేక తాశీల్దారుగా నియమించారు.

పిఠాపురం సంస్థానము



అలనాటి పిఠాపురం కోట

పిఠాపురం జమీందారీ విస్తీర్ణము 317 చదరపు మైళ్ళు. ఇందులో 168 గ్రామాలు ఉన్నవి. కాకినాడ, సామర్లకోట, కోరంగి, కడియం, ధవళేశ్వరం, గొల్లపాలెం, గుండవరం ఈ జమీందారీ లోనివే. మూడు వేల జనాభా గల పెద్ద గ్రామాలు ఆరు వున్నవి.

1871 సం. నాటికి ఈ జమీందారీ జనసంఖ్య 1,60,000. 1802సం. లో దీని ఆదాయం 4 లక్షల రూపాయలు గా అంచనా వేసి, సర్కారుకు చెల్లించవలసిన పేష్కసు 2.6 లక్షల రూపాయలుగా నిర్ణయించారు. ఈ జమీందారీని పిఠాపురం, సామర్లకోట, విలస, మల్లవరం, పలివెల, కడియం ముఠాలుగా విభజించి పరిపాలన జరిగించేవారు. గవర్నమెంట్ తాలూకాలలోనూ, గ్రామాలలోనూ ఉన్నట్లే, జమీందారీ పరిపాలనలో కూడా చాలామంది ఉద్యోగులు ఉండేవారు. అమల్దారనే తాశీల్దారులు, ఆయన క్రింద పేష్కారులు, సముద్దారులు, ఠాణేదారులు, నిఘమానులు మొదలైన వారు; గ్రామకరణాలు, మునసబులు, "మాణే గార్లు" , వెట్టి, మోతాదు వగైరాలు ఉండేవారు, పిఠాపురం, కాకినాడకు పది మైళ్ళ దూరంలో ఉండినది.

పిఠాపురం ఎస్టేటు మేనేజర్ కార్యాలయము కాకినాడలో కలెక్టర్ కార్యస్థానము లోనే ఉండేది. ఆయన క్రింద లెక్కల గుమాస్తాలు మొదలైన వారు ఉండేవారు. కందుకూరి వీరేశలింగం గారి తండ్రి సుబ్బారాయుడు గారు తిమ్మరాజు గారి చేతి కింద 1851సం. నుండి గుమాస్తాగా పనిచేస్తూ 1853సం.లో చనిపోయారు.

పిఠాపురం జమీందారీ తాలూకు లెక్కల పుస్తకాలను, ధన కనక వస్తు వాహనాలను, చరాస్తిని స్వాధీనం చేసుకోవడంలో తన హెడ్

శిరస్తాదారైన కంభం నరసింగరావు పంతులుగారు జమీందారు గారి బంధువులతో లాలూచీ అయి, కొన్ని లెక్కలు, కొంత ధనము వగైరాలను కమ్మి పరచినాడని కలెక్టర్ గారికి అనుమానము కలిగి, శిరస్తదారును సస్పెండ్ చేసి, ఆయన పైన తన మెజిస్ట్రేట్ హోదాలో క్రిమినల్ కేసు పెట్టి, జైలులో నుంచి సెషన్స్ జడ్జి కోర్టుకు పంపించాడు. ఆ కేసు ఇంకా విచారణలో ఉండగానే ఉత్తర సర్కారుల కమిషనర్ అనుమతితో డిస్మిస్ చేశాడు. పై సందర్భంలో కలెక్టర్ గారు తనకు చాలా నమ్మకస్తుడని, సమర్ధుడని తోచిన తిమ్మరాజు గారిని పైన చెప్పిన మేనేజర్ ఉద్యోగంతో పాటు, తన క్రింద హెడ్ శిరస్తాదారుగా యాక్టింగ్ చేయవలసినదని ఆజ్ఞాపించాడు. ఆ ప్రకారం తిమ్మరాజు గారు 1852 సం. నుండి రెండు ఉద్యోగాలను నిర్వహించడం ప్రారంభించారు. హెడ్ శిరస్తాదారు కలెక్టర్ కచేరీలో ముఖ్య అధికారి . అతడు కలెక్టర్ ప్రతినిధిగా పనిచేసేవాడు . ఆ కచేరీలోని వ్యవహారాలన్నింటికీ అతడు బాధ్యత వహించాలి. ఆ కార్యాలయము నుండి జారీ అయ్యే కాగితాలన్నింటి పైనా దస్కత్తు చెయ్యాలి. కలెక్టర్ కచేరీలోని గుమస్తాల అందరి పైనా ఆయన అధికారి. తాలూకాలలోని తాశీల్దారులపై కలెక్టర్ అజమాయిషీ చేస్తాడు. తక్కిన పనులన్నీ శిరస్తాదారే చేయాలి. జమాబందీలో ఏవో కొద్ది పెద్ద గ్రామాల లెక్కలను మాత్రం కలెక్టర్ తనిఖీ చేస్తాడు. తక్కినవన్నీ శిరస్తాదారే చేయాలి. ఆ కాలంలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ వ్యవహారాలకు వేరువేరుగా అధికారులు లేరు. అన్నీ కలెక్టర్ క్రిందనే జరిగేవి. రెవిన్యూ, మేజిస్ట్రేట్, పోలీస్ అధికారాలే గాక సాల్టు, అబ్కారి, సర్వే, సెటిల్మెంట్ వ్యవహారాలు దస్తావేజుల రిజిస్ట్రేషన్లు స్టాంపులు వగైరా పనులన్నీ కలెక్టర్ క్రిందవే. అందువల్ల శిరస్తాదారుకు తాశీల్దార్ కు చాలా అధికారాలు, బాధ్యతలు, పలుకుబడి ఉండేవి. ఆ


కాలంలో దేశీయులకు ఇచ్చే ఉద్యోగాలలో శిరస్తాదారీయే పెద్దది. దానికి నెలకు రూ. 218- 280 వరకు జీతం ఉండేది. ఆ కాలంలో తాశీల్దారులను, శిరస్తాదారులను ప్రజలు చాలా గౌరవంతో చూచేవారు. కట్నాలు- కానుకలు ఇచ్చేవారు.

సెషన్స్ కోర్టులో నర్సింగరావు గారి మీద కేసు కొట్టి వేశారు. అంతట తనకు మళ్లీ పని ఇప్పించమని ఆయన ఉత్తర సర్కారుల కమిషనర్ కు అర్జీ దాఖలు చేయగా, అతడు ఫ్రెండర్గాస్టు గారిని సంజాయిషీ అడిగాడు. ఆ కేసు కొట్టివేసినా, నరసింగరావు ప్రవర్తనను బట్టి మళ్లీ ఉద్యోగం ఇవ్వకూడదని ఫ్రెండర్ గాస్ట్ ది. 2-11- 1853 తేదీన అనేక వివరాలతో ఒక పెద్ద ఉత్తరం వ్రాశాడు. తిమ్మరాజు గారిని పెద్ద జీతంపై మేనేజర్ గాను, శిరస్తాదారుగాను నియమించడాన్ని సమర్థిస్తూ జిల్లాలో ఏర్పడిన క్లిష్ట పరిస్థితులలో నమ్మకమైన మనిషి తన దగ్గరుండాలనే అభిప్రాయంతో తిమ్మరాజు గారిని ప్రత్యేకంగా ఏరి ఆయనను తన క్రింద హెడ్ సిరస్తాదారుగా నియమించానాని, ప్రెండర్ గాస్టు గారు ఆ ఉత్తరంలో రాయడం వల్ల ఆయనకు తిమ్మరాజు గారి మీద ఉన్న నమ్మకము, గౌరవము వెల్లడి అగుచున్నది. ఉత్తర సర్కార్ల కమిషనర్ నరసింగ రావు గారి అర్జీని నిరాకరించాడు.

ప్రెండర్ గాస్టు(Prendergast) దొరగారు 1854సం. ఏప్రిల్ వరకు కలెక్టర్ గా ఉన్నాడు. అప్పుడు ఆయనకు గంజాం జిల్లాలో మద్రాసు గవర్నర్ గారి పొలిటికల్ ఏజెంటు అనే పెద్ద ఉద్యోగము ఇవ్వగా అక్కడకు వెళ్ళినాడు. ఆయనకు బదులు ఆర్థర్ పర్విసు(A.Purvis) కలెక్టరుగా వచ్చి, 1863సం. వరకు ఈ జిల్లాలో పనిచేశాడు.

1852సం. నాటికి శివరావు గారికి 23 సం.ల వయస్సు. తిమ్మరాజు పంతులుగారు కలెక్టర్ గారితో మనవి చేసి కుమారుని తమ చేతి కింద పిఠాపురం ఎస్టేటు మేనేజరు కార్యాలయంలోనే పని ఇప్పించి ఉంటారని ఊహించడానికి వీలున్నది.

పిఠాపురం జమీందారు శ్రీ రావు వెంకట సూర్యారావు గారికి నీలాద్రిరాయణిం గారు, వెంకట మహీపతి గంగాధరరామారావు గారు, వెంకట సూర్యనారాయణ మహీపతి గారు, వెంకటరావుగారు అనే నలుగురుకుమారులును; శ్రీమతి భావయమ్మ రావు గారనే కుమార్తెయును కలిగినారు. మూడవ కుమారుని బొబ్బిలి రాజా గారు దత్తు తీసుకున్నారు. ఈయన 1845సం.లో జన్మించారు . సీతారామకృష్ణ రాయడప్ప రంగారావు గారు అనే పేరుతో 1863సం. నుండి 1868 వరకు బొబ్బిలిజమీందారుగా నుండి మరణించారు. రావు వెంకటసూర్యారావుగారి జేష్ఠపుత్రునికి యుక్త వయస్సు వచ్చి జమీందారీ స్వాధీనపరచుకొని పట్టాభిషిక్తుడు అవుతారని అనుకుంటూ ఉండగా 1854సంలో అకాలమరణమును పొందారు. అంతట రెండవ కుమారుడైన గంగాధరరామారావు గారు జమీందారీకి వారసులైనారు. అయితే, వారు మైనర్ గనుక ఎస్టేట్ ను కలెక్టర్ క్రింద ఉంచినారు.



[పిఠాపురం కోట నుండి లభ్యమైన ఈ ఛాయాచిత్రము-గంగాధర రామారావుగారి తండ్రి సుర్యనారాయణ మహీపతి బహద్దర్ (1824-50) అని వున్నది. కానీ ఈ సంపుటి వ్రాతప్రతి లోనూ, వికీపీడియాలోనూ కూడా గంగాధరరామారావుగారి తండ్రి పేరు వెంకట సూర్యారావు గానూ పరిపాలనా కాలం 1844-50 గానూ ప్రకటించబడింది. 1845సం. జన్మించిన గంగాధర రామారావుగారి తమ్ముడు ఇదేపేరు కలిగియుండి 1851వ సం.లో బొబ్బిలిరాజాగారికి దత్తువెళ్లినట్లు పై పుటలో ప్రస్తావించబడినది. ----సంపాదకుల వివరణ]

కుటుంబంలో శివరావుగారి యాజమాన్యం

ది.7-02-1856వ తేదిన తిమ్మరాజు గారు చనిపోయేటప్పటికి శివరావుగారికి 26 సం.లు నిండినవి. శివరావుగారు కుటుంబ యజమాని అయినారు. చెల్లెలు మాణిక్యాంబ గారిని, తిమ్మరాజు గారు దొమ్మేరు మొకాసాదారులైన తల్లాప్రగడ వీరవెంకటనారాయణ గారికి ఇచ్చి వివాహము చేశారు. అల్లుడుగారు కాకినాడలో మామగారి ఇంట్లోనే ఉండేవారు. తిమ్మరాజు గారు చనిపోయేటప్పటికి కుమార్తె గర్భముతో నున్నారు. ఆయన చనిపోయిన నాలుగు మాసాలకు ది. 6-7- 1856వ తేదీన ఆమెకు మగ పిల్లవాడు కలిగాడు. ఆ పిల్లవానికి సుబ్బారావు అని నామకరణం చేశారు. ఈ స్థితిలో వీరవెంకట నారాయణ గారు ది. 24 - 2-1857వ తేదీన చనిపోయినారు. అందువల్ల ఆ

చిన్నవాడిని తన తమ్మునితో పాటు పెంచి, పెద్దవాడిని చేసే భారము శివరావు గారిపై పడినది.

శివరావుగారికి చెల్లెలి పైన చాలా ప్రేమ. ఆమెను అమ్మాయమ్మా అని పిలిచేవారు. అందువల్ల, ఇంట్లో వారు, ఊర్లో వారు కూడా ఆమెను అమ్మాయమ్మ గారు అనేవారు. శివరావుగారి కాలం నుంచి ఇంట్లో ఆవిడ పెత్తనం సాగినది. ఆ కాలంలో నియోగి బ్రాహ్మణ కుటుంబాలలో గర్భాష్టకములోనే ఉపనయనం చేసేవారు. వివాహం కూడా చాలా చిన్నతనంలోనే చేసేవారు. శివరావు గారు తమ తమ్మునికి కాళయుక్తి సం. నిజ జేష్ఠ శుద్ధ బుధవారమునకు సరైన ది. 10- 6-1858వ తేదీన ఉపనయనము చేశారు. రాజమహేంద్రవరం కాపురస్తులు, దేశపాండ్య కుటుంబం వారై యున్న వాడ్రేవు వెంకట నరసింహారావు గారు తమ కుమార్తె సీతమ్మ గారిని వెంకటరత్నం గారికి ఇచ్చి ది.23- 6-1858వ తేదీన రాజమహేంద్రవరంలో మహా వైభవముగా ఐదు రోజులు వివాహము జరిపించారు. పెళ్లి వారు ది.2 -7-1858వ తేదీన కాకినాడలో గృహప్రవేశం చేసుకున్నారు. సీతమ్మ గారు ది.19-1-1852వ సం.లో జన్మించారు. మా నాయన గారి కన్నా ఒక సంవత్సరమ్మున్నర చిన్న వారు. ఆమె తమ్ముడు శ్రీరాములు గారు 1853సం. జూలైలో జన్మించారు. ఆయనను వాడ్రేవు వారి అబ్బాయి అనేవారు. ఈయన బందరు జిల్లా కోర్టు శిరస్తాదారుగా పనిచేశారు. సిద్ధార్థినామ సంవత్సర శ్రావణ శనివారమునకు సరి అయిన ది.13- 8- 1859వ తేదీ రాత్రి చంద్రగ్రహణము. ఆ పుణ్యకాలంలో స్నానాలు , జపాలు చేస్తారు. శివరావుగారి ఇంట కూడా అలాగే చేశారు. తిమ్మరాజు పంతులు గారి ఆశ్రితులైన బ్రాహ్మణులకు దానాలు వగైరాలు చేశారు. తండ్రి గారి

అనంతరం శివరావుగారు శ్రీ భీమేశ్వర స్వామి వారి కళ్యాణమును శ్రద్ధగా పీటల మీద కూర్చుని జరిపించేవారు. ఉత్సవాలు చేయించేవారు. అమ్మవారి పూజలు శ్రద్ధగా చేయించేవారు. అప్పట్లో ఆ దేవాలయంలో అర్చకుడిగా ఉండిన పూజారి పేరయ్య అనే అతడి ప్రవర్తన బాగా లేకపోగా శివరావుగారు అతనిని కఠినంగా మందలించారు. కానీ లాభం లేక పోయింది. అంతట అతనిని తొలగించారు. అతడు శివరావుగారి పైన పగ వహించి, ఆ కాలంలో విరోధులకు ప్రాణహాని కలిగించడానికి చేసే అభిచారక్రియలు, చేతబడి ప్రయోగం చేయించాడుట. అంతట, దాని ప్రభావం వల్లనో, శివరావుగారి గ్రహచారం వల్లనో ఆయనకు చాలా జబ్బు చేసినది. ది. 21-9-1860 నుండి డిసెంబర్ 15వ తేదీ వరకు మంచం పట్టారు. ఆయన ఆ కాలంలో కాకినాడ చుట్టుప్రక్కగల ఆయుర్వేద వైద్యుల మందు పుచ్చుకోవడమే గాక, అభిచారక్రియకు ప్రతిక్రియలు చేయించి, ఇంట్లో జపతపాలు చేయించి, దేవాలయల్లో అభిషేకాలు, పూజలు చేయించారు. అంతట, ఆరోగ్యం బాగు పడినది. ఈ పూజారి పేరయ్య ది. 29- 12- 1862వ తేదీన చనిపోయాడు. శివరావుగారు తమ మేనల్లుడు తల్లాప్రగడ సుబ్బారావు గారికి ది.29- 12- 1860వ తేదీన పుట్టు వెంట్రుకలు తీయించారు. ఆ కాలంలో ప్రతి ఇంట అది ఒక సంస్కారంగా ను, వేడుకగాను , జరిపించేవారు. శివరావుగారి కుటుంబం వారు మంచి సంపన్నులైనందువల్ల భాజా భజంత్రీలతో, బ్రాహ్మణ సంతర్పణలతోనూ, వైభవంగా ఈ వేడుక జరిపించారు. శివరావుగారు తమ కుటుంబమును, చెల్లెల్నీ, మేనల్లుడ్నీ తీసుకుని దొమ్మేరు వెళ్లి ది.12- 4- 1861వ తేదీన అక్కడి నుండి భద్రాచలం యాత్రకు బయలుదేరారు. రాజమహేంద్రవరానికి ఎగువ నూరు మైళ్ళ(దూరంలో) లో ఉన్నది. ఆ కాలంలో స్టీమర్లు

లేవు. పడవలలో ప్రయాణం చేయాలి. రోజు పచ్చిపులుసు మెతుకులు, అటుకులు , మజ్జిగ వగైరాలతో కాలక్షేపం చేస్తూ శ్రీరాముని సేవించి, ది.4 -5 -1861 వ తేదీన రాజమహేంద్రవరం తిరిగి వచ్చారు. తిమ్మరాజు గారు చనిపోయిన తరువాత పిఠాపురం ఎస్టేట్ మేనేజరు కార్యాలయం ప్రత్యేక సిబ్బందితో కలెక్టర్ తనిఖీ క్రింద ది. 13 - 1-1862 వరకు పనిచేసినట్లు కనబడుతోంది.

శ్రీ గంగాధరరామారావు గారు 1861వ సం. లో రాణి మంగాయమ్మా రావు గారిని వివాహము చేసుకున్నారు. ఆయనకు యుక్తవయస్సు రాగా కలెక్టర్ ఆర్థర్ పర్వీసు (Arthur Purvis)గారు 4 లక్షల రొక్కముతోను, మూడు లక్షల రూపాయల విలువగల గవర్నమెంట్ పత్రాలతోనూ జమీందారీని గంగాధరరామారావు గారికి ది. 31-1-1862వ తేదీన స్వాధీన పరచారు. అంతవరకు, తమ తనిఖీ క్రింద ఉంచబడిన జమాఖర్చు లెక్కలను ఎస్టేట్ వ్యవహారాలకు సంబంధించిన రికార్డ్ దస్త్రాలను రాజాగారికి అప్పగించారు. ఎస్టేట్ మేనేజర్ ఆఫీసును ఎత్తివేసి, మేనేజరును , ఖాయం గుమస్తాలను తమ కచేరీలో తమ క్రింది ఇతర కార్యాలయాలలోని ఖాళీలలో నియమించారు.

కలెక్టర్ గారి క్రింద ఎస్టేటు ఉండగా జరిగిన మేనేజ్మెంట్ పద్ధతులు అనేక వ్యవహారాలను, జమాఖర్చు వగైరా లెక్కల విధానాలను తెలియ చెప్పడానికి తాము నియమించే క్రొత్త ఉద్యోగులకు తోడ్పడడానికి ఇద్దరు ముగ్గురు గుమాస్తాలను కొన్నాళ్లపాటు తమకిప్పించవలసినదని రాజావారు కలెక్టర్ గారిని కోరగా, వారు అందుకు అంగీకరించారు. గుమాస్తాలను పంపించారు. అది వరకు మేనేజర్ కార్యాలయంలో పనిచేసిన శివరావుగారు తమ తండ్రిగారు

చనిపోయిన తరువాత తమ కుటుంబ వ్యవహారాలను, దేవస్థానం వ్యవహారాలను చక్కబెట్టుకోవడానికి కొంతకాలం సెలవు పుచ్చుకున్నారు. తరువాత వారికి 1860 సం.రం చివర చాలా జబ్బుచేసి మూడు నెలలు మంచం పట్టినందువల్ల విశ్రాంతి తీసుకుంటున్నారు. అందువల్ల ఎస్టేట్ రాజాగారికి స్వాధీనం చేసేటప్పటికి వారు పనిలో లేరు. రాజాగారికి జమీందారీ వశమైన తరువాత పట్టాభిషేక ఉత్సవములు మహా వైభవముగా జరిగినవి. కొన్నాళ్లపాటు ఆ వేడుకలు జరిగినవి. వారు బంధుజనులను, ఆశ్రితులను, పండితులను, కవులను, గాయకులను, ఘనంగా సన్మానించారు. తమ ఎస్టేట్ గ్రామ ప్రజలకు ఉపకారము చేయదలచి వారి పిల్లలు చదువుకోడానికి కొన్ని వీధిబడులు పెట్టించారు. కొన్ని గ్రామాలలో మంచినీటి సదుపాయములు చేయించవలసినదని తమ ఉద్యోగులకు ఉత్తర్వులు చేశారు. పట్టాభిషేక ఉత్సవముల హడావుడి తగ్గిన తరువాత రాజాగారు తమ ఎస్టేట్ పరిపాలన విషయాలలో శ్రద్ధ వహించి కలెక్టర్ గారి క్రింద జరిగిన వ్యవహారాలను తెలుసుకోవడానికి రికార్డుల లెక్కలు పరిశీలించడం, ప్రారంభించారు. చాలా కాలం నుండి దివాణంలో ఈ వ్యవహారాలు జరిగించే కార్యాలయం లేనందున, ఒక దానిని నెలకొల్పి, అందులో కలెక్టర్ గారు పంపిన గుమాస్తాలకు తోడు తమ ఎస్టేట్ వ్యవహారాలతో అనుభవము గల పాత ఉద్యోగులలో కొందరు ఠాణేదారులు, సముద్దారులు, అమల్దారు మొదలైన వారిని తమ క్రింద దివాణం కార్యాలయంలో పనిచేయడానికి నియమించారు. అన్ని వ్యవహారాలనూ తామే స్వయంగా చూచుకొని నిర్వహించడం ప్రారంభించారు. రాజాగారు తెలివైన వారు. వ్యవహార జ్ఞానం కలవారు. కనుక చక్కగానే పరిపాలన జరిగించగలిగారు. కానీ, ఇందుకోసం ప్రతి

రోజు చాలాసేపు (సమయం) వినియోగించి, శ్రమ పడవలసి వచ్చేది. జమీందారీ పరిపాలనలోని చిక్కులు, కష్టములు వారికి బాగా తెలిసి వచ్చినవి. ఒక వంక తమ గ్రామాలలో భూముల అమరకము, శిస్తుల వసూలు, పనులు జాగ్రత్తగా జరిపించాలి. ఇంకొక వంక రైతుల క్షేమ లాభాలు, కష్టసుఖాలు గమనించాలి. తమ క్రింది ఉద్యోగులు గ్రామ వ్యవహారాలు సక్రమంగా చేస్తున్నారో, లేదో కనిపెట్టాలి. లెక్కలు తనిఖీ చేయాలి. జమీందారీ లో నలుప్రక్కలా గల ఠాణాల నుండి వచ్చే కాగితములు, లెక్కలు, అర్జీలు పరిశీలించి ఎప్పటికప్పుడు ఆ వ్యవహారాలను పరిష్కరించాలి. తమ క్రింది ఉద్యోగులు, గ్రామ కరణములు సరిగా పనిచేయకపోతే మందలించాలి. తమ క్రింది ఉద్యోగులతోనూ అనేక వ్యవహారముల గురించి ముచ్చటిస్తూ ఉండాలి. కలెక్టర్ తో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపించుతూ ఉండాలి. ఇలాగ అనేక రకములైన వ్యవహారములను చక్కబెట్టుకోవడంలో రాజమర్యాదలు పాటించవలసిన తమబోటి వారు సామాన్యులతో సరి సమానంగా మాట్లాడడం, పనులు జరిపించడం, తమకు గౌరవప్రదంగా కనబడలేదు. పైగా ఒక సం|| విధి విరామము లేకుండా పనిచేసేటప్పటికి ఆయనకు విసుగు పుట్టుకు వచ్చింది. అందువల్ల వ్యవహార బాధ్యతలన్నీ తమ తరఫున వహించి, ఈ కార్యాలన్నీ చక్కబెట్టడానికి, నిర్వహించడానికి, తమ క్రింద ఒక శిరస్తాదారును గానీ, మేనేజరును గానీ నియమించడం యుక్తమని తోచినది. అంతట పూర్వము తమ అన్నగారి మైనారిటీలోనూ, తమ మైనారిటీలోనూ, కలెక్టర్ క్రింద అతి సమర్ధతతో మేనేజరుగా పనిచేసి, తమ కుటుంబానికి, జమీందారికి, అమూల్యమైన సేవ చేసిన తిమ్మరాజు పంతులు గారి క్రింద తర్ఫీదు పొంది, తరువాత కూడా మేనేజర్ కార్యాలయంలో పనిచేసిన వారికుమారుడు శివరావు

గారే దీనికి తగినవారని రాజాగారు నిశ్చయించుకొని, శివరావు గారిని ది. 1- 6-1863వ తేదీన శిరస్తాదారుగా నియమించారు.

శివరావుగారి శిరస్తాదారీ

శిరస్తాదారు రాజాగారికి సలహాదారు. వారి ప్రతినిధి . కార్య నిర్వాహకుడు. వారి ప్రధానోద్యోగి. అప్పటికి ఆ కాలంలో శిరస్తాదారునే దివాన్ అని వ్యవహరించేవారు. ప్రత్యేకంగా దివాన్జీ హోదా గల ఉద్యోగము లేదు. రాజాగారి దివాణం వారు కనుక వారి ప్రజలు వీరిని దివాన్జీ అనే వ్యవహరించేవారు. శివరావుగారు శిరస్తాదారుగా ఉద్యోగంలో ప్రవేశించగానే రాజాగారితో సంప్రదించి పూర్వం తమ తండ్రిగారి కాలంలో కలెక్టరు క్రింద మేనేజర్ కార్యాలయంలో అమలు జరిగిన పద్ధతులను తరువాత కలెక్టరు పర్విస్ గారి క్రింద అమలు జరిగిన పద్ధతులను ఇప్పుడు కూడా అమలు జరిగించుటయే కాక, దేశ కాల పరిస్థితులను బట్టి, క్రొత్త శాసన విధులను బట్టి, గవర్నమెంట్ కలెక్టర్ కార్యాలయంలో కార్యనిర్వహణములో, ఉద్యోగ నిర్వహణ విధానాలలో ఆఫీసు రొటీనును, వచ్చిన మార్పులను గమనిస్తూ ఎస్టేట్ ఉద్యోగులు కూడా సాధ్యమైనంత వరకూ గవర్నమెంట్ రెవెన్యూ శాఖలోని విధి విధానాలనే పాటించాలని నిర్ణయించారు.

గ్రామోద్యోగుల లెక్కలు అజమాయిషి చేసే ఠాణేదారులు, సముద్దారులు, మొదలైన దివాణం ఉద్యోగులందరూ తమ తమ పనులను సక్రమంగానూ, సత్వరంగానూ జరిగించాలని తమ రిపోర్టులను గోష్వారా (Abstract) లెక్కలను, యాదాస్తులను ఎప్పటికప్పుడు

దివాణానికి పంపాలని గ్రామ రైతులు చెప్పుకునే సంగతులు విని , తమ అభిప్రాయాలను తెల్పాలని రైతుల అర్జీలను వెంటనే దివాణానికి పంపాలని కట్టడి చేశారు.

శివరావుగారు రాజాగారితో సంప్రదించి, జమీందారీలలో పూర్వము నుంచి అమలు జరుగుతున్న అమరక పద్ధతులు, శిస్తుల నిర్ణయము, వాటి వసూలు మొదలైన పనులలో పూర్వాచారాలను పాటించాలని నిర్ణయించారు. గ్రామయాదాస్తు ప్రజల క్షేమ లాభాల కోసం రాజాగారు తలపెట్టిన ప్రజోపయుక్త కార్యాలను సత్వరంగానూ, సక్రమంగానూ జరిగేటట్లు కట్టుబాట్లు చేశారు.

శిరస్తాదారు గారి కార్యాలయం రాజాగారి దివాణంలో ఒక విభాగము. అది రాజనగరు లో నొక ప్రక్కనుండేది. ఆ కార్యాలయములో శిరస్తాదారు క్రింద సహాయ ఉద్యోగులు ముసద్దీలు, లెక్కల గుమాస్తాలు జవాబునీసులు అనేవారు *(వుండేవారు)*, పేష్కారులు మొదలైన ఉద్యోగులు, జవానులు కలిసి చాలా సిబ్బంది ఉండేది. ప్రతిదినము దివాణానికి నలు ప్రక్కల నుంచి , సముద్దారులు, గ్రామ కరణాలు వగైరాలు ఏదో ఒక పని మీద వస్తూ ఉండేవారు. వారి పనులు చక్కబెట్టి పంపాలి. ప్రతి దినము అన్నిప్రక్కల నుండి టపా వచ్చేది. గోష్వారా లెక్కలు, యాదాస్తులు వచ్చేవి. ఇది గాక కలెక్టర్ ఆఫీసు నుండి, సరిహద్దు తాలూకాల తహసీల్దారుల దగ్గర నుండి ఉత్తరాలు, తాఖీదులు వచ్చేవి. వాటికి జవాబులు వ్రాయాలి. ఆ కాలంలో అన్ని ఆఫీసులలోనూ తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి. వరుస సంఖ్య, సర్ అనే మొదలైన మాటలు, తేదీలు, ఉద్యోగిహోదా మాత్రం ఇంగ్లీషులో ఉండేవి . వాటి లోపల ఇంగ్లీషు మాటలు ధారాళముగా

వాడేవారు. బహుకొద్ది కాగితములు ఇంగ్లీషులో నుండేవి. దివాణం వారికి వచ్చిన కాగితాలపై గవర్నమెంట్ ఆఫీసులో మాదిరిగానే శిరస్తాదారు పొడి అక్షరాల దస్కత్తు చేసేవారు. తేదీ వేసేవారు. వాటిని పరిశీలించి ముఖ్యమైన వాటికి తామే ఎండార్సమెంట్లు వ్రాసేవారు. మిగిలిన వాటిని పెద్ద గుమస్తాల చేత వ్రాయించేవారు. వచ్చిన కాగితాలు, యాదాస్తులు, అర్జీలు, వగైరాలు ఒక రిజిస్టర్లో నమోదు చేసేవారు. సామాన్య వ్యవహారాలను తామే పరిష్కరించేవారు. ముఖ్యమైన వాటికి వివరాలు వ్రాసి, తమ అభిప్రాయంతో రాజాగారికి నివేదించేవారు. వారు చెప్పినట్లు గా జరిగించేవారు. దివాణం నుండి వెళ్లే తాఖీదుల మీద, ఉత్తర్వుల పైన, కాగితాల పైన శిరస్తాదారు గారి దస్కత్తు, మొహరు ఉండేవి. మరీ ముఖ్యమైన వాటిపైన రాజాగారి దస్కత్తు, మొహర్లు ఉండేవి. ప్రతీ వ్యవహారానికి సంబంధించిన కాగితాలకు డాకెట్టు[16] వేసి, ఒక ఫైలుగా ఉంచి, దానికి నెంబర్ వేసేవారు. దానిలో శిరస్తాదారు గారి రిమార్కులు, ఉత్తర్వులు, రాజాగారి ఉత్తర్వులు నమోదు చేసేవారు. వాటి నకళ్లను గుమాస్తాల చేత వ్రాయించి, తాము దసకత్తు చేసి, జారీ చేసేవారు. పరిష్కారమైన దస్త్రాలు రికార్డు గదిలో ఉంచేవారు. మొదట ఇంగ్లీషు వచ్చిన గుమాస్తాలు లేరు. తరువాత కాలంలో కొంచెం ఇంగ్లీషు నేర్చిన గుమాస్తాలను నియమించేవారు. శివరావుగారికి ఇంగ్లీషు వచ్చును. కానీ, సాధారణంగా తెలుగులోనే వ్రాసేవారు. వారిది మంచి దస్తూరీ. ఇంగ్లీషు పారిభాషిక పదాలను ధారాళంగా వాడేవారు. వారి ఇంగ్లీషు

[16] డాకెట్టు వేయడం(Docket) గుర్తుగా నంబరు వేయటం లేదా వర్గీకరించటం

దస్కత్తులు గల కాగితములు కొన్ని మా కుటుంబపు రికార్డులలో కనబడినవి.

శివరావుగారు తమ క్రింది ఉద్యోగులు తమతమ విధులు సరిగా నిర్వహిస్తున్నారో లేదో కనిపెట్టి, ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకునేవారు. అన్ని వ్యవహారాలను స్వయంగా అజమాయిషీ చేసేవారు. ముఖ్యమైన విషయములు రాజాగారికి నివేదించి వారి అభిప్రాయాన్ని తెలుసుకుని పనిచేసేవారు.

శివరావు గారికి గవర్నమెంట్ వారి శాసనములు, శాసన విధులు, రెవిన్యూ పరిపాలన విధానములు కరతలామకముగా నుండేవి. అందువల్ల వారు దివాణం వ్యవహారాలను చక్కగా నిర్వహించగలిగే వారు. శివరావు గారు తరచుగా సంస్థానములోని గ్రామాలలో పర్యటించి రైతుల కష్టసుఖాలు తెలుసుకునే వారు. శివరావు గారి పద్ధతులు రాజాగారికి నచ్చినవి. సాధారణంగా శివరావు గారు సూచించిన దానికి అడ్డు చెప్పేవారు కారు. క్రమక్రమంగా అన్ని వ్యవహారాలు వారి మీద వదిలివేయడం ప్రారంభించారు. కానీ, అంతమాత్రం చేత శివరావుగారు స్వతంత్రంగా వ్యవహరింపక అన్ని ముఖ్య విషయాలు రాజాగారికి చెప్పి చేసేవారు. అందువల్ల రాజాగారికి వారి పైన చాలా గౌరవం కలిగినది. రాజాగారు శివరావుగారికి ది. 26-3-1873వ తేదీన మేనేజర్ అనే హోదా నిచ్చారు. 1875సం.లో దానిని ఖాయ పరిచారు. తరువాత దివాన్జీ అని వ్యవహరించడం ప్రారంభించారు. శివరావుగారు శిరస్తాదారుగానున్న నాటి నుండీ లోకులాయనను దివాన్జీ గారనే వ్యవహరించేవారు. వారిలో మార్పురాలేదు.

రాజాగారికినీ, శివరావుగారికినీ మనస్సులు కలిసినవి. ఉభయులకూ కొన్ని సమానమైన భావాలు, ఆదర్శాలు ఉండేవి. ఉభయులకూ వేద శాస్త్రాలపైనా, పూర్వపు సాంప్రదాయాలపైనా గౌరవమే గాని వారి సనాతనధర్మము సంకుచితమైనది కాదు. ఉభయులూ ఇంగ్లీషు విద్య, విజ్ఞానము, నాగరికతలలోని మంచి సాంప్రదాయములను హర్షించేవారే. ఉభయులకూ కూడా ఉదార భావాలు ఉండేవి. దేశాభివృద్ధికి విద్య, ఆరోగ్యము, ప్రజల ఆర్థిక, క్షేమ, లాభాలు, అభివృద్ధి చేయడం అవసరమని ఉభయులూ విశ్వసించేవారు. వీరు తరచుగా సవారీల మీద చెన్నపట్టణం వెళ్లి వచ్చేవారు. రాజాగారు తాము చేయదలచిన దానధర్మాలు విషయంలోనూ, సత్కార్యాల విషయంలోనూ, తమ ఆంతరంగిక వ్యవహారాలలోనూ కూడా శివరావు గారితో సంప్రదించేవారు. శివరావుగారు, రాజాగారు తలపెట్టిన సత్కార్యాలకు సంతోషించి వాటిని సత్వరగా, సక్రమంగా నిర్వహింప చేసేవారు.

పిఠాపురంలో శివరావుగారు కాపురముండడానికి రాజాగారు ఒక దివ్య భవనమునిచ్చారు. కాకినాడ పిఠాపురానికి పది మైళ్ళే గనుక తరచుగా శివరావుగారు సవారిలో ఇంటికి వస్తూ ఉండేవారు. శివరావుగారు దివాణామునకు తంజా నెక్కి వెళ్లేవారు. అది పడక కుర్చీ వలె నుండే పల్లకి. దానికి ప్రక్కతలుపులు ఉండవు. శివరావుగారు ఎక్కడికి వెళ్లినా వెంట నలుగురు జవానులు ఉండేవారు. వారు దూర ప్రయాణం చేసే మేనాసవారి అందమైనది. గట్టిది. అందులో పండుకొనవచ్చును కూడా. పూర్వం 16 మంది బోయీల సవారీ. 12 మంది బోయీలు సవారీ, 8 మంది బోయీలు మోసే

సవారీలు ఉండేవి. అధికార దర్జాను బట్టి ఆ సవారీలు నియోగించారు. రాత్రిళ్ళు సవారీ ముందును, ప్రక్కలను కాగడాలను వేసే చాకళ్లు ఉండేవారు. కాగడా అనగా కోలగా రెండు అడుగుల కర్ర తరివిణి పట్టినది. అందంగా తయారు చేసేవారు. దానిపై నాలుగు అంగుళాల ఇనుప కడ్డీ దూర్చి ఉండేది. పాత గుడ్డలు కడియాలు లాగా చేసి, ఆముదములో తడిపి, ఆ ఇనుప కడ్డీకి తగిలించి, దీపంతో వెలిగించేవారు. అది మండుతూ వెలుగునిచ్చేది. కొంత వెలుగు తగ్గినప్పుడల్లా దానిమీద ఆముదము పోస్తారు. దీనిసే దివిటీ అందురు. ఇది గాలికి ఆరిపోక చాలా వెలుగునిచ్చేది. ఇటువంటి కాగడాలు సాధారణంగా రెండైనా సవారీ వెంట నుండేవి. ఇటువంటి కాగడాలను ఇప్పటికీ దేవుని ఉత్సవాలలో వెలిగిస్తారు. వాటిని సన్నిధి కోలలు అంటారు. పూర్వం జోడు కాగడాలు, పగటిదివిటీలు రాజలాంఛనాలుగా ఎంచేవారు. ఈ కాగడాలను శుభకార్యాలలో , పల్లకీ ఊరేగింపులలోనూ ఉపయోగించేవారు. ఇంటి దగ్గర ఇలాయిలనే దివిటీలు వెలిగించేవారు. గుడ్డ పీలికలతో చిన్నచిన్న చక్రములుగా చేసి, వాటిని ఆముదములో ముంచి, ఇనుప కోలలకు తగిలించి, నేలకు గుచ్చియుంచి వెలిగించేవారు. ఆ కాలంలో జవానులకు, బోయీలకు, చాకళ్లు వగైరా నౌకర్లు అందరికీ జీతభత్యములుండేవి. నాలుగు రూపాయలు పెద్ద జీతము. పూటకు 0- 1-3 పెద్ద భత్యము. బోయీలకు మజిలీ యూళ్ళల్లో కల్లు పోయించే ఆచారం ఉండేది.

శివరావు పంతులు గారు రాజాగారి దగ్గర మేనేజర్ గా ఉండగా, చెన్నపట్టణంలో తీయించుకున్న ఫోటోలు మా ఇంట్లో ఉండేవి. శివరావుగారు ఐదు అడుగుల రెండు అంగుళాలు ఎత్తు ఉండేవారు.

వారు అంత లావూ కాదు. సన్నమూ కాదు. దబ్బ పండు వంటి శరీరచ్ఛాయ కలవారు. గుండ్రని ముఖము. అందమైన కనులు. దానికి తగినట్లుగా నున్న పంచలనే ముక్కు తీరు, మంచి కంఠము. శివరావుగారు దివాణమునకు వెళ్ళినప్పుడు, కలెక్టర్లు మొదలైన గొప్పవారిని దర్శించునప్పుడు వారు పూర్వకాలం నాటి జమీందారులును, హైదరాబాదులోని గొప్ప ఉద్యోగులు ధరించు పట్టు షరాయిని, జరీపువ్వులు గల పట్టు అంగరఖా లేక పొడుగు కోటును ధరించేవారు. వారి తలపైన పట్టు జరీ బూటేదారీ పనిచేసిన, విలువైన పగిడి వంటి ఒక విధమైన టోపీని పెట్టుకునేవారు. అవి వారి ముఖమునకు నిండుదనము ఇచ్చేవి. ఆయన కాళ్ళకు అందమైన చడావుల వంటి పాదరక్షలు తొడుగుకునేవారు. ఒక్కొక్కప్పుడు ఆ కాలములోని వారు తొడుగుకొను పాపోశులనే బళ్ళారి పైజారులు ధరించేవారు.

శివరావుగారి చెవులకు రవ్వల తమ్మెట్లుండేవి. చేతులకు కంకణములు, వేళ్ళకు నవరత్నములు పొదిగిన ఉంగరములు ఉండేవి. ఆకాలములో చెన్నపట్టణములో ఆభరణములకు ప్రసిద్ధి చెందిన టాకరు కంపెనీలో వారు బంగారు వస్తువులు కొనేవారు. సీమ నుండి దిగుమతియగు బంగారపు జేబుగడియారమును గొలుసులతో ఉపయోగించేవారు.

శివరావుగారికి సనాతన ధర్మము పైన గౌరవం ఉన్నది. గాని వారు ఛాందసులు కారు. వారు స్మార్తులైనందు వలన శివకేశవ బేధము లేదు. వారి కులదైవం శ్రీ శ్రీ శ్రీ త్రిపుర సుందరీ సమేత శ్రీ శ్రీ శ్రీ భీమేశ్వర స్వామి వారు. ఆ దేవస్థానానికి వారు ధర్మకర్తలు. అర్చనలు, ఉత్సవములు మహా వైభవంగా చేయించేవారు. కానీ వారిది నిలువు

బొట్టు. తిరు చూర్ణ తిలకం ధరించేవారు. పతిత పావనమనే బొట్టు పెట్టుకునే వారని మా అమ్మగారు చెప్పారు. శివరావుగారి ఇంట్లో జరీపంచలనే కట్టుకునేవారు. మడి, ఆచారములను పాటించేవారు. ఆ కాలంలో అందరూ వర్ణాశ్రమ ధర్మాలను జాగ్రత్తగా పాటించేవారు. రాజాగారి వలనే శివరావుగారునూ కుల గౌరవాలను పాటించినా, అన్ని మతాల వారిని, కులాల వారిని సమానంగా ఆదరించేవారు.

శివరావుగారి తండ్రిగారిచ్చిన అగ్రహారములను, ఇల్లు, వాకిళ్లను అనుభవించే వైదిక బ్రాహ్మణ కుటుంబాల వారు, పురోహితులు, ఆశ్రితులు శివరావుగారి చుట్టూ చేరి పండుగలలోనూ, పర్వములలోను, దైవ పితృ కార్యాలయాలలోనూ, శుభాశుభములలోను వారిచేత చాలా సొమ్ము ఖర్చు పెట్టిస్తూ ఉండేవారు. శివరావుగారు ఉత్తర దక్షిణ దేశాలలో తీర్థయాత్రలు చేసి యున్నందునను రాజాగారి పనుల పైన ఉద్యోగరీత్యా చెన్నపట్టణమునకు ఇతర జిల్లా ముఖ్యపట్టణములకు తరచుగా వెళ్లి అక్కడి జమీందారీల ఆచార వ్యవహారములను చూచియున్నందువల్లననూ శివరావుగారి సనాతన ధర్మము సంకుచితము గాక విశాల ఉదార భావాలు కలిగినదైనది. ఆయన కొన్నాళ్లయిన తరువాత కాకినాడ నుండి చెన్నపట్టణానికి స్టీమరులో కూడా ప్రయాణం చేసేవారు. వారి ఆశ్రితులైన వైదికులు కిక్కురుమనేవారు కారు. స్టీమర్లో ఫలహారాలు, అటుకులు మొదలైనవి భుజించేవారు. శివరావుగారు 1871 సం.ర ప్రాంతమున తమ

మేనల్లుడు అయిన తల్లాప్రగడ సుబ్బారావుగారిని[17] చెన్నపట్టణములో ప్రెసిడెన్సీ కాలేజీలో చేర్పించిరి. ఆయన చాలా తెలివితేటలు కలవారు. ఉన్నతశ్రేణిలో బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణుడై ఒక సంవత్సరం బరోడా హైకోర్టులో రిజిస్ట్రారుగా పనిచేసి బి. ఎల్. పరీక్షలో ఉత్తీర్ణుడై హైకోర్టు వకీలుగా నుండి గొప్ప ప్రతిభాశాలియని, సంస్కృత విద్వాంసుడని, వేదాంతి అని పేరుపొంది ఇటీవల సర్. సుబ్రహ్మణ్య అయ్యర్, సర్. శివస్వామి అయ్యర్ మొదలైన వారిచే ప్రశంసింపబడిన సుబ్బారావు గారు దివ్యజ్ఞాన సమాజ స్థాపకులైన మదాం బ్లావాట్ స్కీ(Madam Blavasky) గారికి మిత్రుడై 1882 సం.లో అడయారులో దివ్యజ్ఞాన సమాజ (Theosophical Society) స్థాపనకు కారకులై నారు. ఆయనను అడయారులో స్వామి సుబ్బారావు అనేవారు. ఆయన తల్లిగారును, కుటుంబము వారును 1872 సం.నుండి తరచు స్టీమరుపైననే కాకినాడ వస్తూ పోతూండేవారు. సముద్రయాన నిషేధమును వీరు పాటించలేదు. శివరావుగారు చేసినది గొప్ప సాహస కృత్యమే .

శివరావుగారు గొప్ప హోదాలో నున్నందువల్లను, సంపన్నుడైనందువలనునూ ఆనాటి వేద శాస్త్ర పండితులు గాని, సభాపతులు గాని ఈ సముద్రయానమును ఆక్షేపించలేదు. పైగా శివరావుగారి ఇంటికివచ్చి స్వయంపాక, భోజనములు చేసి, సంభావనలు పుచ్చుకునేవారు. గోదావరి జిల్లాలోనే గాక దేశమంతటా జగదేక పండితులని, గౌరవింపబడి, సన్మానములు పొంది పిఠాపురం

---

[17] తల్లాప్రగడ సుబ్బారావు గారు(1856-1890). వీరు 1871సంలో మెట్రిక్యులేషన్ ప్రథమ శ్రేణిలో (18వ Rank) లో ఉత్తీర్ణులైరి.: 1871 సం. నాటి మద్రాసు యూనివర్సిటి గెజెట్ ప్రచురణ (చూడు అనుబంధము-9).

రాజాగారి వల్ల ఘనంగా సన్మానింపబడిన శ్రీ బులుసు పాపయ్య శాస్త్రి గారు ఎలాంటి అభ్యంతరము లేకుండా శివరావుగారి ఇంటికి 1876, 1884 సం.లలోను జరిగిన శుభకార్యాలలో పాల్గొన్నారు.

కాకినాడ సముద్రరేవు నుండి స్టీమర్ మీద చెన్న పట్టణానికి ప్రయాణాలను సాగించడం వలన శివరావుగారు మార్గదర్శకులైనారు. అటు తరువాత స్టీమరుపైన రాకపోకలు బాగా వృద్ధి అయినవి.

మా పితామహుడైన దిగవల్లి తిమ్మరాజు పంతులుగారు చనిపోయే నాటికి మా పెద్దతండ్రి, వేంకట శివరావుగారికి 27 సం.ల వయస్సు. మా నాన్నగారు- వెంకటరత్నం గారు ఆరేండ్ల బాలుడు. మా పెద్దతండ్రి గారే మా నాన్నగారిని పెంచి, పెద్దవాడిని చేశారు. మా పెద్దతండ్రి గారు 1892 సం.లో చనిపోయే వరకూ మా కుటుంబం సమిష్టిగానే ఉన్నది. మా పెద్దతండ్రిగారే కుటుంబ యాజమాన్యాన్ని వహించారు.

మా సవతి అక్కగారైన సుందరమ్మ గారిని తొమ్మిదవ ఏట మా మేనత్త కుమారుడైన తల్లాప్రగడ సుబ్బారావు[18] గారికి ఇచ్చి ది 5-5- 1876 తేదీన వివాహం చేశారు. ఈ సుబ్బారావు గారు ఆరు నెలల

---

[18] తల్లాప్రగడ సుబ్బారావు గారు అఖండ ప్రజ్ఞాశాలి : వీరిని గురించి తారక రాజయోగ ప్రవీణుడని చాలా విశేషాలతో శ్రీవిరించి(కీ.శే. డా. యన్. సి. రామానుజాచార్యులు) గారు రచించిన వ్యాసం దక్షిణాంధ్ర దారిదీపాలు అను గ్రంథము పుటలు137-147 లోనూ ఇంకా 1950సం||లో కీ.శే. దిగవల్లి వేంకట శివరావుగారు కృష్ణాపత్రికలో ప్రచురించిన 3 వ్యాసములను ఆధారంగా చేసుకుని ఈ సంపుటి సంపాదకుడు 2014సం. తెలుగు వికీపీడియాలో వ్రాసిన వ్యాసము చూడగలరు

పిల్లవాడై ఉండగా తండ్రిగారు చనిపోయినాడు. ఆయనను కూడా శివరావుగారే పెంచి, పెద్దవాడిని చేశారు. సుబ్బారావుగారి కప్పటికి 20 వత్సరములు. ఆయన చెన్నపట్టణములో సుప్రసిద్ధ వకీలుగాను, బ్రహ్మజ్ఞానిగాను పేరుపొంది 1890 సం.లో దివంగతులైనారు. ఆ వివాహం నాటికి శివరావుగారు పిఠాపురం రాజా గంగాధర రామారావు గారి దగ్గర దివాన్‌గా నున్నందువల్ల ఆ సంస్థానంలో వారి పలుకుబడి, దర్జానుబట్టి ఆ వివాహం అతి వైభవముగా జరిగినది. రాజాగారు తదితర జమీందారులు కూడా ఆ వివాహానికి వచ్చి విందారగించారు. ఆ కాలంలో బంధుమిత్రులు సపరివారంగానూ, వారి బంధువులతోనూ వచ్చి ఐదు రోజులు ఉండేవారు. గోదావరి జిల్లాలో ప్రసిద్ధులైన వేద శాస్త్ర పండితులు చాలామంది వివాహానికి వచ్చారు. ఆ వివాహ సమయంలోనే మా అన్నయ్యగారైన తిమ్మరాజు గారికి ఉపనయనం జరిగింది. సుప్రసిద్ధ వేద పండితులైన శ్రీ బులుసు పాపయ్య శాస్త్రి గారు, పిఠాపురం రాజాగారి ఆస్థానంలో సన్మానం పొందిన వారు ఈ శుభకార్యాలను దగ్గర ఉండి జరిపించారు. వధూవరులను ఏనుగు అంబారీ పైన ఊరేగించారు. ఈ వివాహమును గూర్చిన వివరాలు కానీ, వీనికైన జమా ఖర్చులు గాని మా కుటుంబం తాలూకు కాగితాలలో కనబడుటలేదు. అయితే, 1884సం. జనవరి 31వ తేదీన మా రెండవ అక్క మహాలక్ష్మమ్మ గారి వివాహమునకు, ఫిబ్రవరి 7వ తేదీన మా అన్నయ్య గారి వివాహమునకు అయిన ఖర్చులకు మా నాయన గారు పూసగుచ్చినట్లు జమాఖర్చు లెక్క వ్రాశారు. అందువల్ల ఆ వివాహాల వివరాలు తెలుస్తున్నవి. ఆ వివాహాలకు మా నాన్నగారు సుమారు 9000 రూపాయలు ఖర్చు పెట్టారు. అందువల్ల శివరావుగారు జరిపించిన వివాహానికి చాలా సొమ్ము ఖర్చు అయి ఉంటుందని ఊహించవచ్చును.

1884 సం. నాటి వివాహవేడుకలు.

మా రెండవ అక్క[19] మహాలక్ష్మమ్మ గారిని రాజమహేంద్రవరంలో శ్రీమంతులైన అజ్జరపు వీరయ్య గారి కుమారుడు సుబ్బరాజు గారికి ఇచ్చి వివాహం చేశారు. వీరయ్య గారు సంపన్నులు. వారి తండ్రిగారైన రామన్న గారు తూర్పు ఇండియా కంపెనీ కాలంలో తహసీల్దారుగా పనిచేసిరి. నిరతాన్న దాతయని ప్రసిద్ధి చెందారు. మా అన్నగారికి అప్పట్లో కర్నూలులో డిప్యూటీ కలెక్టరుగానున్న కొటికలపూడి సుబ్బారాయుడు గారి కుమార్తె శేషమ్మ గారిని ఇచ్చి వివాహం చేశారు. మా అక్కగారి వివాహం కాకినాడలో మా ఇంట్లోనే జరిగింది. మా అన్నయ్య గారి వివాహం మా ఇంటి ప్రక్క కృత్తివెంటి వారి ఇంట్లో జరిగినది. ఈ వివాహ కాలం నాటికి శివరావుగారు పిఠాపురం దివాన్ గా లేరు. శనివారప్పేట రాజాగారి మేనేజరుగా నిడదవోలులో ఉన్నారు. మా అక్క గారి వివాహం నిశ్చయించినప్పుడు, ది.12-9-1883వ తేదీన రాజమహేంద్రవరంలో తాంబూలాలు పుచ్చుకున్నప్పుడు ఆయన నిడదవోలు నుండి వచ్చారు. మా నాన్నగారు అప్పటికి శిరస్తాదారుగాను , యాక్టింగ్ డిప్యూటీ తాశీల్దారు గాను పనిచేస్తున్నారు. ఆయన తమ ఉద్యోగానికి సెలవుపెట్టి, కాకినాడలో ఉండి పెండ్లిపనులు చేయించవలసి వచ్చింది. అప్పటికి కాకినాడ పెద్ద పట్టణమే. పెద్ద బజారులో చాలా బడ్డీలు, దుకాణాలు చెన్నపట్టణములో దొరికే వస్తువులు అమ్మే షాపులు కూడా ఉండేవి. మెర్వాన్జీ మానక్జీ అనే ఒక

---

[19] రచయిత శివరావు(1898-1992) గారికి ఇద్దరు సవతి అక్కలు(సుందరమ్మ, మహాలక్ష్మమ్మ) ఒక జనక సోదరి (బొడ్డపాటి సీతాబాయమ్మ(1895-1948).

పార్సీవాని షాపు కూడా ఉండేది. కోటి లక్ష్మారావు పంతులు గారనే ఒక మాధ్వ పంతులుగారు కూడా ఒక షాపు పెట్టారు. సమస్త సామానులు దొరికే కోమటి దుకాణాలు ఉండేవి. అయితే తయారు చేసిన వెండి, బంగారు వస్తువులు దొరికేవి కావు. ఇప్పటిలాగా కందులు, పెసలు, శెనగలు, గోధుమలు బాగు చేసి, పప్పులు విసిరి అమ్మేవారు కారు. పిండి విసిరి అమ్మడం కూడా లేదు. అందువల్ల వివాహాది శుభకార్యాలకు 6 నెలల ముందు నుండీ వెండి బంగారు వస్తువులు చేయించడం, బియ్యము, పప్పులు , వగైరా లు కొని, బాగు చేయించి, పిండి విసిరించడము, అటుకులు వగైరాలు పసుపు వగైరాలు కొట్టించడం అవసరంగా ఉండేది. మా నాన్నగారు వ్రాసిన జమాఖర్చు లెక్కలను బట్టి పెండ్లి నిశ్చయమైనప్పటినుండి పెండ్లి పనులు చేయించడం ప్రారంభించినట్లు కనబడుతోంది.

కాకినాడలో మా పితామహుడు తిమ్మరాజు గారు కట్టించిన రెండుమండువాల భవంతి చాలా పెద్దది. దానికి దక్షిణాన ధాన్యం కొట్లు , ఉత్తరాన ఇంకొక పెంకుటిల్లు కూడా కట్టించారు. ఆ స్థలం సుమారు రెండుఎకరాల విస్తీర్ణం కలది. దాని తూర్పు వైపు గుడి వీధి అనే రాజవీధికి ఆనుకొని నివేశన స్థలం 60 గజములు వెడల్పు ఉండేది.

వివాహాలు తలపెట్టగానే మా నాన్నగారు ఈ భవంతులకు మరమ్మత్తులు చేయించారు. వడ్రంగం, తాపీపని వగైరా పనులు చేయించారు. మూడు గజముల వెడల్పు, 11 గజముల పొడుగు గల దక్షిణపుప్రక్క కచేరీసావడికి మూడు గజముల వెడల్పు, ఆరు గజముల పొడవు గల ఉత్తరపు కచేరీసావడికి వెదురుచాప అల్లించారు.

దక్షిణపుచావడి పైన గల సరంబీకి , దూలాలకు, స్తంభాలకు, తలుపులకు వార్నీషూ, రంగులు వేయించారు. గుమ్మాలకు జేగురు పూయించారు. ఇంటికి వెల్ల వేయించారు. కచేరీ సావడిని కాగితపు పువ్వుల చెట్లతో అలంకరింప చేశారు. చావడిలో గులేబులనే పెద్ద గాజుగ్లోబులు తగిలించి వాటిలో కొవ్వొత్తులతో దీపాలు, గ్లాసులలో చమురు దీపాలు పెట్టడానికి ఏర్పాట్లు ఉన్నవి. ఇంటిముందు, మండువాలలోనూ, దొడ్లలోను పందిళ్ళు, పాకలు వేయించారు. చెన్నపట్టణములో నగలు చేయించడానికి మా మేనత్త మాణిక్యాంబ గారికి రూ. 890 లు పంపించారు. ఎక్కడెక్కడ ప్రశస్తమైన సరుకులు దొరుకుతాయో అక్కడ నుంచి తెప్పించడానికి అడ్వాన్సుల ద్వారా పురమాయించారు.

పెద్దాపురం నుంచి పంచదార, సామర్లకోట నుంచి మంచి నూనె, ఆకివీడు నుంచి నేతిడబ్బాలు, ఏలూరు నుంచి తమలపాకులు, చెన్నపట్టణము నుంచి ఏలక్కాయలు , లవంగాలు, వక్కలు, మంచి గంధం, పన్నీరు బుడ్లు, , కొవ్వువత్తులు, అగరవత్తులు, బిళ్ళలు తెప్పించారు. శివరావుగారు మేనేజర్ గా పనిచేస్తున్న నిడదవోలు నుంచి అనేక సరుకులు తెప్పించారు. అన్ని సరుకులును చాలా భారీగా ఖరీదు చేసినట్లు కనబడుతోంది. పెద్ద సైజు ఒకటో నెంబర్ విస్తర్లు 11200 కాకినాడలో ఒక కోమటి దగ్గర పుచ్చుకొని రూ. 22 -6-03 ఇచ్చిన పద్దు కనబడుతోంది. ఏలూరులో మల్లెపూల అత్తరు 9 తులాలు, అంబర్ హోనా ఏడున్నర తులాలు, ఖరీదు చేశారు. ఇది గాక మళ్ళీ కాకినాడలో కోటి లక్ష్మణరావు పంతులు గారి షాపులో అత్తరు పుచ్చుకున్నారు. కర్పూర దండలు అనేక రకాలు తయారు

చేయించారు. 32 పూసలపేర్లు- 200, 22 పూసలుగల రాగిడి దండలు - 100, 10 పూసలుగల చేదండలు - 200, 40 పూసలుగల పేర్లు వధూవరులకు. వీటికి మజూరీ క్రింద పెరంబదూర్ అప్పలస్వామికి రూ. 26లు ఇచ్చినట్లు ఉన్నది. కొబ్బరి బొండములు-100, గుమ్మడికాయలు-100, 3 వేల కూర అరటికాయలు గణపవరంలో ఖరీదు చేశారు. వెలక్కాయలు, ఉసిరికాయలు, పనసకాయలు పెద్దాపురం నుంచి తెప్పించారు. పెరవలి వగైరా ఇతర ప్రాంతాల నుంచి సరుకులు తెప్పించినప్పుడు పడవలరేవు ఎగుమతి దిగుమతుల కూలి చెల్లించవలసి వచ్చినది. దీపాలకు కిరసనాయిలు వాడకం తక్కువ. ఆముదం పోసి కాగడాలు, ఇలాయిలనే దివిటీలు వెలిగించేవారు. ఆముదం చాలా కొన్నారు. ఇలాయిల చుట్టలు 15000 ఖరీదు చేశారు. పెళ్లిలో వంట బ్రాహ్మణులకు కాంట్రాక్టు రూ. 45/- లు, అదనంగా కొన్ని రోజులు పనిచేసిన బ్రాహ్మణులకు అదనంగా ఇచ్చారు. మిఠాయిలకు ప్రత్యేకంగా రూ. 20/-లు, సీనాలడ్డు, పెద్దాపురం లడ్డు, జిలేబీ చేయించారు. రవికెల గుడ్డల నిమిత్తం 8 తానులు – 97 గజములు పుచ్చుకున్నారు. కోరా సైనుకు గొల్లపాలెం పని వారిచేత ప్రత్యేకంగా అద్దకం చేయించారు. కోడలికి, వియ్యపురాలికి ప్రత్యేకంగా పట్టు రవికెల గుడ్డలు ఖరీదు చేశారు.

వివాహములకు అనేక రకాల భాజా భజంత్రీలు, మేళాలు పెట్టించారు. కాకినాడ, దొమ్మేరు , పెనుగుదురు గ్రామాల నుంచి మూడు సన్నాయిమేళములు, రండోలు మేళము, జనం నలుగురు, జాకాన ఫలీల నలుగురు, అల్గోజ జోడు తాషామరఫా, వగైరా మేళము వాళ్లకు ఇచ్చే కూలీ భత్యాలు కూడా ఇవ్వాలి. బందరు నుంచి భోగం మేళం తెప్పించారు. వాళ్లకు రోజుభత్యం ఇచ్చి రూ. 116 /- లు బహుమతి

ఇచ్చారు. పెళ్లివారి భోగం మేళానికి, వారి భజంత్రీలకు, నౌకరులకు రోజూభత్యాలు ఇవ్వాలి.

పెళ్ళివారి జవాన్లకే గాక ఇంటికి వచ్చిన బంధువుల జవాన్లకు, చాకళ్లకు, రోజూ రెండు పూటలా భత్యాలు ఇవ్వాలి. ఇది ఆ కాలంనాటి మర్యాద. వివాహానికి కావలసిన బాణాసంచా తయారు చేయించారు. మతాబుమందు, చిచ్చుబుడ్లుమందు బజారులో కొన్నారు. జమాదార్ షేక్ వల్లికి కూలీ ఇచ్చారు. వివాహంలో పగటి వేషాలు వేయించారు. వారికి భత్యమిచ్చి, బహుమతిగా రూ. 10/- లు ఇచ్చారు. పఠాని వేషం వేయించినప్పుడు ప్రత్యేకంగా డప్పు వానిని పిలిపించి వానికి కూడా కూలిని ఇచ్చారు. విప్ర వినోదులకు బహుమతి నిచ్చారు.

ఈ వివాహాలకు సుప్రసిద్ధ వేద పండితులు చాలామంది వచ్చారు. అందులో ప్రముఖులైన శ్రీ బులుసు పాపయ్య శాస్త్రి గారు వారి అన్నగారు సుప్రసిద్ధ శ్రౌతులు వెంకప్ప సోమయాజులు గారు , పుల్య ఉమామహేశ్వర శాస్త్రి గారు మొదలైన వారికి వేరే బసలు ఏర్పాటు చేసి, వారికి కావలసిన స్వయంపాకాలు, సామానులు పంపించారు. వారిని వివాహ సమయంలో సన్మానించారు. బట్టలు పెట్టారు. సదస్యంలో రూ. 690/- లు సంభావన నిచ్చినట్లు లెక్కలులో కనబడుతున్నది.

శ్రీ త్రిపుర సుందరీ అమ్మవారికి మామూలు పూజలు గాక ప్రత్యేకంగా 11 మంది బ్రాహ్మణుల చేత లక్ష కుంకుమ పూజ చేయించారు.

చెన్నపట్టణములో కోడలికి చేయించిన నగలు ఆ కాలం నాటివి: తలసామాను బంగారము. కెంపులు కోడిగలు, చరువులు, పాపిడి

బిందరీలు, సూర్యుడు, చంద్రుడు, నత్తు జమికీలు వగైరా పద్దులు, చిట్టాలలో వ్రాసిన వాటి వివరములు. ఈనాటి వారికి తెలియవు. అల్లునికి రవ్వల తమ్మెట్లు, కోడలికి పట్టుచీర తెప్పించారు. ఈ వివాహాల నిమిత్తం నాన్నగారు రూ. 4500/- లు ఋణం చేశారు. మహాలక్ష్మమ్మ వివాహానికి శివరావుగారు రెండువేల రూపాయలు ఇస్తామన్నారు. ఆ ప్రకారం ఇచ్చారు. అందులో శనివారప్పేట రాజాగారు ఆ వివాహ సందర్భంలో శివరావుగారికి ఇచ్చిన బహుమతి రూ. 1,116/- లు చేరినది. కొటికలపూడి సుబ్బారాయుడు గారు అన్నయ్య గారికి రూ.1,116 /- లు కట్నం ఇచ్చారు. ఈ సుబ్బారాయుడు గారు కర్నూలులో డిప్యూటీ కలెక్టరు గా పనిచేశారు.

నాన్నగారు వ్రాసిన చిట్టాలలో ప్రతిరోజు బంట్రోతులకు, సవారీ బోయీలలకు, చాకళ్లు వగైరా బంధుజనం యొక్క పరివారమునకు ఇచ్చిన భత్యములు చాలా వివరించబడినవి. ఆ కాలంలో మనిషికి పూటకు రూ. 0- 1- 3 భత్యం నిచ్చేవారు.

చెన్నపట్టణము నుంచి తల్లాప్రగడ మాణిక్యంబ గారు, మా పెద్ద అక్క సుందరమ్మ గారు ది. 6 -1 - 84 వ తేదీన స్టీమర్లో కాకినాడకు వచ్చారు. శివరావుగారు నిడదవోలు నుంచి త్వరగా రావడానికి వీలులేకపోయింది. నాన్నగారు ది.24-1-1884వ తేదీన టెలిగ్రామ్ ఇచ్చారు. అంతట ఆయన ముగ్గురు జవానులతోను కొంత సామానులతోనూ ది.26- 1- 1884వ తేదీన వచ్చారు. తరువాత ఇంకొక జవాను వచ్చాడు. అనేక సరుకులు ఆ పరగణా నుంచి తెప్పించారు. శివరావుగారు వివాహాలైన తరువాత ది. 17- 2- 1884వ తేదీన తిరిగి నిడదవోలు వెళ్లారు.

శ్రీ గంగాధరరామారావు గారు.

పిఠాపురం రాజా శ్రీ వేంకట మహీపతి గంగాధరరామారావు గారి ఫోటోలు[20] అనేక గ్రంథాలలోనూ , పత్రికలలోనూ ఉన్నవి. / చూడుడు. (శారద - సంపుటం 2). రాజాగారు స్ఫురద్రూపి. మంచి వర్చస్సు . పచ్చని శరీర ఛ్ఛాయ గలవారు. విశాలమైన నేత్రములు, తీరైన ముక్కు, చెవులు, సన్నని పెదవులు. తుమ్మెదరెక్కల వంటి వాలుమీసములు, గుండ్రనిది గాక



కొంచెం నిలువు ముఖము. నుదుట స్ఫుటమైన పంగనామములు, తిరుచూర్ణ రేఖ వారి రూపము రవివర్మగారి చిత్రపటములలోని పూర్వ రాజుల అందమైన ఆకారమును స్మృతికి తెచ్చుచుండును.రాజాగారు సాధారణంగా చాలా సన్నని తెల్లని ఉప్పాడ జరీ అంచు పంచెలు కట్టుకునేవారు. సన్నని ఒుక్కుమజిలీను లాల్చీ తొడిగి కొని, దాని పైన జరీబుటేదారీ పనిచేసిన ముఖమల్ కోటు ధరించేవారు. వారి మెడలో సన్నముగా మడతపెట్టిన విలువైన కాశ్మీర్ శాలువా వేలాడుతూ ఉండేది. తలకు తెల్లని మజిలీను జరీఅంచు కుచ్చు తలపాగా, దానికి ముందు భాగంలో పూర్వం మహారాజులు తమ తలపాగాలకు ధరించే

---

[20] 1914సం. ఆంధ్ర పత్రికలో ప్రకటించిన ఈ ఫొటోని శ్రీ పరుచూరి శ్రీనివాస్ గారు వాడపల్లి తల్పశాయిగారి ద్వారా తెప్పించి యిచ్చారు

కలికితురాయి వంటి నవరత్న ఖచితమైన ఒక బంగారుభూషణము ఉండేది.

రాజాగారి చెవులకు రవ్వల తమ్మట్లు , మెడలో ముత్యాలు, పగడాలు కలిసిన బంగారుహారము, చేతులకు భుజబందులు, ముంజేతులకు బంగారుకంకణములు, మురిడిగొలుసులు, చేతుల వేళ్ళకు నవరత్నములుపొదిగిన ఉంగరములు ధరించేవారు. వారి కాళ్లకు జరీబుటేదారీ పనిచేసిన విలువైన పైజారులుండేవి. రాజాగారు కూర్చుండు కుర్చీ విరుగుడుచేవతో, దంతపు పనితో, బంగారుకట్లతో సింహాసనము వలె నుండేది. అందులో సోఫామెత్తల వంటి మెత్తలు ఉండేవి. వారొకచేతిలో రత్నములు పొదిగిన బంగారుపిడి గల, పెద్ద కైజారు వరలో నున్న దానిని పట్టుకుని కూర్చుండేవారు.

రెండు లక్షలు ఖర్చు చేసి, వారు పిఠాపురంలో కట్టించిన కైలాస మహల్ అనే రాజభవనము చాలా అందమైనది. అందులోని దర్బారుహాలు, పూర్వకాలమునాటి మహారాజుల కొలువుకూటములలోని అలంకారములతో, అందమైన చిత్తరువులతో, విలువగల రత్న కంబళములతో, ఉచితాసనములతో వారి దర్బారుకు తగినట్లు ఉండేది.

రాజాగారికి పూర్వ రాజలాంఛనములందు , రాజమర్యాదలందు ప్రీతి. వారి పట్టపుటేనుగునకు అందమైన పట్టు గవిసెనలు వేసేవారు. వెండి స్తంభాలకు బంగారు రేకులు తాపడం చేసిన మంచి అంబారీలు ఉండేవి. ఏనుగునకు పట్టెవర్ధనములు పెట్టేవారు. రాజనగరు సింహద్వారము దగ్గరనే బతునగారా వాద్యములు మ్రోగించేవారు.

రాజాగారు సాధారణంగా పట్టుకుచ్చులు, ముత్యాల జాలరులు కలిగి వెండి, బంగారు రేకులు తాపడం చేసి, రెండు ప్రక్కలా కనబడు అందలము అను పల్లకిలో నూరేగేవారు. చోపుదారులు, పరివారజనము వెంటరాగా, భట్రాజులు బిరుదావళి నుగ్గడించి, పద్యములు చదువుతూ ఉండగా, ఊరేగేవారు. వారి ఊరేగింపు లో పూర్వకాలమునాటి ఛత్రచామరములు ఉండేవి. రాజధానిలోను, పర్యటనములందును వారు పోవు వీధులలోని స్త్రీజనము వారికి మంగళహారతులు ఇవ్వడము, వారి పళ్ళెములలో రాజుగారు రూపాయికి తక్కువ గాకుండా వేయించడం జరిగేది. రాజాగారి అంతఃపుర స్త్రీలు ఘోషాపద్ధతిని సవారీలలో ప్రయాణము చేసేవారు. రాజాగారి వైభవము శ్రీ చెళ్ళ పిళ్ళ వేంకటశాస్త్రి శతావధాని గారు వర్ణించారు.

"పూర్వపు జమీందారుల మర్యాదలు, వేష భాషలు ఇప్పుడు మనం కథలతో చెప్పుకోవాల్సిందే గాని అనుభవంలో కనబడవు. మా గంగాధర రామారావు గారు సర్వ విధాలా పూర్వపు తరగతిలోని వారు. స్నానము, వారి కేర్పడ్డ రీతిని సంధ్య, జపము, తపము ఇవన్నీ నెరవేర్చుకునేవారు. ఏ వర్ణస్థుల నెట్లు గౌరవించాలో అట్లే గౌరవించేవారు. కులాభిమానం ఎంత ఉండాలో అంతా పూర్తిగా ఉన్నవారు. పండితుల యందు ఎంతవరకు రాజునకు అభిమానం ఉండాలో అంతా సంపూర్తిగా ఉన్నవారు. వేయేల ఏ విషయమునందును పూర్వులకు తీసిపోకుండా, మానమర్యాదలు లవమున్నూ తగ్గకుండా రాజ పరిపాలన చేసిన వారని అనుభవజ్ఞులు ఇప్పటికీన్నీ చెప్పుకుంటారు". అని 1936 సం. జూన్ నెలలో కృష్ణా పత్రికలో వ్రాసియున్నారు. శ్రీ వేంకటశాస్త్రి గారి స్వగ్రామమైన కడియం,

పిఠాపురం జమిందారీలోని ముఖ్యమైన గ్రామము. రాజాగారు అక్కడ నొక దివ్య భవనమును కట్టించారు. తరచుగా అక్కడ మకాము చేసేవారు. అందువల్ల, శ్రీ శాస్త్రి గారి తండ్రి గారికి ఆ ఊరి పెద్దలకి వారి సంగతులు బాగా తెలుసును. వారి వల్ల విన్న మాటలనే శాస్త్రులు గారు వ్రాశారు. రాజాగారు కాకినాడలోనూ, రాజమహేంద్రవరములోనూ కూడా రాజభవనములు నిర్మించారు. అన్నపూర్ణ మహల్, పురుహూతి మహల్ అని పేర్లు పెట్టారు. రాజాగారు చాలా తెలివైన వారు. లోకజ్ఞానం కలవారు. తెలుగు, ఇంగ్లీషు, హిందుస్తానీ భాషలతో పాటు సంస్కృతము కూడా మాట్లాడగలవారు. మంచి వ్యవహార్త[21]. సాహసౌదార్యాది సద్గుణములు కలవారు. సాధారణంగా రాజులలోనూ, జమీందారులలోను కనబడే దుర్వ్యసనాలు వారికి లేవు. ఆనాటి జమీందారులలో వారు అగ్ర గణ్యులని చెప్పవచ్చును.

రాజకీయాలు

పిఠాపురం రాజా శ్రీ గంగాధరరామారావుగారి పరిపాలనలోనూ శ్రీ శివరావు పంతులు గారి దివాన్గిరీ లోనూ గల విశిష్టతను గ్రహించాలంటే, ఆ కాలంనాటి రాజకీయ, ఆర్ధిక, మత, వైజ్ఞానిక పరిస్థితులు కొంత తెలియాలి.

భారతదేశాన్ని పరిపాలించిన ఇంగ్లీషు వర్తక కంపెనీ వారి ప్రభుత్వాన్ని తిరగ దోడడానికి 1857సం.లో జరిగిన విప్లవానంతరము కంపెనీ పరిపాలన రద్దుచేసి, ఇంగ్లాండ్ లోని బ్రిటీష్ పార్లమెంటు

---

21 వ్యవహార్త అంటే వ్యవహార దక్షత కలిగినవారు

అధికారం క్రింద విక్టోరియా రాణి మంత్రుల పరిపాలన స్థాపించబడినదని, ఇక ముందు అన్ని జాతుల వారిని న్యాయంగా పరిపాలిస్తామని, స్వదేశ సంస్థానాలను తమ రాజ్యాలలో కలుపుకొనమని, ప్రజలను క్రైస్తవ మతములో కలుపు కొనమని 1858సం. నవంబర్ ఒకటవ తేదీన విక్టోరియారాణి గారి చేత ప్రకటన చేయించారు.

కంపెనీ వారి దుష్పరిపాలన అంత మొందించడానికి భారతదేశంలో జరిగిన స్వాతంత్ర సమరాన్ని అతి క్రూర విధానాలతో బ్రిటిష్ వారు అణచివేసి, దేశంలో నిరంకుశ పరిపాలన సాగించారు. తెల్లవారికి నల్లవారిని చూస్తేనే అసహ్యము. పైగా 1857 సం.లో పెద్ద తిరుగుబాటు చేసి, కొందరు తెల్లదొరలను చంపారనే కార్పణ్యముతో, క్రోధముతో దేశీయులను అందరినీ అనుమానముతో చూసేవారు. సంస్థానాధిపతులు, జమీందారులు బ్రిటిష్ ప్రభుత్వం పట్ల రాజభక్తి కలిగి ఉంటామని, ప్రమాణాలు చేసి, బ్రిటిష్ వారికి దాసాను దాసులై యున్నప్పటికినీ వారిని కూడా అనుమానంతో చూసేవారు. దేశ ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం గాని, ఇతర స్వాతంత్ర్యములు గాని లేకుండా కఠినశాసనాలు చేశారు. దేశీయులందరినీ నిరాయుధులను చేశారు. దీనిని గురించి 1860 సం.లో ఆయుధ శాసనము చేశారు. అంతకు పూర్వమే ఎట్టి విచారణ లేకుండా, ఎవరినైనా జైలులో పెట్టి, నిర్బంధించడానికి వంగ రాష్ట్రంలోనూ, మద్రాసులోనూ, బొంబాయి లోనూ 1818- 27- 30 పురాతన రెగ్యులేషనులు ఉన్నవి. వాటిని బయటకు తీసి, ప్రయోగించడం ప్రారంభించారు. 1857 సం.లో ప్రెస్ చట్టం వల్ల వాక్ స్వాతంత్రము అరికట్టబడింది. 1858 సం.లో తిరుగుబాటు దారుల ఆస్తిని లాగుకునే శాసనం చేశారు. 1858 సం.లోనే రాజులు,

సంస్థానాధీశులు, ప్రజా నాయకులు మొదలైన వారిని జైలులో పెట్టే స్టేటు ప్రిజనర్స్ చట్టం చేశారు. 1861 సం.లో పోలీసు చట్టమునే గాక, శిక్షార్థపు ప్యూనిటివు పోలీసు చట్టాన్ని చేశారు. అనేక విధములైన నేరములను సృష్టిస్తూ పీనలు కోడ్ అనే శిక్షాస్మృతిని మెజిస్ట్రేట్, పోలీసు చర్యలతోనూ, కోర్టులలోను నేరముల ఆచూకీ, విచారణ మొదలైన వాటి కార్యాచరణ ప్రక్రియలను గూర్చి, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ మొదలైన అనేక శాసనాలు చేశారు. సివిల్, క్రిమినల్ వ్యవహారాలలో సర్వాధికారములు గల ఉన్నత న్యాయస్థానములను, హైకోర్టును స్థాపించారు.

1861 సం. నుండి పన్నులు హెచ్చు చేశారు. కొత్తగా ఆదాయం పన్ను విధించారు. దేశ రక్షణకని, శాంతిభద్రతలకని పెద్ద జీతాల సైనిక ఉద్యోగులను, బ్రిటీష్ సైనికులను, పోలీసు ఉద్యోగులను, సిబ్బందిని హెచ్చించారు. దేశ ఆదాయంలో ఆ విధంగా చాలా భాగం వ్యయం చేసి, ప్రజల విద్యా వైద్యాలు, ఆర్థిక క్షేమ లాభాలకు ఉపకరించు పరిశ్రమలకు, వ్యవసాయానికి, పల్లపు నీటి వనరులకు, ఇతర కార్యాలకు డబ్బు లేదనే వారు.

దేశ ప్రజలకు నోరు లేదు. ఆలనా పాలనా లేవు. ప్రభుత్వంలో పలుకుబడి లేదు. న్యాయంగా పరిపాలిస్తున్నామని ప్రపంచాన్ని మోసగించడానికి 1861సం. లో బూటకపు శాసనసభలను నిర్మించారు. అందులో నియమింపబడిన సభ్యులలో ఉద్యోగులే అధిక సంఖ్యాకులు . తాము చెప్పినట్లు వింటారని తోచే దేశీయులను కొందరిని సభ్యులుగా నియమించారు. ఈ సభ తీర్మానముల ప్రకారము ప్రభుత్వము నడవనక్కరలేదు. ఆదాయవ్యయముల పైన శాసనసభకు

అధికారం లేదు. నిజానికి ఏ అధికారాలు లేవు. రాణి గారి వాగ్దానములు కాగితముల పైననే ఉండిపోయినవి. ఆచరణలో లేవు. క్రైస్తవ మిషనరీలు, పాఠశాలలు, ఆసుపత్రులు స్థాపించి, పలుకుబడి కలిగి, దేశీయ మతములను దూషిస్తూ వీలైన వారిని తమ మతంలో కలుపుకుంటూనే ఉన్నారు. ప్రభుత్వ అధికారులు వారికి తోడ్పడుతూనే ఉన్నారు. దేశములో విద్యాభివృద్ధి లేదు. ఆరోగ్యము వెనుకబడినది. పరిశ్రమలు లేవు. పల్లం సాగు వృద్ధి చెందలేదు. రాకపోకలకు రోడ్లు లేవు. తుదకు ఊళ్ళల్లో త్రాగడానికి మంచినీళ్లు అయినా లేవు. పూర్వము రాజవంశీయులైన మహారాజులు, సంస్థానాధిపతులును, జమీందారులును బ్రిటిష్ అధికారులకు, ఉద్యోగులకు దాసాను దాసులుగా ఉండవలసిన గతి పట్టినది. వారు ఏపని చేయదలచినప్పటికీ బ్రిటిష్ ప్రభుత్వ ప్రతినిధి అయిన రెసిడెంట్ ఇష్టానుసారము జరిగించాలి. పూర్వ రాజవంశీయులైన చిన్న చిన్న రాజులు, సంస్థానాధిపతులు, సామాన్య జమీందారులతో పాటు 1802సం. నుండి ఎలాంటి ప్రభుత్వాధికారాలు లేకుండా పెద్ద భూస్వాములై తమ జిల్లాలోని కలెక్టర్ ఆజ్ఞానువర్తులుగా ఉండవలసిన వారైనారు. కంపెనీ ప్రభుత్వంలోనే జిల్లాకు అధికారి అయిన కలెక్టర్ల ఇప్పుడు అనేక శాసనాధికారాలతో నిరంకుశ అధికార్లు అయినారు. పెద్ద జమిందార్లు కూడా అనేక విధాలుగా కలెక్టర్ల అధికారానికి లోబర్చబడినారు. తుదకు వారి వారసత్వాలు కూడా కలెక్టర్ రిజిస్టర్ చేసేవాడు. బ్రిటిష్ పరిపాలనలో న్యాయ పరిపాలన సాక్ష్యాధారముల పైన ఆధారపడినది. అందువల్ల, ధనవంతులు అబద్ధపు సాక్ష్యాలపైన బలహీనులను పీడించడానికి వీలైనది. జమీందారుల వారసత్వ వ్యాజ్యములు, దత్తత వ్యాజ్యములు, తమ బంధువులతోనూ, రైతులతోనూ వ్యాజ్యములు

వగైరాలకు లక్షలు లక్షలు ఖర్చు పెట్టేవారు. హైకోర్టు ప్రీవి కౌన్సిల్ అప్పీలులో కేవలము లాపాయింటు - న్యాయ శాస్త్ర సూక్ష్మములను బట్టి క్రింది కోర్టు తీర్పులు తారుమారు చేసేవారు. ఇది పెద్ద జూదముగా పరిణమించినది. జమీందారులు సర్కారుకు చెల్లించవలసిన పేష్కరు, 1802 సం.లో శాశ్వతముగా నిర్ణయమైనది. రైతులు జమీందారులకు చెల్లించవలసిన శిస్తులు కూడా శాశ్వతముగా నిర్ణయించాలనే ఇంగ్లీషు కంపెనీ ప్రభుత్వం వారి ఉద్దేశ్యము. అయితే, 1802 సం. నాటికి రెగ్యులేషనులోని సందిగ్ధ నిబంధనలు సందేహానికి అవకాశం ఇచ్చినవి. జమీందారులు శిస్తులు హెచ్చించి, రుసుములు వసూలుచేసి రైతులను బాధించగా వ్యాజ్యములు ఆరంభమైనవి. పర్మనెంట్ సెటిల్మెంట్ ఉద్దేశ్యమును గురించి 1822సం|| లో ఒక రెగ్యులేషన్ చేసినా లాభం లేక పోయినది. అనేక విధములైన తప్పులు వచ్చినవి. 1863 సం. ఒక జిల్లా జడ్జి రైతులకు జిరాయితీ హక్కులు ఉన్నట్లు కూడా తాను అంగీకరించనన్నాడు. అందువల్ల, జమీందారు రైతుల హక్కులను గురించి స్పష్టీకరించడానికి రెంటు రికవరీ బిల్లు తయారు చేశారు. దీనిని రెవెన్యూ బోర్డు వారు క్రొత్తగా నిర్మించిన శాసనసభ ఉపసంఘం వారు, ప్రభుత్వము వారు చర్చించి, సవరించి 1865 సం.లో దానిని శాసనము చేయడంలో జమీందారులు తమ ధనమును, పలుకుబడిని ఉపయోగించగా శిస్తులు హెచ్చించడానికి అవకాశాలు కలిగినవి. కొందరు జమీందారులు శిస్తులు హెచ్చించగా రైతులు దావాలు దాఖలు చేశారు. వాటిపైన అప్పీళ్లు తీర్మానం అయ్యేటప్పటికి చాలాకాలం పడుతుంది.

పిఠాపురం జమీందారీలో ఈ చట్టాన్ని పురస్కరించుకొని శిస్తులు హెచ్చిస్తే, పూర్వకాలం నుండి గ్రామాలలో అమలు

జరుగుతున్న వంతువారడి అమరకపు పద్ధతి అనే చిరకాల ఆచారానికి భంగము కలుగుతుంది.

వంతువారడి అమరకం

పిఠాపురం జమీందారీ గ్రామాలలో చిరకాలం నుంచి వంతువారడి అనే అమరక పద్ధతి అమలు జరుగుతూ ఉన్నది. జమీందారు గారికి గ్రామ మొత్తం మీద చెల్లించ వలసిన రొక్కపు శిస్తు మొత్తమును మూడు సం.లకు గానీ, అంతకన్నా ఎక్కువ కాలానికి గాని , ప్రతీ గ్రామంలోని గ్రామ అధికారులతో అమరకపు ఏర్పాటు చేసి నిర్ణయిస్తారు. ఆ గ్రామంలో ప్రతీ రైతూ సాగుచేసే పొలం పైన చెల్లించవలసిన శిస్తు గ్రామాధికారులు, పెత్తందారులు నిర్ణయిస్తారు. అయితే, ఒక రైతు పొలానికి నిర్ణయించిన శిస్తు అదే మాదిరి తన ప్రక్క పొలానికి నిర్ణయించిన దానికన్నా హెచ్చుగా నున్నచో ఆ రైతు ఆ ప్రక్క పొలానికి తాను హెచ్చు శిస్తు ఇస్తానని తన కిప్పించమని గ్రామ పెత్తందారు దగ్గర సవాలు (ఛాలెంజ్) చేయవచ్చును. అప్పుడా ప్రక్క పొలం రైతు తన పొలానికి హెచ్చు శిస్తు హెచ్చించడం లేదా మొదటి రైతు పొలానికి తగ్గించడమో జరపాలి. లేకపోతే, ఉభయుల పొలాలు ఒకరి దాన్ని ఇంకొకరు మార్చుకోవాలి. ఈ సవాలు పద్ధతి గోదావరి జిల్లాలలో ఇంకా చాలా గ్రామాలలో ఉండేది. ఇది మంచిది కాదని కొందరు కలెక్టర్లు విమర్శించారు. కానీ 1845 సం. నుండి 1854 సం. వరకు కలెక్టరుగా నున్న ప్రెండరుగాస్టు గారు ఇది న్యాయమైన పద్ధతి అని ప్రజలు భావిస్తున్నారనీ, ఇది చిరకాల ఆచారంగా జరుగుతున్నదనీ, భూమి

శిస్తుల నిర్ణయాన్ని గురించి బలవత్తరమైన తగాదాలు జరుగకుండా, న్యాయంగా పరిష్కరించడానికిది మంచి మార్గంగానే ఉన్నదని ది. 5-3-1850 వ తేదీన ఉత్తర సర్కారుల కమిషనర్ కు వ్రాశాడు. గవర్నమెంట్ గ్రామాలలో అనేక విధములైన అమరక పద్ధతులు ఉన్నందువలనను, కలెక్టర్లు తమ చిత్తానుసారంగా శిస్తులు నిర్ణయిస్తూ, వాటిని మారుస్తూ, ఉన్నందువలననూ, జమాబందీలలోనూ తరువాత కూడా తగాదాలు వస్తూ ఉండేవి. ఉత్తర సర్కారుల కమిషనర్ అమరక పద్ధతులను గురించి 1854 సం.లో కొన్ని పద్ధతులు సూచించాడు. కానీ వాని నన్నింటినీ అమలుపరచడం సాధ్యం కాలేదు.

పిఠాపురం జమీందారీ 1851 సం. నుండి 1862 సం. వరకు కలెక్టర్ల మేనేజ్మెంట్ క్రింద ఉండగా, తిమ్మరాజు గారు మేనేజర్ గా ఉన్న కాలంలోనూ అటు తరువాతను కూడా ఈ వంతువారడి అమలు జరిగినది. ఎస్టేట్ గంగాధరరామారావు గారికి వశమైన తరువాత శివరావుగారి దివాన్గిరీలో కూడా ఈ పూర్వాచారాన్ని మార్చలేదు. గంగాధరరామారావు గారు 1890సం.లో చనిపోయిన తరువాత మళ్లీ ఎస్టేట్ 1906 సం. వరకు కలెక్టర్ మేనేజ్మెంట్ క్రింద ఉన్నప్పుడు అమరక విధానంలో కొన్ని మార్పులు జరిగినవి. శిస్తు రేట్లు కూడా కొంచెం హెచ్చించారు.

ఈ పద్ధతిని తృణీకరించి, శిస్తు హెచ్చిస్తే గ్రామస్తులు, రైతులు తప్పకుండా వ్యాజ్యాలు దాఖలు చేస్తారు. మూడు కోర్టులు తిరిగేటప్పటికి చాలాకాలం పడుతుంది. చాలా ధన వ్యయమవుతుంది. వీటివల్ల అనేక క్రొత్త తగవులు వస్తాయి. రాజాగారునూ , శిరస్తాదారుగారునూ బాగా ఆలోచించి, గ్రామస్తులతో తగవులు రాకుండా

ఉండగలందులకు వంతువారడి అమరకం పద్ధతికి విరుద్ధంగా శిస్తులు మార్చకూడదని నిశ్చయించారు. అయితే, రాజాగారికిని, గ్రామ రైతులకును లాభకరంగా ఉండే ఒక కొత్త పథకమును అవలంబించడాన్ని గురించి ఆలోచించారు. గ్రామాలలో పల్లం సాగుబడి అభివృద్ధి చేస్తే గ్రామస్తులు సంతోషిస్తూ హెచ్చుశిస్తు ఇస్తారు. గనుక ఆనకట్ట క్రిందను , ఏలేరు క్రిందను పల్లం సాగుబడి అభివృద్ధి చేయడానికి కావలసిన కాలువలు, చెరువులు, ఇతర నిర్మాణాలు(irrigation works) చేయించడానికి నిర్ణయించారు. ఇంతేగాక గ్రామాలలో మంచినీటి సదుపాయం కలిగించడానికి నిశ్చయించారు. గ్రామాలలో విద్యాభివృద్ధి లేనందువల్ల అజ్ఞానం వ్యాపించి , నీతి, మత, ధర్మాలకు భంగము కలుగుతున్నదని, అందుకోసం గ్రామాలలో వీధిబడులు, పట్నాలలో తెలుగు, ఇంగ్లీషు పాఠశాలలే గాక వేద శాస్త్ర పాఠశాలలు, సంస్కృత పాఠశాలలు, బాలికా పాఠశాలలు కూడా పెట్టించి, విద్యాభివృద్ధి చేయాలని సంకల్పించారు. దేశ ప్రజల ఆరోగ్యానికి వైద్య సౌకర్యాలు కలిగించాలని ఆలోచించి నారు. ఇంకా ప్రజల క్షేమ, లాభాలకు తోడ్పడే సత్కార్యాలు తలపెట్టారు. రాజుగారు, శివరావుగారు కూడా సనాతన ధర్మమునందు గౌరవము కలవారే. కనుక దివ్యక్షేత్రములలోనున్న దేవాలయముల మరమ్మత్తులు చేయించి, ప్రజల నీతి, మత, ధర్మాలకు తోడ్పడు పుణ్యకార్యాలు, దానధర్మాలు చేయాలని సంకల్పించారు. ఈ పనులన్నీ నిర్నిరోధంగా , జయప్రదంగా నిర్వహించాలంటే తమ జిల్లా కలెక్టర్ ను మంచి చేసుకోనాలనే సంగతి రాజాగారికి, శివరావుగారికి తెలియును

బ్రిటిష్ ప్రభుత్వం ఒక యంత్రము వంటిది. అందులో తాలూకా, జిల్లా అధికారులు, చెన్న పట్టణము ప్రభుత్వములోని వివిధ శాఖలు, సెక్రటరీలు చక్రాలవంటి వారు. ఒక గ్రామంలో గాని, పట్టణములోగాని ఒక చిన్నపని కావాలంటే దానిని గురించి తహసీల్దారు పరిశీలించి, కలెక్టరుకు నివేదిస్తాడు. కలెక్టర్ తన అభిప్రాయముతో రెవెన్యూ బోర్డుకు పంపుతాడు. వారు పరిశీలించి ప్రభుత్వ కార్యాలయానికి పంపుతారు. అక్కడ ఆ విషయానికి సంబంధించిన సంగతులు గల ఫైలు రెవెన్యూ, డిపిడబ్ల్యూ, ఆరోగ్య, విద్యా శాఖలు, ఆర్థిక శాఖ మొదలైన అధికారులకు పంపుతారు. దానిపైన తమ అభిప్రాయాలు వ్రాస్తారు. ప్రతి శాఖలోని ఉద్యోగులు, గుమాస్తాలు, పై అధికారికి నోటు పెడుతూ ఉంటారు. ఇలాగా ఆ ఫైలు గిరగిరా తిరిగి కొన్ని నెలలకో, సంవత్సరాలకో బయటపడుతుంది. అప్పుడాపని అవునని కానీ, కాదని కానీ తేలుస్తారు. దీనికే రెడ్ టేప్(red tape) అని పేరు. ఈ చక్రాలకు ఆముదము వంటి గ్రీజు పోయాలని కొందరు ఛలోక్తిగా అంటారు. అంటే సిఫారసులు గానీ, లంచాలు గాని అని అర్థం. పూర్వము అన్ని వ్యవహారాలు ఇలాగే జరిగేవి. బ్రిటిష్ వారు పోయినా ఆ పద్ధతులు ఇంకా పోలేదు. అందువల్ల, పైన చెప్పిన రాజకీయ పరిస్థితులలో దొరల అనుగ్రహము సంపాదిస్తే గాని ఏ పని జరిగేది కాదు. కాబట్టి, వారినందరినీ ఏదో విధముగా మంచి చేసుకోవాలి. ఇది దేశీయులకు చాలా కష్టమైన పని.

రాజాగారు ఎంతో మహోదారులై సత్కార్యాలు చేయదలిస్తే విద్యాభివృద్ధికి, ఆరోగ్యాభివృద్ధికి, పల్లపు సాగునీటి వనరుల అభివృద్ధికి, ఆర్థిక, క్షేమ, లాభాలకు వారు తలపెట్టిన కార్యాల వివరాలు ముందుగా

కలెక్టర్ కు చెప్పాలి. అతడు అనుకూలమైన అభిప్రాయంతో పైకి పంపాలి. వాటిని పైన చెప్పిన ప్రభుత్వ శాఖాధికారులు పరిశీలించి అంగీకరించాలి. అప్పుడే దానికి కావలసిన అనుమతి పత్రాలు, సౌకర్యాలు లభిస్తాయి.

పైన చెప్పిన పరిస్థితులలో రాజాగారు తాము తలపెట్టిన మహాత్కార్యాల విషయమై పై అధికారుల అనుమతిని సంపాదించుటకు స్వయముగా ప్రయత్నించుట అసంభవము కదా. అందువల్ల, శివరావు గారిని   ప్రయోగించేవారు.   శివరావుగారు   కలెక్టర్ల తోను, పై అధికారులతోనూ, మాట్లాడి, వారిని మంచి చేసుకుని, తాము తలపెట్టిన పథకాలకు అనుమతి పత్రాలు, సౌకర్యాలు సంపాదించేవారు. ఇందుకు ఎంతో   శాంతము, ఓపిక కావాలి.   కార్య చతురత కావాలి. అదృష్టవశమున శివరావుగారికి ఈ సుగుణములన్నీ ఉన్నవి. అందువల్ల, రాజాగారు తలపెట్టిన కార్యాలను సాధించి, సక్రమంగా నిర్వహించగలిగే వారు. ఆయా కార్యాలన్నీ స్వయంగా పూర్తి చేయించేవారు.

తాము తలపెట్టిన సత్కార్యాల విషయంలో కలెక్టర్లను, పై అధికారులను   ఆశ్రయించి,   మంచిచేసుకుని   అనుమతిపత్రాలు సంపాదించడంలోనున్న చిక్కులు అలాఉంచి, పిఠాపురం జమీందారీకినీ, ప్రభుత్వానికినీ మధ్యగల అనేక వ్యవహారాలలో అప్పుడప్పుడు కొన్ని చిక్కులు వచ్చేవి. అందులో కలెక్టర్ గారికి, పై అధికారులకు అసంతృప్తి కలుగకుండా ఆ వ్యవహారాలను పరిష్కరించుకోవలసి వచ్చేది. ఇందులో ఏమాత్రం అవకతవకలు జరిగిన కలెక్టర్లకు, పై అధికారులకు కోపము వచ్చి రాజాగారి పట్ల పగబూని వారికి ఏదో విధంగా అపకారం చేస్తారు. ఆరోజులు అలాంటివి. శివరావుగారి దివాన్గిరీ కాలంలో ఇటువంటి

చిక్కు వ్యవహారాలు చాలా వచ్చినవి. అందులో మచ్చుకు ఒకటి రెండు చూస్తే శివరావుగారి చాకచక్యము, రాజ్య తంత్రజ్ఞత తెలియగలదు.

ధవళేశ్వరం అను గ్రామము రాజమహేంద్రవరమునకు నాలుగు మైళ్ళ దూరంలో ఉన్నది. అక్కడ గోదావరి ఆనకట్టను 1847 - 1852 సం.ల మధ్య నిర్మించారు. అక్కడ నుండి అనేక కాలువలు త్రవ్వి గోదావరి డెల్టాకే గాక జిల్లా కంతటికీ పల్లపు సాగునీటి వనరులు కల్పించారు. అక్కడ ప్రభుత్వమువారి ఇంజనీరింగ్ వర్క్ షాపును నిర్మించి ఇనుము, ఉక్కు, గర్డర్లు మొదలైన అమూల్యమైన సామానులు తయారు చేసెవారు. ధవళేశ్వరంను ధవళగిరి అనేవారు. కందుకూరి వీరేశలింగం పంతులు గారు తమ రాజశేఖరచరిత్రలో ఈ గ్రామమును హృదయపూర్వకంగా వర్ణించారు. అక్కడి జనార్ధన స్వామి వారి ఆలయము, శ్రీరాములవారి పాదాలు, వైష్ణవస్వాముల పద్ధతులు, ఆచారాలు, స్వామివారి ఉత్సవాలు మొదలైన వాటిని కనులకు కట్టినట్లు వర్ణించారు.

ధవళేశ్వరం పిఠాపురం జమీందారీలోనిది. ఇది వైష్ణవ క్షేత్రమైనందువల్ల, గోదావరి తీరమైనందువల్ల రాజాగారికి ఈ గ్రామము పైన చాలా మక్కువ. ఇక్కడ వారు కొన్ని దానధర్మములు చేశారు. ఆనకట్ట నిర్మాణం సమయంలో ప్రారంభంలో వీరి తండ్రిగారు వెంకట సూర్యరావు గారు కంపెనీవారికి అనేక సౌకర్యాలు కల్పించారు. ఆయన చనిపోయిన పిమ్మట పిఠాపురం ఎస్టేటు కలెక్టర్ మేనేజ్మెంట్ క్రిందనే ఉన్నది. ఆనకట్ట నిర్మాణము పూర్తి అయ్యి గోదావరి కాల్వల క్రింద సాగుబడి జరుగుతూ ఉండగా గంగాధరరామారావు గారికి ఎస్టేటు స్వాధీనమైనది. అప్పుడు అనేక సందర్భాలలో ఏదో ఒక పని కోసం

గవర్నమెంట్ వారు కలెక్టర్ గారి వారి ద్వారా రాజాగారిని అడిగి, వారి అనుజ్ఞను, అంగీకారమును పొందవలసి వచ్చేది. ఇది గవర్నమెంట్ కు కొంచెం అసభ్యముగా తోచింది. ఈ ఆనకట్ట అక్కడ ఉన్నందువల్ల గవర్నమెంట్ వారి డిపిడబ్ల్యూ శాఖ వారికి , రెవెన్యూ శాఖవారికి, ఇతర శాఖలవారికి అనేక సౌకర్యాలు కావలసి వస్తాయి. అందువల్ల, ఈ గ్రామాన్ని ఎలాగైనా రాజాగారి దగ్గర నుండి తీసేసుకుంటే మంచిదని పై అధికారులు ఆలోచించారు. కలెక్టర్ గారి ద్వారా రాజాగారికి రాయబారాలు పంపించారు. గ్రామాలలో మీకు ఏమి సౌకర్యాలు కావలసినా చేయిస్తామని, ఈ గ్రామానికి రాజకీయ, ఆర్థికమైన ప్రాముఖ్యత నే గాక, మత సంబంధమైన ప్రాముఖ్యత కూడా ఉన్నందువల్ల దీనిని గవర్నమెంట్ కు వదిలివేయడానికి తమకు మనసొప్పదని రాజాగారు చాలా మర్యాదగానే చెప్పారు. కలెక్టర్ గారు ఈ సంగతి పైఅధికారులకు వ్రాశారు. గ్రామాన్ని ఉచితంగా ఇవ్వనక్కరలేదని, దీనికి బదులుగా ఉప్పాడ, అమీనాబాద్ అనే రెండు గ్రామాలు ఇస్తామని గవర్నమెంట్ వారు కలెక్టర్ గారి వారి ద్వారా మళ్ళీ కబురంపారు. రాజాగారు చాలా పట్టుదల స్వభావం కలవారు. వారికి ఇష్టము లేని పని ఎవరు చెప్పినా వినరు. ఒక్క శివరావుగారు చెప్పితే మాత్రం కొంతవరకు ఆలోచించేవారు. ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటని శివరావుగారిని పిలిచి అడిగారు. ఇండియాలో రాజాధిరాజులైన బ్రిటీష్ ప్రభుత్వము వారు సర్వాధికారులని, వారు తమ సామంత ప్రభువులను ఏదైనా చేయవలసినదని కోరితే, అది కోరికగా గాక ఆజ్ఞాపనే అని, మనం ఒకవేళ మంకుపట్టు పట్టి, నిరాకరిస్తే , దానికి ఏదో నష్టపరిహారము ఇచ్చి, తీసుకోవడానికి ప్రభుత్వానికి అధికారం ఉన్నదని, మనము మూర్ఖించి ఇవ్వకపోతే , వారే లాగేసుకుంటారని, అప్పుడు

పై అధికారులకు మనపైన అసంతృప్తి కలుగుతుందని, వారి ప్రతినిధి అయిన కలెక్టర్ మనపట్ల పగబూని, మన పనులకు అడ్డుపడి, వీలైతే అపకారం కూడా చేయగలడని, అతడు సిఫారసు చేయని కార్యాలు పైవారు అంగీకరించరని అందువల్ల, ఈ వ్యవహారాన్ని సామాన్య దృష్టితో గాక, దూరదృష్టితోను, రాజనీతికి సంబంధించిన దాని గాను, ఆలోచించాలని, తమరు తలపెట్టిన మహాత్కార్యాల నిర్వహణలో మనకు కలెక్టర్ల తోనూ, పై వారితోనూ చాలా పనులు ఉన్నందునను, దీనిని గురించి తమరు బాగా ఆలోచించి తమ నిశ్చితాభిప్రాయం తెలుపవలసినదని శివరావుగారు రాజాగారికి సలహాలు ఇచ్చారు.

రాజాగారు తలపంకించారు. ఒక రోజల్లా ఆలోచించారు. తుదకు శివరావుగారు ఇచ్చిన సలహాలోని దూరదృష్టిని గ్రహించారు. అంతట, ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాలను పుచ్చుకొని, ధవళేశ్వరాన్ని గవర్నమెంట్ వారికి ఇచ్చారు. అయితే, రాజాగారు ఉప్పాడ, అమీనాబాద్ గ్రామాలు తమ క్రింద ఉంచుకోలేదు. వాటిని తమ సోదరి అయిన శ్రీమతి భావాయమ్మా రావు గారికి పసుపు కుంకుమల క్రింద వ్రాసి ఇచ్చారు.

ధవళేశ్వరంను గవర్నమెంట్ వారికి ఇవ్వడం మంచిదైనది. రాజాగారు చాలా మంచిపని చేశారని, కలెక్టర్, ప్రభుత్వము వారు కూడా చాలా సంతోషించారు. తరువాత రాజాగారికి రాజా బిరుదు రావటానికి తోడ్పడింది. ఇలాంటిదే మరొక సందర్భమున కూడా శివరావుగారు తమ దూరదృష్టిని, రాజ్యతంత్రజ్ఞతను ప్రదర్శించి రాజాగారికి చిక్కులు రాకుండా కాపాడారు.

శ్రీ గంగాధర రామారావు గారి తండ్రి వేంకటసూర్యారావు గారు మైనారిటీలో 1828 సం. నుండి పిఠాపురం జమీందారీ కలెక్టర్ మేనేజ్మెంట్ క్రింద ఉండి, సూర్యారావు గారికి 1841 సం. లో యుక్త వయస్సు రాగా దీనిని ఆయనకు స్వాధీన పరచవలసి ఉండెను. అయితే, అప్పటి కలెక్టర్ స్వాధీనం చేయక, సూర్యారావు గారి మామగారు, బావగారు మేనేజ్ మెంట్ లో పాల్గొని ఋణం చేశారని, అందువల్ల గవర్నమెంట్ కు రూ. 98,691- 7-10 పేష్కషు క్రింద బాకీ తేలినారని, కిర్లంపూడి దావా పరిష్కారం కాలేదని, సాకు చెప్పి ఎస్టేట్ బిగబట్టారు. కలెక్టరు మేనేజ్మెంట్ కాలంలో కంపెనీ వారిదే బాధ్యత అయినందున, ఋణానికి వారి అజాగ్రత్తే కారణము. మొతర్పా కూడా చేర్చి పేష్కషు బాకీ తేల్చుట అక్రమమని, ఇంత స్వల్ప బాకీకి ఆరు లక్షల ఆదాయము గల ఎస్టేట్ ను బిగబట్టుట అన్యాయమని, సూర్యారావు గారు గవర్నమెంట్ కు విన్నపము పంపిరి. అంతట ఈ వ్యవహారాన్ని పరిశీలించిన స్పెషల్ కమీషనర్ సర్ హెన్రీ మాంట్గో మెరి (Sir Henry Montgomery) గారు మేనేజ్మెంట్ లో జరిగిన అజాగ్రత్త వల్లనే ఈ పరిస్థితి తటస్థించినదని, నిర్ణయించి గవర్నమెంట్ బాకీ తీర్మానమగు వరకు మునికొడవలి, కొవ్వూరు, భీమునిపల్లె, పెనుగొండ, పోడూరు ముఠాలను మరి రెండు ముఠాలు మొత్తం ఏడు ముఠాలు గవర్నమెంట్ ఉంచుకొని, మిగిలిన ఎస్టేట్ ను స్వాధీన పరచున్నట్లు తీర్మానించారు. ఆ ప్రకారం తక్కిన ఎస్టేట్ 1844 సం.లో స్వాధీనమైనది. కానీ వారు ది. 27- 10-1850వ తేదీన అకాల మరణం పొందారు ఆయన కుమారులైన నీలాద్రి రాయని గారు మైనర్ అయినందున ఎస్టేట్ ను మళ్లీ కలెక్టర్ మేనేజ్మెంట్ క్రిందికి తీసుకున్నారు. నీలాద్రి రాయనం గారు 1854 సం. లో అకాల మరణం పొందగా గంగాధరరామారావు

గారు వారసులైనారు. ఆయన మైనారిటీలో కూడా జమీందారీ కలెక్టర్ క్రిందనే ఉండి ది. 31- 1- 1862వ తేదీన స్వాధీనమైనది. అయితే, పైన చెప్పిన ఏడు మూతాలను స్వాధీన పరచలేదు. సాలు ఒకటికి 1,07,485 రూపాయల పేష్కరు చెల్లించే విలువగల ఏడు మూతాలను స్వాధీనం చేయక, కాలనిర్ణయము లేకుండా, గవర్నమెంట్ వారు తమక్రింద ఉంచుకొనడం న్యాయంకాదని, వాటిని తిరిగి రాజా గారికి ఇప్పించవలసినదని శివరావు గారు శిరస్తాదారు అయిన తరువాత గవర్నమెంట్ కు విన్నపములు పంపించారు. వాటిని ఇంకా తమ స్వాధీనంలో ఎందుకు ఉంచవలసి వచ్చినదీ చెప్పకుండా, గవర్నమెంట్ పాత పురాణములు తిరగవేయ సాగినారు. దానిని గురించి శివరావుగారు కలెక్టర్ గారి తోనూ, పై అధికారులతోనూ మాట్లాడారు. కానీ వారు సరియైన సమాధానము చెప్పక, ఆ మూతాలను బిగబట్టుకొని కూర్చున్నారు. ఇక లాభము లేదని, దీనిని గురించి గవర్నమెంట్ పైన దావా దాఖలుచేసి, ఆ మూతాలను రాబట్టుకుందామని రాజాగారికి అభిప్రాయం కలిగి శివరావు గారితో ఆలోచించారు. శివరావుగారు ధవళేశ్వరం విషయంలో సలహా చెప్పినట్లే, ఈ విషయంలో కూడా రాజాగారికి తమ అభిప్రాయాన్ని విశదముగా చెప్పారు.

ఈ మూతాలను గవర్నమెంట్ తమ క్రింద నుంచుకొనుటలో జరిగించిన రాజ్యతంత్రములో ఒక ధర్మసూక్ష్మము ఉన్నదని, వారి ప్రవర్తనవల్ల ఈ మూతాలకు వారు ఒక విధమైన ట్రస్టీలు లేక ధర్మకర్తలుగా నున్నట్లు ఎంచవచ్చునని, అందువల్ల, వాటిని రాబట్టు కొనుటకు లిమిటేషన్ అనగా కాలదోషం ఉండదని, దావా వేయుటకు మనకుగల హక్కులకు భంగము లేకుండా వారివల్ల మనకు కావలసిన

పనులన్నీ నెరవేర్చుకునే వరకు ఆ ముతాలను రాబట్టుకునే విషయమై ప్రభుత్వముతో ఉత్తర ప్రత్యుత్తరములు జరుపుతూ ఉందామని, మనకు దానివల్ల కావలసిన ముఖ్యమైన పనులన్నీ నెరవేర్చుకున్న తరువాత దావా వేయవచ్చునని, తొందరపడి దావా దాఖలుచేస్తే, దానివల్ల వైషమ్యములు పెరిగి, వారు మనకు సహాయము చేయకపోగా, అపకారం కూడా చేయవచ్చునని రాజాగారికి నచ్చజెప్పి, ఒప్పించారు.

రాజా బిరుదు

బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో మనదేశ ఆదాయంలో చాలా భాగం వారి సైన్యముల కోసం, దొరల జీతాల కోసం ఖర్చు చేసి, విద్యాభివృద్ధికి, వైద్య సహాయానికి, వ్యవసాయ అభివృద్ధి మొదలైన ప్రజోపయుక్త కార్యాలకు డబ్బు లేదనే వారు. సంస్థానాధిపతులు, జమీందారులు, ధనవంతులు అలాంటి కార్యాల కోసం ధనమిస్తే, స్వీకరించి వందనాలు అర్పించేవారు, లేదా ఏవో కొన్ని బిరుదులిచ్చేవారు.

శ్రీ గంగాధరరామారావు గారు కాకినాడ వైద్యాలయానికి నెలకు రూ. 40/-లు చొప్పున విరాళమిచ్చారు. దానికి భవనము నిర్మించడానికి వెయ్యి రూపాయలు ఇవ్వడాన్ని గురించి మద్రాసు ప్రభుత్వం వారు 1866 సం. ఫిబ్రవరి నెల, 2 వ గల ప్రొసీడింగ్స్ లో ప్రశంసించారు హిందూ స్కూలుకు రూ. 27,630 లు భూరి విరాళము ఇచ్చి, భవన నిర్మాణమును, ఉపకరణములకు ప్రత్యేకంగా రూ. 2647/- లు ఇచ్చుటను గురించి 1869సం నవంబర్, 30వ తేదీన ప్రశంసించి, తమ వందనములు సమర్పించారు. జమీందారు గారు 1876 సం. వరకు చేస్తూ ఉన్న ధర్మ కార్యాలనూ, సత్కార్యాలనూ ముఖ్యమైనవిగా గోదావరి జిల్లా

మాన్యువల్ రచించిన జిల్లాజడ్జి హెన్రీ మారీసు(Sir H. Morris 1867-1873) గారు ఆ గ్రంథములో పేర్కొన్నారు.

బ్రిటిష్ ప్రభుభక్తిని ప్రోత్సహించడానికి ఇటీవల బ్రిటిష్ ప్రభుత్వం వారు తమకు ఇష్టులుగా ఉన్నవారికి, సంస్థానాధిపతులకు, ఉద్యోగులకు కూడా ఏవో కొన్ని బిరుదులనిస్తూ, గౌరవించడం ప్రారంభించారు. ఈ రిక్తగౌరవాలు, బిరుదులు పొందడానికి మనవారు ఉబలాటపడేవారు. కంపెనీ వారి కాలం నుంచి ఉద్యోగం చేస్తూ ఉన్న ఎం. రంగాచార్యులు గారనే ప్రభుత్వ ఉద్యోగి కిన్నీ, 1852 సం.లో గోదావరి ఆనకట్ట నిర్మాణ కాలంలో ఇంజనీర్ కాటన్ దొర గారి క్రింద ఒక చిన్నఉద్యోగం చేసిన వేనం వీరన్న గారికినీ కూడా 1860సం. ఏప్రిల్ 27వ తేదీన మద్రాసు గవర్నర్ గారు దర్బారులో రావుబహద్దూర్ గౌరవ బిరుదులిచ్చి, కిలత్ అనే దుస్తులను, సన్నదులను ఇచ్చి సత్కరించారు. 1860 సం. మే 2వ తేదీన తిరువాన్కూర్ మహారాజా గారి రాజభక్తికి మెచ్చి బ్రిటిష్ ప్రభుత్వం వారు ఒక కరవాలమును, పటకాను బహుమతిగా నిచ్చారు. 1864సం. మార్చి 11వ తేదీన మన విజయనగరం రాజుగారైన మూడవ విజయరామ గజపతి గారికి వంశపారంపర్యముగా గాక వ్యక్తిగతముగా వహించడానికి మహారాజా అన్న బిరుదునిచ్చారు. 1866సం. నవంబరు 9వ తేదీన తిరువాన్కూరు రాజుగారికి మహారాజా అన్న బిరుదునిచ్చారు .ఇది వంశ పారంపర్యపు బిరుదు. 1867 ఫిబ్రవరి 1వ తేదీన తిరువాన్కూరు మహారాజా వారికి కే.సి. ఎస్. ఐ (K.C.S.I)[22] అనే బిరుదు ఇచ్చారు. ఆ తేదీననే ఆసంస్థాన దివాన్ సర్ టి. మాధవ రావు గారికినీ, ఆనరబుల్ టి. పైక్రాఫ్ట్ (Thomas Pycroft) గారికినీ, షరీఫ్ వుల్

[22] Knight Commander of the Order of Star of India

ఉమ్మరా గారికినీ K.C.S.I అనే సర్ అనే బిరుదు నిచ్చారు. ఇంతేగాక, W.R. Robinson, Dr. W. Mackenzie(William Mackenzie) , E.B.Powel అనే ఇంగ్లీషు దొరలకును, వేంకటగిరి జమీందారు గారికినీ గాజుల లక్ష్మీనరసు శెట్టి గారికినీ C.S.I[23] అనే బిరుదు నిచ్చారు.

1867సం. అక్టోబర్ ఒకటవ తేదీన స్వదేశీ సంస్థానాధిపతులకు, మహారాజులకు, చీఫ్(Chief) లనే వారికి గౌరవార్థముగా పేల్చవలసిన ఫిరంగుల సంఖ్య నిర్ణయిస్తూ ఒక పట్టికను ప్రకటించారు. 1871సం. ఏప్రిల్ 12వ తేదీన ఆనాటి ఆర్కాటు నవాబు గారికి ప్రిన్స్(Prince) లేక రాజకుమారుడు అనే బిరుదు నిచ్చారు. 1876సం.లో వంగ రాష్ట్రంలో కరువు వచ్చినప్పుడు గంగాధరరామారావు గారి జనక సోదరుడునూ, 1863సం. నుండి 1868 సం వరకు బొబ్బిలి జమీందారుగా నుండి చనిపోయిన వారై న సీతారామ కృష్ణ రాయడప్ప రంగారావు గారి భార్య లక్ష్మీచెల్లాయమ్మరావు గారు 1000 గరిసెల ధాన్యమును విరాళముగా నిచ్చినందు వల్ల ఆమెకు ప్రభుత్వము వారు రాణి(Queen) అనే బిరుదు ఇచ్చారు.

ఇలాగ బ్రిటిష్ ప్రభుత్వము వారు బిరుదులు ఇస్తూ ఉన్నందున తమ రాజాగారికి కూడా ఒక బిరుదు రావడానికి శివరావుగారు కృషి చేయడంలో ఆశ్చర్యం లేదు. ఆ కృషి ఫలించి, 1877సం. నవంబర్ 1వ తేదీన జరిగిన ఢిల్లీ దర్బారు సమయంలో ఇతరులకు ఇచ్చిన బిరుదులతో పాటు గంగాధరరామారావు గారికి కూడా రాజా అనే బిరుదు వచ్చింది. 1877సం. జనవరి ఒకటవ తేదీన ఢిల్లీ దర్బారులో

---

[23] Commander of the Order of the Star of India, a prestigious British order of chivalry.

విక్టోరియారాణి ఇండియా మహారాజుగా ప్రకటింపబడినది. 1858 సం. సెప్టెంబర్ నెలలో ఇండియాలో కంపెనీ వారి ప్రభుత్వం రద్దు చేయబడి, పార్లమెంటు అధికారమున విక్టోరియారాణి, మంత్రుల క్రింద బ్రిటిష్ ప్రభుత్వం స్థాపించబడినదని ఆ సం. నవంబరు 1వ తేదీన విక్టోరియా రాణి ప్రకటన చేసినది.

నిజానికి అప్పటినుండి హిందూ దేశానికి మహారాణి అయినప్పటికీ, పార్లమెంటు వారు దాని గురించి శాసనము చేయలేదు. 1876 సం. మార్చి నెలలో విక్టోరియారాణి బిరుదులలో "కెయిజర్ ఈ హింద్" అనగా హిందూ దేశ మహారాణి అనే బిరుదును చేర్చునట్లు పార్లమెంటు వారు -Royal Titles Act - రాజ బిరుదుల శాసనము చేశారు. హిందూ దేశానికి మహారాణి అయినట్లు గవర్నర్ జనరల్ అయిన లిట్టన్ (R.B.LYTTON) ప్రభువు ఢిల్లీలో దర్బారు చేసి, ప్రకటించాలని, జిల్లా ముఖ్య పట్టణాలలో కలెక్టర్లు దర్బారు చేసి, ప్రకటన చేయాలని, రాజధాని నగరాలలో గవర్నర్ దర్బారు చేసి, ప్రకటించాలని, ఆ సమయంలో ఖైదీలను విడుదల చేయడము, దేశంలో బ్రిటిష్ ప్రభుభక్తిని ప్రకటించి, ప్రజోపయుక్త కార్యాలు చేసిన కొందరు మహారాజులకు, జమీందారులకు, పెద్దమనుషులకు కొన్ని బిరుదులు ఇవ్వాలని నిశ్చయించారు. ఈ ఆలోచనలు 1876 సం.లోనే జరిగినందువల్ల, దానిని గురించి కలెక్టర్లను సిఫారసు చేయనున్నారు. ఆ సందర్భంలో పిఠాపురం జమీందారు గారు గంగాధరరామారావు గారికి రాజా అనే బిరుదు ఇవ్వడం బాగుంటుందని కలెక్టర్ మద్రాసు ప్రభుత్వానికి సిఫారసు చేయగా, వారంగీకరించి కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

ఆ ప్రకారం 1877సం. జనవరి 1వ తేదీన రాజమహేంద్రవరంలో జరిగిన కలెక్టర్ గారి దర్బారులో గంగాధరరామారావు గారికి రాజా అనే బిరుదు నిచ్చినట్లు విక్టోరియా రాణి పేరుతో సన్నదులు ఇచ్చారు. ఆ సభకు రాజాగారు, శివరావుగారు హాజరైనారు.

కలెక్టర్లతోనూ, పై అధికారులతోనూ జాగ్రత్తగా వ్యవహరించి, వారికి సదభిప్రాయమును కలిగించుటలో శివరావుగారు ప్రయోగించిన రాజనీతి సఫలమైనది.

సంస్థాన ప్రజలు, సామాన్యులు జమీందారు గారిని రాజాగారనే మొదటి నుండి వ్యవహరిస్తూ ఉన్నప్పటికినీ, ఆ గౌరవవాచకాన్ని ప్రభుత్వం వారు వారికి, ఉద్యోగులు అధికార పత్రాలలో వాడేవారు కారు. ఇప్పుడు దానికి అధికారముద్ర పడడముతో అధికార పత్రాలలో కూడా వాడడానికి వీలైనది.

విద్యాభివృద్ధికి కృషి

ఇంగ్లీషు వర్తక కంపెనీ ప్రభుత్వమువారు చాలాకాలం వరకు మన దేశంలో విద్యాభివృద్ధి చేయడానికి ప్రయత్నించలేదు. ఐరోపా క్రైస్తవ మిషనరీలు వచ్చి, విద్యాబోధన చేసే నెపంతో అక్కడక్కడ కొన్ని పాఠశాలలు స్థాపించి, మన మతధర్మాలను, దేవుళ్లను విమర్శిస్తూ, దూషిస్తూ పిల్లల మనసులు విరిచి, బైబిల్ ను బోధిస్తూ వీలైనప్పుడు కొందరిని తమ మతములో కలుపుకునేవారు.

వారికి ఇంగ్లీషు కంపెనీ దొరలు సహాయము చేసేవారు. అంతట కలకత్తాలో మనదేశ నాయకులు కొందరు, కళ్ళు తెరచి, కొన్ని స్వతంత్ర

పాఠశాలలు స్థాపించడం ప్రారంభించారు. చెన్నపట్టణములో కూడా ఇలాగే జరిగినది. అప్పటికింకా వంగదేశంలోని బ్రహ్మసమాజ భావాలు, సంఘసంస్కార భావాలు చెన్నపురి రాజధాని లోని తెలుగు జిల్లాలలో ప్రవేశించలేదు. దేశంలో విద్యాభివృద్ధి చేయదలచిన జమీందారులు, పరోపకారీపరాయణులు, సంపన్నులు మొదలైన వారికి సనాతన ధర్మము మీద అభిమానము. అందువల్ల, ఆ కాలంలో దేశంలోని కొన్ని ముఖ్యపట్టణాలలో వేదశాస్త్ర పాఠశాలలు, సంస్కృతపాఠశాలలు, తెలుగు-ఇంగ్లీషు బోధించే పాఠశాలలు స్థాపించడం ప్రారంభించారు. కొంతకాలానికి కంపెనీ ప్రభుత్వము వారు కొన్ని ఇంగ్లీషుపాఠశాలలు స్థాపించారు. 1840 సం. నాటికి కూడా మన దేశంలో ఇంగ్లీష్ విద్యాభివృద్ధి బాగాలేదు. ఆ సందర్భంలో కంపెనీ ప్రభుత్వము వారు చెన్నపట్టణములో ఒక ఉన్నత పాఠశాలను స్థాపించారు. 1853 సం.లో కడలూరులోనూ, 1854 సం.లో రాజమహేంద్రవరములోనూ రెండు ఉన్నత పాఠశాలలు స్థాపించారు. 1855 సం.లో విద్యాశాఖను ఏర్పరచి డైరెక్టర్లను, స్కూళ్ల ఇన్స్పెక్టర్లను నియమించారు. అప్పటికి దేశం మొత్తం మీద చాలా కొద్ది పాఠశాలలున్నవి.

ది.1-8-1857వ సెప్టెంబర్ లో మద్రాసు విశ్వవిద్యాలయం స్థాపించడానికి ఒక శాసనం చేశారు. **మొదటి మెట్రిక్యులేషన్ పరీక్ష ఆ సం. సెప్టెంబర్ లోనే జరిగినది.** 1863- 64 సం.లో పై రెండు పరీక్షల[24] మధ్య ఎఫ్.ఏ. అను పరీక్షను పెట్టారు. ఆ కాలంలో పరీక్షలకు బహు కొద్దిమంది వెళ్లేవారు. అప్పటివరకు చిన్న పట్టణాలలోనూ, పెద్ద

---

[24] ఈ రెండు పరీక్షలు ఏమిటో సమాచారం కనబడలేదు. బహుశః మెట్రిక్యులేషన్ కు బి.ఎ కు మధ్యలో

గ్రామాలలోనూ పిల్లలు చదువుకునే పాఠశాలలు లేవు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ అయిన ప్రెండరుగాస్టు (T. Prendergast) గారు ప్రోత్సాహంతో కాకినాడలోని పురజనులు 1852 సం.లో ఒక మిడిల్ స్కూలు స్థాపించుకున్నారు. ప్రెండరుగాస్టు గారు 1854సం. ఏప్రియలులో గంజాంకు బదిలీ కాగా, కొత్త కలెక్టర్ ఆర్థరు పర్వీసు(Arthur Purvis) గారు ఆ పాఠశాలయందు చాలా శ్రద్ధ వహించినందున, అది ఆంగ్లో వర్నాక్యులర్(vernacular) స్కూలు అను పేరుతో దినదినాభివృద్ధిని చెందినది. శ్రీ గంగాధరరామారావు గారు తమ మైనారిటీలో 1854 సం. నుండి ఆ పాఠశాలలోనే చదువుకున్నారు. ఆ పాఠశాలను కొంత కాలానికి హిందూస్కూలు అను పేరుతో పురజనుల నిర్వాహక సంఘము వారు నడుపుతూ ఉండేవారు. శ్రీ గంగాధరరామారావు గారు పట్టాభిషిక్తులైన 1862 సం. నాటికి ఆ పాఠశాల ఆర్థికస్థితి బాగుగా లేదు. ఈ సంగతి రాజాగారికి తెలిసి, 1862 సం. నుండి దాని పోషణ కోసం ప్రతీనెలా నూరు రూపాయలు విరాళంగా ఇచ్చే ఏర్పాటు చేశారు. గంగాధరరామారావు గారి జనక సోదరుడు సీతారామకృష్ణ రాయడప్ప రంగారావు గారు 1863 సం.లో బొబ్బిలి జమీందారై, అక్కడ 1864 సం.లో ఆంగ్లో వర్నాక్యులర్ స్కూలును స్థాపించారు.

ఇలాగ ఐదు సం.లు విరాళమిచ్చిన తరువాత, ఈ పాఠశాలకు శాశ్వతమైన నిధిని ఏర్పాటు చేయదలచి దానికి 1867సం||లో ఒక్కసారిగా రూ. 27,360/- లు విరాళంగా ఇచ్చి, దానిపై వచ్చు వడ్డీతో ఆ పాఠశాలను పోషించవలసినదని కార్యనిర్వాహకులకు చెప్పారు. వారి ఔదార్యము అంతటితో ఆగలేదు. ఆ పాఠశాలకు ఒక భవనము

నిర్మించడానికి, దానికి కావలసిన బెంచీలు, బల్లలు, కుర్చీలు వగైరాలకు ప్రత్యేకముగా రూ. 2647/- లు విరాళమునిచ్చారు. దీనితో హిందూపాఠశాల ఆర్థిక దుస్థితి నివారణమైనది.

ఆ పాఠశాల వార్షిక ఉత్సవము 1868సం. ఫిబ్రవరి 11వ తేదీన మహా వైభవముగా జరిగినది. అప్పుడు జిల్లజడ్జి హెన్రీ మారీసు (Sir Henry Moris) దొరగారు, స్కూళ్ల ఇన్స్పెక్టర్ గ్రిగ్ (Grig)దొరగారు, ఇంకా కాకినాడలోని పురప్రముఖులు, కొందరు దొరలు హాజరైనారు. పిఠాపురం రాజాగారు కూడా ఆ సభలో ఉన్నారు. జిల్లాజడ్జి గారు అగ్రాసనాధిపత్యం వహించారు. పాఠశాలలోని విద్యార్థులు తెలివితేటలను ప్రదర్శించడానికి ఒక బహిరంగపరీక్ష జరిగింది . అందులో కొందరు అగ్రగణ్యులు అయినారు. పాఠశాల స్థితిగతులను గురించి, పాఠశాల కార్యనిర్వాహక సభ్యులైన జగన్నాథం పంతులుగారు తమ నివేదిక చదివారు. పాఠశాల అభివృద్ధి గురించి గ్రిగ్గు దొరగారు ఒక పెద్ద ఉపన్యాసము ఇచ్చారు. ఇందులో చదువుకునే విద్యార్థులు కేవలము తెలుగు ఇంగ్లీషు వ్రాత కోతలు, లెక్కలు నేర్చుకోవడంతో తృప్తి చెందక మెట్రిక్యులేషన్ పరీక్షకు గాని, మరియొక పరీక్షకు గాని హాజరై, కృతార్థులు అయితేనే వారి తెలివితేటలు సార్థకత చెందునని విద్యార్థులకు హెచ్చరిక చేశారు. అధ్యక్షులు కూడా విద్యార్థులకు ఉచితమైన హితబోధ చేశారు.

బహుమతులు ఇచ్చుటకు పిఠాపురం రాజాగారు కొని ఇచ్చిన చక్కని ఇంగ్లీషు పుస్తకాలను, అధ్యక్షులు బహిరంగ పోటీలో అగ్రగణ్యులైన విద్యార్థులకు బహుమతులుగా నివ్వగా, వారు చాలా సంతోషించారు.

ఈ వార్షికోత్సవమును గురించి మద్రాసు జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అనే పత్రిక 1868సం. ఫిబ్రవరి నెల సంచికలో ప్రకటింపబడినది.

మా తండ్రి వెంకటరత్నం పంతులుగారు అకాలంలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరడానికి గవర్నమెంట్ వారు ఏర్పరిచిన అన్ కవనేటెడ్ సివిల్ సర్వీస్("Uncovenated Civil Service Examination") [25] పరీక్షలో ఇంగ్లీష్ బ్రాంచిలో కృతార్థులై, మెట్రిక్యులేషన్ పరీక్షకు పోవాలనే కోరికతో 1869సం. జనవరిలో హిందూ స్కూల్లో చేరి, ఆ సంవత్సరాంతమున జరిగిన పరీక్షకు వెళ్లారు. గాని కృతార్థులు కాలేదు. అంతట కలెక్టర్ కచేరీలో గుమాస్తాగా ప్రవేశించి, పై ఉద్యోగములకు అర్హత కలిగించు స్పెషల్ టెస్టులైన క్రిమినల్ హయ్యర్, రెవెన్యూ హయ్యర్, అకౌంట్స్, ట్రాన్సు లేషన్, ప్రెసిస్ [26] రైటింగ్ (precis writing) పరీక్షలలో కృతార్థులై క్రమంగా డిప్యూటీ తహశీల్దార్ అయ్యారు. మా మేనత్త గారి (శివరావుగారి చెల్లెలు) కుమారుడైన తల్లాప్రగడ సుబ్బారావు గారు తన 14వ ఏట ఆ హిందూ పాఠశాలలో 1870సం. జూలైలో మూడవ ఫారం వంటి మిడిల్ స్కూల్ తరగతిలో ప్రవేశించారు. అప్పటి ప్రధానోపాధ్యాయులైన కెన్నీ (Kenny) దొరగారు ఈ బాలుని అసాధారణములైన తెలివితేటలను చూచి, వెంటనే మెట్రిక్యులేషన్ తరగతిలో చేర్చుకున్నారు. అంతట సుబ్బారావు గారు 1871 సం.న మెట్రిక్యులేషన్లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులైనారు[27]. అప్పుడు శివరావు

---

[25] Uncovenated= not bounded by any bond or obligation ఒడంబడిక లేనిది

[26] Precis writing అంటే పెద్ద వ్యాసమును కుదించి సారాంశము వ్రాయుట

[27] ఈ సంపుటిలో అనుబంధముగా జతచేయబడిన 1871సం. మెట్రిక్యులేషన్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారి జాబితా మద్రాసు విశ్వవిద్యాలయం గెజెట్ లో తల్లాప్రగడ సుబ్బారావుగారి పేరు 18వ (Rank)స్థానం లో వున్నది.

గారు ఆయనను చెన్నపట్టణము లోని ప్రెసిడెన్సీ కాలేజీలో చేర్పించగా, ఎఫ్. ఎ., బి. ఎ లలో కూడా ఉత్తమశ్రేణిలో కృతార్థులై, చెన్నపట్టణం హైకోర్టులో వకీలుగా ప్రవేశించారు.

స్త్రీల విద్యాభివృద్ధికి కృషి.

పూర్వకాలంలో మన దేశంలోని స్త్రీలు విద్య నేర్చి, పురుషులను కూడా వాగ్వాదాలలో జయించినట్లు మన ఉపనిషత్తులు, పురాణములు, ఇతిహాసములు తెలుపుచున్నవి. కానీ రానురానూ స్త్రీవిద్య క్షీణించి, మహమ్మదీయ పరిపాలనలో అడుగంటి, ఇంగ్లీషు ప్రభుత్వ కాలము నాటికి అదృశ్యమై పోయినది.

ఇలాంటి స్థితిలో క్రైస్తవ మిషనరీలు మన దేశంలో తమ మత ప్రచారమును విద్యా బోధన ద్వారా చేయదలచి, కొన్ని పాఠశాలలు స్థాపించి, బాలబాలికలకు బైబిలు బోధ చేయడం ప్రారంభించారు. వారి కాన్వెంటులలో సిస్టర్స్ అనే మతప్రచారక స్త్రీలు బాలబాలికలకు చదువు చెప్పేవారు. మన దేశంలోని రాజధాని నగరాలలోనే గాక మచిలీపట్నం, విశాఖపట్నం మొదలైన పట్టణాలలో కూడా అలాంటి పాఠశాలలు వెలిశాయి. విశాఖపట్నంలో 1865 సం. నాటికి అలాంటి పాఠశాల ఒకటి అభివృద్ధిలో ఉన్నది. అందులో కొందరు హిందూ బాలికలు కూడా చేరినారు. బాలకులకే గాక బాలికలకు కూడా చదువు చెప్పే పాఠశాలలు ఉండాలని దేశీయులలో కొంతమందికి తోచినా, అది చాలాకాలం వరకూ కార్యరూపం దాల్చలేదు. ఈ స్థితిలో విశాఖపట్నంలో దేశీయుల పట్ల సానుభూతిగల కలెక్టర్ గార్మికేల్ (D.F.Gaarmichael) దొర గారి ప్రోత్సాహంతో ఆ జిల్లాలో ఆరు

ఎస్టేట్లను కొని, జమీందారైన గోడే సూర్యప్రకాశరావు గారి సతీమణి , విద్యావంతురాలును, ధర్మాత్ముమ్రాలును అయిన శ్రీమతి జానకీయమ్మ గారు 1867సం. ఏప్రిల్ నెలలో బాలబాలికలకు తెలుగు ఇంగ్లీషు నేర్పు పాఠశాలను స్థాపించి, పోషించ నారంభించారు. ఇంతలో ఆమె కుమార్తె అయిన అనకాపల్లి ప్రొప్రైటర్[28] జి. ఎల్. నరసింహారావు గారి భార్య శ్రీమతి రత్తాయ్యమ్మగారు కూడా ఆ పాఠశాల యందు శ్రద్ధ వహించారు. ఆమె కోరిక ప్రకారం విశాఖపట్నంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంటులోని రోమన్ కేథలిక్ సిస్టర్స్ ను ఆహ్వానించి , వారిచేత తమ పాఠశాలలోని బాలికలకు ఇంగ్లీషు, తెలుగు, కుట్టుపని, సంగీతం, చిత్రలేఖనము నేర్పించడం ప్రారంభించారు. జానకీయమ్మ గారు చనిపోయేటప్పటికి ఆ పాఠశాలలో150 మంది బాలికలు చదువుకుంటున్నారు. వీరు చేసిన అల్లికపని నమూనాలను అప్పటి గవర్నరు నేపియరు(Francis Napier) ప్రభువుకు సమర్పించారు. జానకీయమ్మ గారు కుమార్తె రత్తాయమ్మ గారి తో పాటు మరియొక ధర్మాత్ముమ్రాలు కూడా ఈ పాఠశాల పట్ల శ్రద్ధ వహించారు. విశాఖపట్నంలోని కొందరు దేశీయులు, దొరలు కూడా తోడ్పడ్డారు. ఈ పాఠశాలకు ఒక భవనము నిర్మించి, అందులో బాలికలకే గాక యుక్త వయస్సు వచ్చిన స్త్రీలకు కూడా విద్యాబోధన చేయుట యుక్తమని, ఆ పాఠశాల నిర్వాహకులును, పోషకులును నిశ్చయించారు. ఆ ప్రకారము ఒక భవనము నిర్మించి 1868సం. సెప్టెంబరు 7వ తేదీన దానికి ప్రారంభోత్సవము చేశారు. ఆ సభా విశేషాలు చెన్నపట్టణంలోని- ఏథేనీయం -పత్రిక (Athenium)లో

---

[28] బ్రిటిష్ కంపెనీ పరిపాలనాటి కాలంలో గ్రామాలను కొని విస్తారంగా భూములును(ఎస్టేటులు) కలిగిన పెద్ద భూస్వామి

ప్రకటింపబడగా మద్రాసు జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అనే పత్రిక యొక్క 1869సం. జూలై నెల సంచికలో ఆ వృత్తాంతము పునర్ముద్రితమైనది. అప్పుడు జరిగిన సభకు - మించిన్(J.I.Minchin) - దొరగారు అధ్యక్షత వహించారు. శ్రీ జి. ఎల్. నరసింహారావు గారు అనేక భాషలలో మహా పండితుడును, శ్రీ ఆనంద గజపతి మహారాజునకు గురువుగారునైన శ్రీ లింగం లక్ష్మాజీ[29] పంతులుగారును ఆ సభలో ఉపన్యసించారు. దీనివలన, ఆనాటి విద్యావంతుల భావములు వెల్లడి అగుచున్నవి.

పిఠాపురం రాజాగారి తమ్ముడు వెంకట సూర్యనారాయణ మహీపతి రాయణం గారిని బొబ్బిలి రాజాగారు దత్తు చేసుకున్నందువల్ల, విశాఖపట్నం మండలంలోని రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, అక్కడ విద్యాభివృద్ధికి జరిగిన కృషి మన రాజాగారికి బాగా తెలుసును.

విశాఖపట్నంలో స్త్రీల విద్యాభివృద్ధికి ఒక జమీందారు గారి భార్య బాలికా పాఠశాల నిర్మించగా, మన గోదావరి జిల్లాలో లేకపోవుట ఏమిటని, రాజాగారికి తోచినది. అంతట ఆయన తక్షణమే 1868 సం.లో కాకినాడలోనూ ఒక బాలికాపాఠశాలను స్థాపించి, దానికి కావలసిన పుస్తకములు, బల్లలు, బెంచీలు, కుర్చీలు మొదలైన ఉపకరణములను కొని ఇచ్చి, ఆ పాఠశాలలో చదువుకునే బాలికలలో తెలివితేటలు

---

[29] పండిత లింగం లక్ష్మాజి పంతులు ప్రముఖ పండితులు గాయకులు. వీరు చేసిన ప్రసంగం 1869సం. మే 25 తేదీ న పచ్చయప్ప హాల్ లో ఇచ్చిన ప్రసంగం

https://archive.org/details/dli.ministry.00373/page/n3/mode/2up

ప్రదర్శించిన వారికి బహుమతులు నిమిత్తము రూ. 300/- ఇచ్చి, దాని పోషణకు ప్రతీ నెలా నూరు రూపాయలు విరాళము ఏర్పాటు చేశారు.

ఈ పాఠశాలకు ఒక భవనం కట్టించి ఇవ్వదలచి , ఎక్కడ నిర్మించితే, బాగుంటుందని ఆలోచించారు. అసలు కాకినాడ పిఠాపురం జమీందారీలో చేరిన పట్టణమైనందువల్ల, కాకినాడ పరిసరములలో ఎక్కడ చూసినా రాజాగారి స్థలాలు, పొలాలు ఉన్నవి. 1868 సం.లోనే వారు విశాలమైన వీధులతో సూర్యారావుపేటను నిర్మించి, చాలామందికి ఉచితంగా నివేశన స్థలముల నిచ్చారు. కొన్ని సంస్థలకు కూడా ఇచ్చారు. అందులో కాకినాడలోని శ్రీ భీమేశ్వర స్వామి వారికి ఇచ్చిన నివేశన స్థలము ఆ పేటలో మధ్యగా ఉన్నది. చాలా విశాలమైనది. అందువల్ల ఈ స్థలములో పాఠశాల నిర్మిస్తే చాలా బాగా ఉంటుందని కొందరు పురజనులు మనవి చేశారు. శ్రీ భీమేశ్వర స్వామివారి ధర్మకర్త, తమ దివానైన శివరావు గారే కనుక స్వామివారికిచ్చిన ఈ స్థలమునకు బదులుగా, ఆదాయం రాగల జిరాయితీ భూమిని ఇస్తామనీ, ఆ స్థలమును బాలికాపాఠశాల భవనానికి వదిలిపెట్ట వలసినదని రాజాగారు కోరగా వారంగీకరించారు. అంతట ఆ స్థలములో ది.26- 4-1873 వ తేదీన భవనమునకు శంఖుస్థాపన చేసి, తొమ్మిది వేల రూపాయలు వ్యయంతో ఒక చక్కని భవనమును కట్టించి, పాఠశాలను అందులో పెట్టించారు.

ఆ పాఠశాల పోషణకు తాము నెల ఒక్కటికి నూరు రూపాయలు చొప్పున ఇస్తూ ఉన్న సాలువిరాళము మొత్తము రూ. 1200/- లు తోటపల్లి ఎస్టేట్లో చేరిన శంఖవరం గ్రామ ఆదాయము నుండి చెల్లించే, ఏర్పాటు చేసి, తమ ధర్మమును చిరస్థాయిగా నుండునట్లు చేశారు.

రాజాగారు విద్యాభివృద్ధికి, వైద్య సహాయానికి, ఇతర ప్రజోపయుక్త కార్యాలకు చేసిన వ్యయము, ఆయన దానధర్మాలు, సత్కార్యాలు వివరించ వలెనంటే ఒక పెద్ద గ్రంథం అవుతుంది.

రాజాగారి దాన ధర్మాలు

రాజాగారు చేసిన సత్కార్యములలో విద్య కొరకు చేసినది ముందుగా పేర్కొన తగినది. తమ జమీందారీలోని కాపవరములోనూ, పవర గ్రామములోనూ వీధిబడులను స్థాపించి, వాటి పోషణకు రూ. 75/- లు వార్షికము ఏర్పాటు చేశారు.

ఉండూరు గ్రామములో తెలుగు బడిని స్థాపించి రూ. 72/- లు వార్షికము ఇచ్చారు.

పిఠాపురంలో మిడిల్ స్కూలు స్థాపించి, దాని పోషణకు నెలకు రూ. 200/- చొప్పున రూ. 2400/- లు వార్షికము నిచ్చారు.


కాకినాడ సూర్యారావుపేటలోని వేద పాఠశాలకు	వార్షికము -	రూ. 300/-
రాజమహేంద్రవరం యజుర్వేద పాఠశాల	వార్షికం -	రూ. 300/-
తిరువళ్లకేణి సంస్కృత పాఠశాలకు	వార్షికం	- రూ. 120/-
ధవళేశ్వరం పాఠశాల పోషణకు	వార్షికం	- రూ. 60/-
మద్రాసు హిందూ ప్రొప్రైటరీ స్కూలుకు	విరాళము	- రూ.1000/-
మద్రాసు క్రైస్తవ మిషన్ పాఠశాలకు	వార్షికం -	రూ. 60/-
రాజమండ్రి టౌన్ హై స్కూల్	వార్షికం -	రూ. 60/-
కొత్తపల్లి గ్రామములో తెలుగు బడికి		రూ. 60/-
కాకినాడలో మధ్వ శాస్త్ర పాఠశాలకు నెలకు 18/- చొప్పున		రూ. 80/-
పిఠాపురం వేద పాఠశాలకు సాలుకు		- రూ. 600/-

జగన్నాధపురం మిషన్ పాఠశాలకు నెల ఒకటికి -   రూ. 40/-
రాజమహేంద్రవరం కాలేజీలో బి.ఏ. జూనియర్, సీనియర్ విద్యార్థివేతనములు నెల ఒకటికి రు. 40/- చొప్పున సాలుకు - రూ. 480/-
ఎఫ్.ఏ. మెట్రిక్యులేషన్ లకు రూ. 38/- చొప్పున సాలుకు- రూ.456/-
తిరుపతి, తిరువాన్కూరులలో జరిగే మాధ్వ సిద్ధాంత సభలకు సాలుకు రూ. 50/- దాని భవనమునకు - రూ. 5000/-

వైద్య సహాయము

పిఠాపురంలో వైద్యశాల నిమిత్తము ఒక గొప్ప భవనము ఉచితముగా నిచ్చి, ఉపకారము గావించారు. .
రాజమహేంద్రవరము వైద్యాలయమునకు వార్షికము - రూ.120/-
కాకినాడ డిస్పెన్సరీకి నెలకు రూ. 40/- చొప్పున సాలుకు - రూ. 480/- ఇవ్వడమే గాక
దాని భవనము నిమిత్తము. - రూ. 1000/- ఇచ్చారు.

దేవాలయములు



సర్పవరంలోని శ్రీ భావన్నారాయణ స్వామి వారి దేవాలయమునకు మరమ్మత్తులు, గోపురము నిర్మాణమునకు రూ. 40,000/-

సర్పవరం భావన్నారాయణ స్వామి గుడి

పిఠాపురం కుంతీ మాధవస్వామి దేవాలయమునకు, పుష్కరిణి మరమ్మత్తులకు - రూ. 3,500/-

ఉపమాక వెంకటేశ్వర స్వామి వారి దేవాలయమునకు - రూ 2,000/-. ఇక్కడ విగ్రహము లేదు శంఖు - చక్రములున్నవి.

పల్లం సాగునీటి వనరులు, కాలువలు.

ద్రాక్షారామం గ్రామములో సప్త గోదావరి కాలువ త్రవ్వడానికి, గోదావరి ఆనకట్ట క్రింద సాగుబడి అభివృద్ధి. - రూ. 3000/-

పవర గ్రామంలోఒక కాలువ త్రవ్వడానికి - రూ.1000/-

చెఱువులు

ఏలేరు క్రింద పల్లం సాగు నీటి వనరులు , నిర్మాణము-ఇరిగేషన్ వర్క్స్

మల్లవరం గ్రామంలో తటాకం త్రవ్వించడానికి - రూ. 10,000/-

అక్కడ దొరికిన తామ్రశాసనములో వేంగీ దేశ చరిత్ర లున్నందున, దానిని శనివారప్పేట రాజాగారు సంస్కృతంలోనికి అనువదింపగా, రాజాగారు ఇంగ్లీషులోనికి అనువదించి, ప్రకటించారు



సర్పవరం ముక్తి సరస్సు

సర్పవరంలో ముక్తి సరస్సు త్రవ్వించారు.

కాకినాడ సూర్యారావుపేట చెరువుకు ప్రతిష్ట చేసి, త్రవ్వకము చేసినందుకు రూ. 15000/-

మున్సిపాలిటీ వారు ఈ చెరువులో నుంచి పంపులు

పెట్టి, పురజనులకు మంచినీళ్ళ సప్లై చేయుచున్నారు. దానిని కొళాయి చెరువు అంటారు.

సత్రములు

పిఠాపురం పాదగయ క్షేత్ర సత్రము మరమ్మత్తులు,
కాకినాడ సూర్యారావుపేటలో సత్రము స్థాపన,
రాజమహేంద్రవరం సత్రం స్థాపన చేసి, వాటి నిర్వహణకు తగు ఏర్పాట్లు చేశారు.

గృహములు.

రామారావుపేటలో పోలీసుల సిబ్బందికి ఇండ్లు నిర్మించి ఇచ్చారు.
సూర్యారావుపేటలో చాలామందికి నివేశన స్థలములు ఇచ్చారు.
చాలాచోట్ల మంచినీటి బావులు త్రవ్వించారు.
చలి పందిళ్ళు కొన్ని మార్గాలలో పెట్టించారు. గోసాయిలకు, బైరాగులకు భోజనాలు, సదావృత్తులు పిఠాపురం సత్రములో ఏర్పాటు చేశారు.

భూదానములు

అనేక వేద శాస్త్ర పండితులకు భూములు ఇచ్చారు. ఋలుసు పాపయ్యశాస్త్రి గారికి 18 పుట్లు, అల్లంరాజు సుబ్రహ్మణ్య కవికి భూవసతి కల్పించారు. భాగవతుల హరిశాస్త్రులు గారికి ద్రాక్షారామములో జిరాయితీ భూములకు కొద్దిపాటి శిస్తు నేర్పరచి , మెటెడులనే[30] పేరుతో సామాన్య గృహస్తులకు ఇచ్చారు.

---

30 మెటడులు అంటే సంస్థానం వారు కొద్దిపాటి శిస్తుతో గృహస్థులకు ఇచ్చిన భూములు

వార్షికములు.

పండితులకు, కవులకు, గాయకులకు వార్షికములు ఏర్పాటు చేసి పోషించారు.

గ్రంథ ప్రకటన

దిట్టకవి నారాయణకవి విరచితమైన - రంగరాయ విజయము - (బొబ్బిలి యుద్ధం) 1871 సం.లో కాకినాడ ముద్రాక్షర శాలలో ముద్రించారు.

కృతి స్వీకరణ.

ఆస్థాన కవులైన అల్లంరాజు సుబ్రహ్మణ్య కవి రచించిన సుభద్రా పరిణయమును, దేవులపల్లి సోదర[31] కవులు రచించిన సంస్కృతాంధ్ర రావువంశ ముక్తావళి గ్రంథములను గంగాధర రామారావు గారు కృతి స్వీకారము చేశారు. కవులకు భూరి[32] సన్మానములు చేశారు.

---

[31] దేవులపల్లి సోదర కవులు = దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రి, దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి. శ్రీమద్రావు వంశ ముక్తావళిని సంస్కృతములో సుబ్బరాయ శాస్త్రి గారు రచించగా వారి తమ్ముడు వేంకటకృష్ణ శాస్త్రి గారు ఆంధ్రీకరించారు. వేంకటకృష్ణ శాస్త్రిగారు పిఠాపురం రాజా గంగాధరరామారావుగారికి గురుపై తారక బ్రహ్మ మంత్రోపదేశం చేశారు

[32] భూరి అంటే అధికముగ , as per Brown Dictionary it plenty, many, భూరి సన్మానము, భూరి విరాళము

రాజాగారిని గూర్చిన కొన్ని కథలు.

గోదావరి జిల్లా కోనసీమలోని అయినవిల్లి గ్రామ కాపురస్తులు, జగత్ ప్రసిద్ధ వేదశాస్త్ర శ్రౌతపండితులు అయిన బులుసు అచ్చయ్య శాస్త్రి గారి ప్రధమ పుత్రుడు వెంకయ్యప్ప సోమయాజి గారు కూడా తండ్రి అంతటి గొప్పవాడే. రెండవ కుమారుడైన పాపయ్య శాస్త్రి గారు వేదార్థము చెప్పడంలో అఖండులు. వీరు పిఠాపురం రాజా గంగాధర రామారావు గారి ఆస్థానంలో పండితులుగా నుండి 22 పుట్ల భూమిని బహుమతిగా సంపాదించినారు. వెంకప్ప సోమయాజులు గారికి 70వ పడిలో భార్యావియోగం అయినది. అపత్నీకులు యజ్ఞ యాగాలు చేయడానికి వీలు లేదు. కనుక 80 వ ఏట మరల వివాహము చేసుకున్నారు. ఆ సందర్భంలో (ఆయన) కుమారుడు దేశంలోని జమీందారులను దర్శించి కొంత ధన సహాయం పొందారు. వివాహం అయిన తరువాత , మళ్లీ పిఠాపురం రాజాగారిని దర్శించడానికి వెళ్లినప్పుడు రాజాగారు సోమయాజులుగారూ అవ్వగారు చెప్పినట్లు వింటున్నారా అని ఎకసెక్కె[33] మాట్లాడినట్లునూ, రాజాగారికి ఏడుగురు భార్యలు ఉన్న సంగతి ఎరిగిన " రాజా ఒక్క పిల్ల చెప్పినట్లు వినదూ?" అని ఏడుసార్లు రెట్టించి వక్క (పిల్ల వక్క- పిల్ల)జవాబు చెప్పారనిన్నీ, చెప్పుకుంటారని బ్ర. శ్రీ. చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు వ్రాశారు.

శ్రీ వేంకటశాస్త్రి గారు రాజాగారిని గురించీ, - వారి దివాన్జీ శివరావుగారు గురించినీ చాలా కథలు చెప్పేవారు. ఆయన చెప్పే వాటిలో కొన్ని చిన్నతనంలో పెద్దలు చెప్పగా విన్నవని చెప్పారు.

---

[33] ఎకసెక్కె ; ఎగతాళి, వెక్కిరింపు వ్యంగ్యము

శాస్త్రులు గారు శ్రీ రాజాగారిని గురించి తమ కథలు- గాథలు అనే వ్యాసాలలో చాలా విశేషాలు వ్రాశారు. (ఇంకా) అనేక విశేషాలు వ్రాయకుండానే స్వర్గస్థులైనారు.

మరికొన్ని కథలు

రాజాగారు వైష్ణవ మతస్థులు. వారి గురువు వానమామల జియ్యంగారు. వారు కడియం వచ్చినప్పుడు, పాదపూజ, ఒక లక్ష రూపాయలును ఆపేక్షించారు. కానీ, రాజాగారు 50వేల కన్నా ఇవ్వదలచలేదు. దానిని గూర్చి న ఒక కథను శ్రీ శాస్త్రిగారు వివరించారు. రాజాగారు అన్ని తరగతుల వారిని, అన్ని మతముల వారిని ఆదరించేవారు. ఉత్తర దక్షిణ దేశములలోని పుణ్యక్షేత్రములు దర్శించి, ఆయా దేవుళ్లను సేవించారు. ఆయన ఆ కాలంలో తెలుగుదేశంలో నుండిన గొప్ప వేదశాస్త్ర పండితులందరినీ సన్మానించారు. కొందరికి భూముల నిచ్చారు. రాజాగారు విద్యావంతులు, రసజ్ఞులు, ఉదారులు. ఆయన నిగర్వి . [34]అప్రతి గ్రహీతలైన మహా పండితులను దర్శించడానికి ప్రయత్నించేవారు. వారు స్వయంగా వెళ్లి, వారిని సన్మానించడానికి ప్రయత్నించేవారు. దీనిని గూర్చిన కథలునూ ఎన్నో ప్రచారములోనున్నవి. కొన్నిటిని శ్రీ శాస్త్రిగారు వివరించారు. [35]మహావయ్యాకరణులైన భాగవతుల హరిశాస్త్రి గారిని కోటిపల్లిలో దర్శించి, సన్మానించదల్చగా, వారేమియూ పుచ్చుకోలేదనియు, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు తమ అనుభవాలలో

---

[34] అప్రతి గ్రహీతలు= దానాలు ఆశించని , తీసుకోని వారు

[35] మహావయ్యాకరణులు=వ్యాకరణ శాస్త్రపండితులు

వ్రాశారు. రాజాగారి ఆస్థానంలో అల్లంరాజు సుబ్రహ్మణ్య కవి, దేవులపల్లి కవి సోదరులు, మొదలైనవారు ఉండేవారు. రాజాగారికి సంగీత, నృత్య, నాట్యముల పైన కూడా ప్రీతి. ఆ కాలములోని సుప్రసిద్ధ కళాకారులను సన్మానించారు. సుప్రసిద్ధ భామకలాపం[*భామాకలాపం*] కళాకారులైన కొల్లూరి నారాయణ గారికి సవారీ పంపి, రప్పించి, భామ వేషం కట్టించేవారు. అని శాస్త్రిగారు ఒకచోట వ్రాశారు.

రాజాగారికి సంస్కృతంలో మంచి శ్రుత పాండిత్యం ఉండేదని, అందువలన ఎలాంటి పండితులు తమ దర్శనానికి వచ్చినా, సంస్కృతంలోనే వారితో సంభాషించే వారని, ఒకసారి సుప్రసిద్ధులైన దండిభట్ల విశ్వనాధశాస్త్రి గారితో అలా మాట్లాడగా రాజాగారి భాషకు వారు హర్షింపక , వారిని వారించారని వేంకట శాస్త్రి గారు వివరించారు.

రాజాగారు సన్మానించిన గొప్ప వేదశాస్త్ర పండితులలో జగదేక పండితులుగా, ప్రఖ్యాతి పొందిన శ్రీ బులుసు పాపయ్యశాస్త్రి గారు ఒకరు. ఆయనకు ఎంత భూమి కావలెనో కోరుకొమ్మని రాజాగారు అనగా తమకు సంవత్సర గ్రాసానికి తమ స్వగ్రామమైన అయినవిల్లికి దగ్గరలో నున్న శానపల్లిలంకలో 12 పుట్ల భూమిని ఇమ్మని కోరినారని, దానిని కొలిపించుకొనడంలో 18 పుట్ల భూమిని తీసుకున్నారని, ఈ సంగతి రాజుగారికి తెలిసి ఠాణేదారు అయిన పాలెపు పల్లంరాజు గారిని ఉద్యోగం నుంచి తొలగించి వేశారని, పాపయ్య శాస్త్రి గారు తమ అఖండ తార్కికప్రజ్ఞ వలన రాజాగారిని సమాధానపరిచి, పల్లంరాజు గారికి మళ్ళీ ఉద్యోగం ఇప్పించినారని శాస్త్రి గారు వ్రాశారు. కోనసీమలో పుట్టెడు భూమి అనగా 8 ఎకరాలు. పల్లంరాజు గారిని శాస్త్రి గారు స్వయంగా ఎరుగుదురు.

గోరస, కొమరగిరి అనే గ్రామాలలో ఒక దానిలో ఉండే మద్దూరి దీక్షితులు గారనే గొప్ప వేద పండితునకు సాలుకు రూ. 600/- లు ఆదాయం గల భూమి నిచ్చారని శాస్త్రిగారు వ్రాశారు. రాజాగారు తలంటుకున్నప్పుడు దర్శించుటను గూర్చి కూడా వ్రాశారు.

శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారి స్వగ్రామము పిఠాపురం రాజాగారి ఎస్టేట్లో చేరిన కడియం అనే గ్రామము అయినందువల్ల, వారు పెద్దల వల్ల విన్న సంగతులు చాలా వ్రాశారు. ఈ కథలు ఆనోటా ఈనోటా పడి, కొన్ని మార్పులు చేర్పులు పొందినా, అసలు జరిగిన సంగతులు మాత్రము నిజమే అనడానికి సందేహము లేదు. రాజాగారిని గురించి ప్రచారంలో ఉన్న కథలలో - వారి దగ్గర పనిచేసిన ఉద్యోగుల జుట్లు, పండితుల జుట్లు, ఆశ్రితుల జుట్లు కోయడము గూర్చిన కథలు చాలా ఉన్నవి. వారొక మారు వారి సవతి నాయనమ్మగారి కొప్పును కోశారని, ఆమె జుట్టునిస్తామని, స్వామివారికి మ్రొక్కుకున్నాము అని ఆమెగారికి చెప్పి, సమాధాన పరచినారనే కథను శాస్త్రి గారు తమ కథలు- గాథలులో వివరించి, అది సవతితల్లి గారి కొప్పు అని, ఆయన మనుమడు గారు చెప్పినారని వ్రాశారు. మా ఇంట్లో కూడా ఇలాగనే అనుకునేవారు. ఒక శాస్త్రులుగారి చెవి పట్టుకుని లాగుటలో కుండలము ఊడి వచ్చినదని కూడా చెప్పుకునేవారు. రాజాగారు ఇటువంటి చిలిపి పనులు ఎందుకు చేసేవారో చెప్పడం కష్టము. దీనిని గురించి శ్రీ ఆదిభట్ల నారాయణ దాసుగారు కూడా వ్రాశారు. రాజాగారు ఇతరుల పట్ల ఎలా ప్రవర్తించినా శివరావుగారి పట్ల మాత్రము చాలా మర్యాదగా ప్రవర్తించే వారని పెద్దలందరూ చెబుతారు.

ఏలేరు కింద సాగు బడి



ఏలేరు అనే నది 68 మైళ్ళ పొడుగునా గోదావరి జిల్లాలో మల్లవరం నుంచి ప్రవహించి, పెద్దాపురం, పిఠాపురం డివిజనుల గుండా సామర్లకోట - కాకినాడల మీదుగా పోయి సముద్రంలో కలుస్తున్నది . దాని పాయలలో నొక దానికి - గొర్రెలఖండె - అని పేరు. దానికి అకస్మాత్తుగా వరదలు వస్తూ ఉంటాయి వరదల నీరు తగ్గినప్పుడు జనులు దానిలో నుంచి నడిచిపోతూ ఉంటారు. అలాంటి సమయాన వరద వచ్చి మనుషులు, పశువులు కొట్టుకొని పోవడం జరుగుతూ ఉంటుంది. ఈ నది లోతు తక్కువ. వడి[36] ఎక్కువ. ఇందులో సారవంతమైన ఒండ్రు మట్టి కొట్టుకుని వస్తూ పొలాలకు సత్తువ నిస్తుంది. పెద్దాపురం, పిఠాపురం, కాకినాడ తాలూకాలలోని చాలా గ్రామాలకు ఏలేటి నీరు ఉపయోగపడుతున్నది.

పిఠాపురంలోని చాలా భూములు గోదావరి ఆనకట్ట క్రింద కాలువల వల్ల సాగు అవుతాయి. కొన్ని ఏలేటి క్రింద సాగు అవుతాయి. మరికొన్ని చెరువుల క్రింద సాగు అవుతాయి. గంగాధర రామారావు గారి కాలంలో ఏలేటి క్రింద పల్లం సాగు నీటి వనరులకు వీలైన కాలువలు, తూములు వగైరా , ఇరిగేషన్ వర్క్స్ , నిర్మాణాలు జరిగినవి. దానికి ప్రత్యేకంగా ఇంజనీరింగ్ సిబ్బంది కూడా ఏర్పడినది.

---

[36] వడి= ప్రవాహ తీవ్రత

ఏలేటి నీటిని వుపయోగించుకోవడం విషయములో పూర్వం పెద్దాపురం వారికీ, పిఠాపురం వారికీ తగాదాలు వచ్చేవి. కానీ గంగాధరరామారావు గారి కాలంలో తగాదాలు లేవు. పెద్దాపురం ఋణగ్రస్తమైనందున చాలా ముఠాలు, గ్రామాలు అన్యాక్రాంతములైనవి. కొన్నిటిని పిఠాపురం జమీందారు వెంకట నీలాద్రి రావు గారు కొన్నారు. గంగాధరరామారావు గారు మూడు వేల రూపాయలు ఖర్చుపెట్టి ద్రాక్షారామ సప్తగోదావరి కాలువలను త్రవ్వించడమే గాక, వెయ్యి రూపాయలు ఖర్చు చేసి, పవర ఠాణాలో కాలువ త్రవ్వించారు.

ఇటీవల , పెద్ద నదుల నీటిని పల్లపు సాగుకు సద్వినియోగము చేయాలనే భావంతో తయారుచేసిన ప్రాజెక్టుల పథకములో ఏలేరునది కూడా చేర్చబడినందువల్ల దీని విలువ తెలుస్తుంది.

లోకల్ ఫండ్ బోర్డు

1871 సం.లో లోకల్ ఫండ్ బోర్డుల చట్టం చేశారు. లోకల్ ఫండ్ బోర్డు అనే కమిటీకి అధ్యక్షుడు కలెక్టర్. అందులో ఇంజనీరు, వైద్యాధికారి మొదలైన వారిని గవర్నమెంట్ సభ్యులుగా నియమించేవారు. వారు గాక, నాన్ అఫీషియల్ ఉద్యోగేతరులైన కొందరు పెద్ద మనుష్యులను కూడా సభ్యులుగా నియమించేవారు.

ఈ బోర్డులు మారుమూల గ్రామాలకు జిల్లా రహదారులను కలిపే రోడ్లను, ఇతర రాకపోకల మార్గాలను నిర్మించాలి. అయితే

గ్రామాలలోని రోడ్లు వీరికి సంబంధము లేదు. ప్రాథమిక పాఠశాలలు స్థాపించడానికి గ్రాంట్లు ఇచ్చి, ప్రోత్సహించాలి. ఆసుపత్రులు, సత్రములు, మార్కెట్లు, చెరువులు, నూతులు నిర్మించడం , వాటి మరమ్మత్తులు, రోడ్లను, చెరువులను, బావులను శుభ్రపరిపించడం, ప్రజలకు ఉపయోగకరములైన ఇతర పనులు ఈ బోర్డులు నిర్వహించవలెను. తరువాత, టీకాలు వేయించే బాధ్యత కూడా వీరికి అప్పగించారు. పబ్లిక్ రహదారి బంగాళాలను (టీ.బి) నిర్వహించే పని కూడా వీరికి ట్రాన్స్ఫర్ చేశారు. ఈ లోకల్ ఫండ్ బోర్డులకు కావలసిన ఖర్చులకోసం పూర్వం రోడ్డు ఫండ్ నిమిత్తము భూములపైన య. 1 కి ఒక అణా చొప్పున విధించిన సెస్సును (cess) రెండు అణాలకు హెచ్చించారు. అవసరమును బట్టి గ్రాంటు కూడా ఇచ్చేవారు.

ఈ లోకల్ ఫండ్ బోర్డులు 1884 సం.లో తాలూకా, జిల్లా బోర్డుల చట్టము క్రింద నిర్మాణము అయ్యేవరకు పనిచేసినవి. ప్రభుత్వం వారు ఈ లోకల్ ఫండ్ బోర్డులో శివరావుగారి నొక సభ్యులుగా నియమించారు. ఆయన 1885సం. వరకు సభ్యులుగా ఉన్నారు. ఆయన తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించేవారు.

రాజాగారి వింత చర్యలు

బొబ్బిలి వారికి దత్తత వెళ్లిన వెంకట సూర్యనారాయణ మహీపతి గారు గంగాధరరామారావు గారి కన్నా ఒక సం. చిన్నవారు. ఆయన దత్తత తండ్రిగారు ఆయనకు సీతారామకృష్ణ రాయడప్పరంగారావు గారని నామకరణం చేసుకున్నారు. దత్తత తండ్రిగారైన రాజా శ్వేతాచలపతి రంగారావు గారు 1862 సం||లో చనిపోయారు. ఒక సం.లోనే యుక్త



బొబ్బిలి రాజా, వేంకట శ్వేతా చలపతి రంగారావు(1862-1921)

వయస్కు లైనందు వల్ల, రాయడప్పరంగారావు గారు 1863 సం|| లో బొబ్బిలి జమీందారీ పరిపాలకులయినారు. ఆ కొద్ది కాలంలో కోర్టు ఆఫ్ వార్డ్స్ క్రిందికి తీసుకోవడం అనవసరమని కలెక్టర్ ఊరుకున్నాడు.



వెంకటగిరి కోట

రాయుడప్ప రంగారావు గారు ఇనుగంటి వారి ఆడపడుచు లక్ష్మీ చెల్లాయమ్మా రావు గారిని వివాహం చేసుకున్నారు. కానీ, సంతానము కలుగలేదు. రంగారావు గారు ఐదు సం.లు మాత్రమే జమీందారీ పరిపాలన చేసి, 1868 సం.లో అకాల మరణం పొందారు. ఎవరినైనా దత్తు చేసుకోవలసినదని భార్యకు అనుజ్ఞ నిచ్చారు. అంతట లక్ష్మీ

చెల్లాయ యమ్మా రావు గారు గంగాధరరామారావు గారితో ఆలోచించి, వెలమ జమీందారులలో అగ్రగణ్యులైన వెంకటగిరి రాజా సర్వజ్ఞ యాచేంద్రుల వారి మూడవ కుమారుడైన శ్రీ రంగమన్నారు కృష్ణ యాచేంద్రులను 12 సం.ల బాలుని, 1871 సం.లో దత్తు చేసుకుని శ్రీ రాజా రావువెంకట శ్వేతాచలపతి రంగారావు గారని నామకరణం చేశారు. ఈ దత్తత జరిగించడంలో గంగాధరరామారావు గారు, శివరావుగారు వెంకటగిరి వారితో సంప్రదించి ఏర్పాటు చేశారు. అటు తరువాత కాలంలో రాజాగారికి కూడా దత్తత చేసుకోవాలనే ఉద్దేశం కలిగింది. రాజాగారు మొట్టమొదట 1861 సం.లో రాణి మంగాయమ్మ గారిని వివాహము చేసుకున్నారు. తరువాత వరుసగా మరి ఆరుగురు భార్యలను వివాహ మాడారు. కానీ, సంతానము కలుగలేదు. అంతట వారు శివరావుగారితో కూడా ఆలోచించి, వెంకటగిరి రాజాగారి రెండవ కుమారుడైన సర్వజ్ఞకుమార యాచేంద్రబహద్దర్ అను 14 సం.ల ఈడుగల కృష్ణయాచేంద్రులను బాలుని ది. 28- 7- 1873వ తేదీన దత్తత చేసుకుని, ఉత్సవాలు చేయించారు దత్తత స్వీకార పత్రిక రిజిస్టరు చేయించారు. ఆ అబ్బాయికి రాజా వెంకట సూర్యమహీపతి రామకృష్ణారావు బహద్దర్ అని నామకరణము చేసి, వివాహము కూడా జరిగించారు. ఆ అబ్బాయికి ది. 18- 7- 1876వ తేదీన కుమారుడు కలిగినాడు. అంతట రాజాగారు ఆ బాలునికి బారసాలె [*బారసాల*] మహా వైభవముగా జరిగించారు. ది.16- 2-1877వ తేదీన అన్నప్రాసన కూడా మహా వైభవముగా జరిగించారు. అప్పట్లో రాజాగారు దత్తుని పైన చాలా ప్రేమగానే ఉండేవారు. అటు తరువాత ఏమి జరిగిందో గాని రాజాగారిలో మార్పు వచ్చింది. రాజా[రాజుల]అంతఃపురాలలో సాధారణంగా ఏవో అంతః కలహాలు, కుట్రలు జరుగుతూ ఉంటాయి. ఏమైతే

నేమి 1878 సం. మధ్యలో రాజాగారికి దత్తుని యందు పూర్తిగా దయ తప్పినది. దత్తునికి యుక్తవయస్సు వస్తున్న సమయంలో వైషమ్యాలు పెరిగితే చాలా చిక్కులు రాగలవని శివరావుగారు రాజాగారిని శాంతింప చేయడానికి ప్రయత్నించారు . అంతట రాజాగారికి శివరావుగారి మీద కోపం వచ్చింది. ఆయనను ది.8- 9-1878వ తేదీన పనిలో నుండి తొలగించారు. దత్తుడు గారు ది. 21-2- -1879వ తేదీన చెన్నపట్టణము వెళ్లిపోయారు. రాజాగారు మనుమని పుట్టు వెంట్రుకలు ది.9- 7- 1879 వ తేదీన ఉపమాక వేకటేశ్వరస్వామి దేవాలయంలో దత్తుడు గారు రాకుండానే తీయించారు. వెంకటగిరి వారు, బొబ్బిలి వారు రాజాగారిని శాంతపరచి, సఖ్యత కుదిర్చారు. కానీ, మళ్లీ 1861 సం.లో అభిప్రాయ భేదాలు తలెత్తినవి. అవి తీవ్ర రూపం దాల్చినవి.

శివరావుగారు శనివారప్పేట రాజాగారి మేనేజరుగా

శివరావుగారు రాజాగారి దగ్గర పని మానుకున్న తరువాత కొన్నాళ్లు కాకినాడలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకున్నారు. ఆయనను తమ దగ్గర పనిచేయమని, కొందరు జమీందార్లు కోరినా వెళ్లలేదు. కొన్నాళ్లకు రాజాగారి దగ్గర బంధువునూ, చిన్నవాడూనైన శనివారప్పేట రాజా వెంకట్రామయ్యప్పారావు గారు మొదటి నుండి శివరావుగారి పట్ల చాలా గౌరవము కలిగియుండి, ఇప్పుడు ఆయనను తమ మేనేజర్ గా రమ్మని మరీ మరీ కోరగా, శివరావుగారు అంగీకరించి, 1882 సం. అక్టోబర్ లో ఆయన దగ్గర మేనేజర్ గా ప్రవేశించారు

బందరులోనూ, గుంటూరులోనూ సుప్రసిద్ధ న్యాయవాదిగా నుండిన సింగరాజు సుబ్బారాయుడు గారు నిడదవోలు జమీందారుల

వ్యవహారము, శనివారప్పేట జమీందారు గారి పనులు కూడా చూస్తూ ఉండేవారు. ఆయన శివరావుగారితో సంప్రదించడానికి రాగా అప్పట్లో, వారి గుమాస్తాగా నుండి తరువాత ప్లీడర్ పట్టా పొంది బెజవాడలో ప్రఖ్యాతి చెందిన శ్రీ పాటిబండ వెంకట రమణయ్య పంతులుగారు కూడా వచ్చారు. శివరావుగారి తెలివితేటలు, శనివారప్పేట రాజాగారు శివరావుగారి పట్ల చూపించే భయభక్తులు, చూసి సుబ్బారాయుడు గారు ఆశ్చర్యపడినారని శ్రీ వెంకట రమణయ్య పంతులుగారు నాతో చెప్పారు. 1884 సం., జనవరి 31వ తేదీన మా రెండవ అక్క గారైన మహా లక్ష్మమ్మ గారి వివాహమును, ఫిబ్రవరి 7వ తేదీన మా అన్నయ్య తిమ్మరాజు పంతులు గారి వివాహమును కాకినాడలో జరుగగా శనివారప్పేట రాజాగారు శివరావుగారికి వెయ్యినూటపదహార్లు కానుకగా నిచ్చారు.

శ్రీ శివరావు పంతులుగారు పని మానుకుని వెళ్లిన కొద్ది కాలానికి (పిఠాపురం) రాజాగారు వాడ్రేవు చలమయ్య పంతులు గారిని తమ క్రింద మేనేజరుగా నియమించి, వారికి సర్వముఖనామా వ్రాయించి ఇచ్చారు. అయితే, 1885 సం. నాటికి, రాజాగారికి ఆయన పైన గౌరవము తగ్గిపోయినది. ఆయన దివాణం పనులు సరిగా చేయడం లేదని నిందించి, ద్రవ్యాపహరణం చేశాడని, నేరం మోపి, ఆయన పైన రాజాగారు ఒక క్రిమినల్ కేసు దాఖలు చేశారు. ఆ కేసును విచారించిన ఫాస్టరు దొర(W.S,Foster, District Collector) కఠినుడు. అతడు చలమయ్య గారికి ది15-7-1885 వ తేదీన ఒక సం., మూడు నెలలు కఠిన శిక్ష విధించారు. ఆయన అప్పీలు

చేసుకుని, చాలా అవస్థ పడవలసి వచ్చింది.

శివరావుగారిని పిఠాపురం రాజాగారు తిరిగి రప్పించుట


చలమయ్య గారికి శిక్ష పడడానికి కొన్నాళ్లకు ముందు శనివారప్పేట రాజాగారికి కిర్లంపూడి లో వివాహము నిశ్చయమైనది. అంతట గంగాధర రామారావు గారు ది. 21- 6- 1885వ తేదీన స్వయముగా ఏలూరు వచ్చి, శనివారప్పేట రాజాగారి దగ్గర పని మానివేసి, మళ్లీ తమ దగ్గర మేనేజరుగా పని చేయవలసినదని శివరావుగారిని కోరారు. అంతట వారి మాటను తీసివేయలేక శివరావుగారు ఈ సంగతిని శనివారప్పేట రాజాగారికి చెప్పగా, వారు కూడా చెప్పిన మీదట తాము మళ్లీ పిఠాపురం రాజా గారి దగ్గర పనిలో ప్రవేశించారు. శివరావు గారు అక్కడ మళ్లీ పనిలో చేరేటప్పటికి రాజాగారి కుటుంబ వ్యవహారాలు అల్లకల్లోలముగా నున్నవి. రాజా గారికి మనశ్శాంతి లేదు.

రాజాగారికి ఔరస[37] పుత్రుడు కలుగుట

అది వరకు పిల్లలు పుట్టడం అసంభవము అనుకున్న రాణి మంగాయమ్మ గారు గర్భము దాల్చినారని, రాజాగారి అంతఃపుర పరిజనము కొంత కాలము నుండి చాలా హడావుడి చేయడము ప్రారంభించగా, తుదకు ది. 5- 10- 1885వ తేదీన మహారాణి గారు

[37] ఔరస పుత్రుడు అంటే తనకు కలిగిన పుత్రుడు

ప్రసవించినారని, మగ పిల్లవాడు కలిగినాడని ప్రకటించారు. అంతట రాజాగారు చాలా ఉత్సాహంతో పుత్రోత్సవం జరిపించి, ఆ శిశువునకు



రాజా వెంకట కుమార మహీపతి సూర్యారావు గారు అని నామకరణము(R. V.K. M SURYA RAO BAHADDAR) చేశారు. ఆ సమయంలో దత్తపుత్రుడును, వెంకటగిరి వారును ఇదంతా బూటకమని, ఆ శిశువును రాణీగారు కనలేదని, వాదించడం ప్రారంభించారు. రాజాగారి బంధువర్గములో గుసగుసలు బయలుదేరినవి. కొందరు ఆపక్షమూ, మరికొందరు ఈ పక్షమూ వహించారు ఈ పరిస్థితులలో శివరావుగారిని ఉభయపక్షములవారూ ఇరుకున పెట్టి బాధించేవారు. రాజాగారి చిత్తవృత్తులలోనూ *(చిత్తప్రవృత్తులలోనూ)* మార్పులు కలిగినవి. ఇందువలన శివరావుగారికి అక్కడ పనిచేయడమే కష్టమైనది. ఎలాగో కాలము గడుపుతున్నారు. ఇంతలో శివరావుగారికి కూడా కొన్ని బాధలు కలిగినవి. శివరావుగారి ప్రధమ భార్య సంతానము లేకుండానే 1872 సం.లో మరణించినది. రెండవ భార్యకు కూడా సంతానం కలుగలేదు. అందువల్ల, ఆయన మా నాయన గారి రెండవ కుమారుడు[38] సీతాపతి అను శిశువును ది. 6- 2-1886 వ తేదీన దత్తత చేసుకొని, ప్రసాదరావు అని నామకరణం చేశారు. కానీ మా సవతి తల్లి గారు ది. 8- 9-1886 వ తేదీనను, ది. 24- 10-1886వ

---

[38] రచయిత తండ్రిగారి మొదటి భార్య కుమారుడు (రచయితగారి సవతి తల్లి కుమారుడు)

తేదీన ప్రసాదరావును చనిపోయారు. ఈ పరిస్థితులలో శివరావుగారు ఎలాగో ఒక సంవత్సరన్నర కాలము రాజాగారి దగ్గర పనిచేసి, అటు తరువాత పని చాలించాలనుకున్నారు.

రాజాగారి పినతండ్రి కుమారుడు కోలంక, వీరవరం జమీందారు గారైన వెంకట సూర్యారావు గారు 1887 సం. జనవరి నెలలో చనిపోయారు. ఆయన భార్య చెల్లాయమ్మా రావు చాలా గొప్ప ఇల్లాలు. ఆమె చాలా దానధర్మములు చేసి, ప్రసిద్ధి చెంది ఉన్నారు. శివరావుగారు పెద్దవారును, అనుభవజ్ఞులును, మొదటినుండీ తమ కుటుంబ క్షేమము కోరుతూ, పనిచేసిన వారు అయినందువలన, తమ మేనేజరుగా ఉండి, తమ వ్యవహారాలు చక్కబెట్టవలసినదని, ఆమె కోరగా ది. 19-8-1888వ తేదీన శివరావుగారు ఆ ఉద్యోగంలో ప్రవేశించారు.

రాజాగారి దత్తునికి జీవనోపాధికి కొంత భరణం ఏర్పాటు చేసి, తమ జమీందారీ స్థిర చరాస్తులన్నీ తమ ఔరస పుత్రుడైన వెంకట కుమార మహీపతి సూర్యారావు గారికే చెందవలెనని, 1889 సం.లో రెండు మరణ శాసనములను, 1890 సం.లో మరొక మరణ శాసనమును వ్రాయించి, ది. 22- 7 -1890 వ తేదీన చనిపోయినారు.

అంతట, మైనరు తరపున కోర్ట్ ఆఫ్ వార్డ్స్ కలెక్టర్ గారు ఎస్టేట్ ను స్వాధీనపరచుకొన్నారు. అప్పుడు దత్తు కుమారుడు వచ్చి, కుమార మహీపతిసూర్యారావు గారు గంగాధరరామారావు - మంగయమ్మ గార్లకు జన్మించలేదని మరణ శాసనం చెల్లదని, జమీందారీ తమకే రావలెనని, రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో 1891వ సం.లో ఆరవ

నెంబరు గల అసలు దావా(O.S No. 6. 5. 6/ 91) దాఖలు చేయగా, జిల్లా జడ్జి మెకంజీ గారు (C.T. Mackenzie) విచారించి, 1894 సం.లో వాది పక్షంగా డిక్రీ ఇచ్చారు. అంతట, వెంకట కుమార మహీపతిసూర్యారావు గారునూ కోర్ట్ ఆఫ్ వార్డ్స్ వారునూ హైకోర్టుకు అప్పీలు చేయగా, మైనరు సూర్యారావు గారు ఔరస పుత్రుడు అవునా కాదా అను విషయముతో నిమిత్తము లేకుండా మరణశాసనమును బట్టి జమీందారీకి హక్కుదారులని తీర్మానించారు. అంతట, దత్తుడు గారు ప్రీవి కౌన్సిల్ నకు అప్పీలు చేయగా, వారు హైకోర్టు తీర్పును ఖాయం చేశారు.

తిరుపతి భూమి పట్టా

శివరావు పంతులుగారు పిఠాపురం రాజాగారి దివాన్ గా నుండగా 1878 సం.కి పూర్వము చంద్రగిరి తాలూకాలోని తిరుపతి గ్రామంలో పోలక్కి శ్రీనివాసరావు గారి తాలూకు 16 య. 23 సెం. భూమిని రాజాగారి తరపున శివరావుగారు ఖరీదు చేయడం జరిగింది. అందువల్ల, గ్రామ లెక్కలలో ఆ భూమికి పట్టాదారుగా శివరావుగారి పేరు నమోదు చేశారు. దానిపైన రూ. 16- 4- 0 శిస్తును, రూ. 1-0-3 రోడ్డు ఫండును(Road Fund) ప్రతీ సాలీనా చెల్లించవలసి ఉండేది. శివరావుగారు 1878 సం.లో దివాన్గిరీ విరమించిన తరువాత పిఠాపురం దివాణం వారు ఆ భూమిశిస్తును సక్రమంగా చెల్లించకనూ, భూమిని అమరక పరచకనూ అశ్రద్ధ చేయజొచ్చారు. గ్రామ లెక్కల దాఖలా పట్టాదారైన శివరావుగారు గోదావరి జిల్లాలో నున్నందువల్ల, శిస్తు బాకీ వసూలు కాలేదని, చంద్రగిరి తాలూకా అప్పటిలో, ఉత్తర

ఆర్కాట్ జిల్లాలో చేరి ఉన్నందువల్ల, తహశీల్దారు ఆ జిల్లా కలెక్టర్ గారికి తెలియపరిచారు. అంతట, ఉత్తర ఆర్కాట్ జిల్లా కలెక్టర్ ఆఫీసు నుండి శిస్తు డిమాండ్ నోటీసులు గోదావరి జిల్లా కలెక్టర్ అడ్రస్ కు పంపించి, పట్టాదారు పైన జారీ చేయించమని కోరారు. అంతట ఆ డిమాండును తణుకు తాశీల్దారు ద్వారా శివరావుగారికి 1884సం. మార్చి నెలలో పంపించారు. ఆ భూమి పిఠాపురం రాజాగారిది అని, వారి పేరు లెక్కలలో నమోదు చేయించడానికి చర్య తీసుకొనవలసినదిగా వ్రాశామని , శివరావుగారు తహశీల్దార్ వారికి వ్రాశారు. పట్టా మార్పు జరిగే వరకు, శిస్తు డిమాండును ఆపి ఉంచడానికి, వీలులేదని తాశీల్దారు గారు జవాబు వ్రాశారు . ఈ సంగతి పిఠాపురం రాజాగారి దివాణమునకు తెలియపరచి, గ్రామ లెక్కలలో తమపేరు తొలగించి, రాజాగారి పేరు నమోదు చేయడానికి తగు చర్యలు జరిపించవలసినదిగా శివరావుగారు ఒక ఉత్తరం వ్రాశారు. అప్పట్లో, పిఠాపురం రాజాగారి దగ్గర మేనేజరుగా పనిచేయచూ, సర్వ ముక్త్యారుగా నున్న వాడ్రేవు చలమయ్య పంతులుగారు ఆ శిస్తు మొత్తము రూ. 17-4-03 శివరావుగారికి మనీఆర్డర్ ద్వారా పంపి, దానిని సర్కారుకు చెల్లించవలసినదని ది. 6-8- 1864 వ తేదీన స్వయంగా ఉత్తరం వ్రాశారు. ఇట్టి స్థితిలో వాడ్రేవు చలమయ్య పంతులు గారి మీద రాజాగారికి ఆగ్రహం కలిగి వారిని పనిలో నుండి తొలగించి, వారి మీద క్రిమినల్ కేసు దాఖలు చేసి, ది.21- 6-1885 వ తేదీన స్వయంగా ఏలూరు వెళ్లి, శివరావుగారిని శనివారప్పేట రాజాగారి క్రింద పనిమాని మళ్ళీ తమ వద్ద పనిచేయవలసినదని కోరడము, శివరావుగారు మళ్లీ వెళ్లి పిఠాపురం రాజాగారి దగ్గర పనిచేయడం జరిగిన రోజులవి.

అంతట ఈ తిరుపతి భూమి[39] వ్యవహారమును గురించి ఉపేక్షించడం ఇష్టము లేక శివరావుగారు తిరుపతి గ్రామ లెక్కలలో తమ పేరును తొలగించి, రాజాగారి పేరును నమోదు చేయించవలసినదని కోరుతూ, ఉత్తర ఆర్కాట్ జిల్లా కలెక్టర్ గారికి ది.1- 11- 1885 వ తేదీన ఒక అర్జీని పంపించారు. ఇటువంటి అర్జీలు స్వయంగాగాని, ఏజెంట్ ద్వారాగాని దాఖలు చేయాలంటూ ఒక ఎండార్సు మెంట్(endorsement) తో శివరావుగారికి తిరిగి వచ్చింది. ఆ వచ్చిన కవరు మీద శివరావుగారి చిరునామ లో 'గారు' శబ్ద *(పద)*ప్రయోగం లేకుండా వ్రాశారు. అంతట శివరావుగారు దీనిని గురించి ఆ కలెక్టర్ గారికి ది. 25- 12- 1885 వ తేదీన ఒక ఉత్తరం వ్రాస్తూ, తాము పిఠాపురం రాజాగారి మేనేజరుగా ఉండడమే గాక, లోకల్ ఫండు బోర్డులో(Local Fund Board) సభ్యుడుగా కూడా ఉన్నామని, వారి ఆఫీసు నుండి తమ పేరిట పంపిన కవరు మీద చిరునామాలో పేరు తుదన గారు అని వ్రాయక ఏక వచనంగా వ్రాయబడి ఉండడం లేఖరి పొరపాటై యుండునని తాము తలుస్తున్నామని, ఇక ముందు ఇలాంటి పొరపాటు రాకుండా ఉండగలందులకు ఈ ఉత్తరం ద్వారా కలెక్టర్ గారికి తెలియపరుస్తున్నామని గట్టిగా వ్రాశారు. దీనివల్ల, శివరావు గారి పట్టుదల, ఆత్మగౌరవము, ధైర్యము తెలియగలవు .

---

[39] ఈ తిరుపతి భూమిని రాజాగారి పేరున రిజిస్టరు చేస్తూ 1885సం. లో వ్రాసిన పట్టా నకలు అనుబంధము లో ప్రకటించాము

ఇంకా మరి కొన్ని కథలు-గాథలు అందులోని విశేషాలు.

అటు తరువాత శివరావుగారును, రాజాగారును ఉత్తర ఆర్కాటు కలెక్టర్ గారి దగ్గర పేరు మార్పును గురించి సరి అయిన పిటీషన్ దాఖలు చేయించిన మీదట, ఆ భూమికి గ్రామ లెక్కలలో రాజాగారి పేరు నమోదు కాబడినది. అంతట, రాజాగారు భూమిని శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి సమర్పించారు.


శివరావు పంతులుగారు గంగాధరరామారావు గారి దగ్గర దివాన్గిరీ చేస్తూ, ఆయనకు ప్రీతిపాత్రుడు కావడమే గాక, చుట్టుపట్ల గల గొప్ప సంస్థానాల జమీందారులందరికీ గౌరవ పాత్రులుగా ఉండేవారు. 1876 సం.లో మా పెద్దక్క [40] గారి వివాహము శివరావు గారే జరిగించారు. అప్పుడు శివరావుగారు విందు భోజనానికి పిఠాపురం రాజాగారిని ఆహ్వానించారు. మరి నలుగురు జమీందారులను కూడా పిలిచారు. ఈ జమీందారులను భోజనాల దగ్గర కూర్చుండ పెట్టడంలో తారతమ్యము లేకుండా నాలుగు గోడలకు నలుగురికి చేరపీటలతో పీటలు అమర్చించారు. మనిషి నిలువుపొడుగు గల పెద్ద అరటి ఆకులలో రకరకముల భక్ష్యభోజ్యములు చేయించి, వడ్డింపించగా, రసజ్ఞులైన గంగాధర రామారావు గారు ఆ వంటకముల నందుకొనుటలో, ముందుకు వంగవలసి వచ్చుటను సూచిస్తూ శివరావుగారు మమ్ములను వంచారు అని

---

40 సుందరమ్మ గారు- తల్లాప్రగడ సుబ్బారావు గారి భార్య

చమత్కరించారట. ఇటువంటి కథలెన్నో గోదావరి జిల్లాలో పెద్దవాళ్లు చెప్పేవారు.

శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి శతావధాని గారు గంగాధర రామారావు గారిని గురించి అనేక వ్యాసాలు వ్రాశారు. మరియు అనేక



సభలలో ఉపన్యసించేవారు. సంభాషణలలో వారిని గురించి, వారి దివాన్జీ శివరావుగారిని గురించి అనేక విశేషాలు, కథలూ చెప్పేవారు. ఈ కథలు తమ కడియం గ్రామములోనూ, గోదావరి జిల్లాలోనూ గల పెద్దల వల్ల విన్నామని, అవి ఆ నోటా ఆ నోటా పడి కొన్ని మార్పులు చెందిన మాట నిజమని, అయితే అసలు సంగతులు మాత్రం నిజమేనని తమ ఉపన్యాసాలలోనే వ్రాశారు [చెప్పేవారు]

ది. 25- 9-1937వ తేదీన కృష్ణా పత్రికలో (పిండిప్రోలు వారి దండకము) అనే వ్యాసంలో- పిండిప్రోలు లక్ష్మణ కవి గారు ఒక పర్యాయము పిఠాపురం సంస్థానములో తమకు రాతగ్గ, వార్షికమేదో ఇవ్వడంలో తగ్గించడం ఏదో జరిగిందని, అప్పుడు దిగవల్లి శివరావు గారు అనే *(ఆయన)* దివాన్ గా నుండే వారని, మన కవి గారు ఆ శివరావుగారు ఉన్న కచేరి సావడిలోకి వెళ్లి, మా దిగవల్లి శివరావుగారు ఎక్కడ నాయనా అని రెండు మూడు సార్లు రెట్టించేటప్పటికి రసజ్ఞులైన శివరావు గారు ఏదో మునిగినట్లు

ఉన్నదని గ్రహించి, ఏమిటి తాతగారూ ఇదిగో నేనే శివరావుని అని సవినయంగా చెప్పి, ఆ లోటు పాట్లు సవరణ చేసి, పంపినట్లు, మా పెద్దలు చెప్పగా విన్నానని అని వ్రాశారు

ఈ గాథలో చెప్పిన విషయము శివరావుగారు దివాన్ గా ఉన్నప్పుడు జరిగి ఉండదు. అంతకు చాలా కాలము క్రిందట శివరావుగారు ఆ సంస్థానములో 23, 24 సం.ల చిన్న వయస్సులో తమ తండ్రిగారైన తిమ్మరాజు పంతులుగారు- గంగాధరరామారావు గారి మైనారిటీ కారణంగా వారి అన్నగారి కాలంలో పిఠాపురం ఎస్టేట్ కోర్ట్ ఆఫ్ వార్డ్స్ మేనేజర్ గా నున్న సమయములో ఆయన చేతి క్రింద శివరావుగారు పనిచేస్తూ ఉన్న కాలంలో జరిగి ఉండునని నా అభిప్రాయము.

గంగాధరరామారావు గారి తండ్రి సూర్యారావు గారి అనంతరం 1851 వ సం. నుండి వారి పెద్ద కుమారుడైన నీలాద్రి రాయణం గారి మైనారిటీ లోనూ తిమ్మరాజు పంతులుగారు కలెక్టర్ గారి క్రింద మేనేజర్ గా పిఠాపురం జమీందారు పరిపాలన సాగిస్తూ ఉండగా, ఆయన చేతి క్రింద శివరావుగారు పనిచేస్తూ ఉన్నారు. ఆ కాలంలో తిమ్మరాజు గారు పిఠాపురం జమీందారులకు కావలసిన యావత్తు ఖర్చులు, వారి క్రింద నౌకరుల జీతభత్యములును, వారి బంధు వర్గమునకు, పండితులకు, కవులకు, గాయకులకు ఇవ్వవలసిన వార్షికములును ఎస్టేట్ ఖాతాకు ఖర్చు వ్రాసి ఇచ్చి, జమా ఖర్చులు ఉంచేవారు . జమీందారీ గ్రామాలలోని భూములను పూర్వాచార ప్రకారమే అమరకపరచి శిస్తులు వసూలు చేసి, ఖాతాకు జమ కట్టేవారు. పైన చెప్పిన సందర్భములో పిండిప్రోలు లక్ష్మణ కవి గారు పిఠాపురం

దివాణం నుంచి రావలసిన వార్షికం రాబట్టుకోవడానికి వెళ్లినప్పుడే ఈ సంఘటన జరిగి ఉంటుంది.

శివరావుగారిని గంగాధరరామారావు గారు ది. 1 -6-1863వ తేదీన శిరస్తాదారుగా నియమించినందున 1850 సం. నాటికే వృద్ధుడైన లక్ష్మణ కవిగారు అంతవరకూ బ్రతికి ఉండుట కూడా అసంభవమే. శివరావుగారు దివాన్జీగా ఉండగా పైన చెప్పినట్లు ఏకవచన ప్రయోగము చేసియుండుటయు అసంభవమే. శివరావుగారు చిన్నతనంలో చిన్న ఉద్యోగిగా ఉన్నప్పుడు అలా సంబోధించుటయు సహజము. చిరకాలం శివరావుగారు దివాన్గిరీ చేసినందు వల్ల, లోకులు ఈ కథ కూడా ఆ కాలానికి జమకట్టి ఉంటారు. ఈ నోటా ఆ నోటా పడి, ఇది ఇలాగ మారి ఉంటుందని , నేను శాస్త్రి గారితో చెప్పగా వారు సంతోషించారు.

శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి శతావధాని గారు తమ వ్యాసాలలోను, ఉపన్యాసాలలోను, సంభాషణలోనూ, కవిత్వ ప్రసక్తి వచ్చినప్పుడు కవిత్రయం వారిని గురించి , పూర్వకవులను గురించి, ఆధునికులలో దాసు శ్రీరాములు గారిని, ఆదిపూడి ప్రభాకరరావు గారిని గురించి తప్పకుండా నాలుగు మాటలు చెప్పేవారు. వెనకటి పండితుల ప్రతిభను గురించి చెప్పేవారు. అలాగే పూర్వకాలం నాటి సంస్థానాధిపతులను గురించి, పూర్వ సాంప్రదాయాలను గురించి ప్రసక్తి వచ్చినప్పుడు తప్పకుండా గంగాధరరామారావు గారిని గురించి , వారి దివాన్ శివరావు గారిని గురించి ఏవో కొన్ని సంగతులు చెప్పేవారు. పూర్వకాలమునాటి వేష భాషలు, మర్యాదలు, సాంప్రదాయాలు పాటించేవారని ప్రశంసించేవారు. వాటికోసం సంబంధించిన కథలు చెబుతూ ఉండేవారు. తెలివితేటలలో, ప్రభు మంత్రోత్సాహ శక్తులలో,

గుణశీలములలో, శివరావుగారు పూర్వకాలమునాటి మహామంత్రులలో చేర్చదగిన వారని శ్రీ శాస్త్రి గారి అభిప్రాయము.

శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి గారి చరమ జీవితకాలములో వారు బెజవాడలో బందరు రోడ్డుపైన గల క్షీరసాగర్ అనే కంటి వైద్యులు నిర్మించిన కొట్లలో కాపురం ఉండేవారు. అప్పుడు వారి శిష్యులైన శ్రీ డాక్టరు ఘంటసాల సీతారామ శర్మగారితో, కలిసి నేను తరచుగా వారి దర్శనానికి వెళ్లేవాడిని .

అప్పట్లో, వారి శిష్యులైన శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారు, శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు మొదలైన వారు కూడా వారి దర్శనానికి వచ్చేవారు. అక్కడ ఉండగానే, వారికి జబ్బు చేసి, నెమ్మదించినది. ప్రభుత్వ ఆస్థాన కవిగా నియమించబడటము, ఆయనకు అద్భుతమైన సన్మానము జరగడము తటస్థించినది. అటు తరువాతనే వారు మహాశివరాత్రి పుణ్య దినాన స్వర్గస్థులైనారు[41].

శ్రీ శాస్త్రిగారికి నా పైన చాలా దయ. ఆయన అంతకు పూర్వము బెజవాడ వచ్చినప్పుడు డాక్టర్ సీతారామశర్మగారి ఇంట్లో బస చేసేవారు. అప్పట్లో బెజవాడలో కొన్ని సభలలో ప్రసంగించారు. నేను రచించిన బ్రిటిష్ రాజ్యతంత్రము చదివి, ఆశ్చర్యపడ్డారు. నేను ముద్రించిన ఏనుగుల వీరాస్వామయ్య గారి కాశీయాత్ర చరిత్ర చదివి , ఆ యాత్రను గురించి కొన్ని పద్యాలు వ్రాసి ఇచ్చారు[42]. శ్రీ శాస్త్రిగారు డాక్టర్

---

41 శ్రీ శాస్త్రిగారు 15-02-1950తేదిన స్వర్గస్థులైనారు. (1870 సం.లో జన్మించారు)

42 చెళ్ళపిళ్ళ శాస్త్రిగారు వ్రాసిన రెండు ఉత్తరాల ప్రతులకు: రచయిత శివరావుగారి జ్ఞాపకాలు 2వ భాగం పుట105-107. ఈ సంపుటి అనుబంధము లో ఒక లేఖ ప్రతి ప్రచురించబడినవి

శ్రీ శర్మగారికి వ్రాసిన లేఖలో తమ వార్ధక్యము గూర్చిన పద్యాలు వ్రాశారు. ఆ జాబు ఇటీవల రాజమహేంద్రవరములోని సమాలోచన పత్రికలో ప్రకటింపబడినది.

శివరావు పంతులుగారి సంవత్సర వారీ చరిత్ర



ఈ డైరీలోని సంగతులు మా నాన్న గారు దిగవల్లి వెంకటరత్నం[43] పంతులుగారు వ్రాసుకున్న బైండ్ పుస్తకంలో జీవిత విశేషాలు, వాటి సం.ల వారీగా ఇతర

దిగవల్లి వెంకటరత్నం(1850-1908)

విషయాలతో పాటు ఉన్నది. దానిని నేను వేరే పుస్తకంలోవ్రాసుకున్నాను. దానిలో మరికొన్ని జీవితాంశాలు, సంగతులు చేర్చినాను.

హైదరాబాదులోని ఆంధ్రప్రదేశ్ ఆర్కైవ్సు లో ఉమ్మడి మద్రాసు రాజధాని ప్రభుత్వం వారు ప్రకటించిన గోదావరి జిల్లా రికార్డుల నుంచి అనేక చరిత్ర అంశాలను చేర్చినాను

(శివరావు పంతులు గారి జననం: ది17-05-1829న. విరోధినామసం. వైశాఖ శుద్ధ ఆదివారం స్వాతీ నక్షత్ర చతుర్థాచరణం- జననము. తండ్రి– తిమ్మరాజు పంతులుగారు. అప్పటికి కాకినాడ కలెక్టరు కచేరిలో- రికార్డ్ కీపరుగా ఉన్నారు.)

---

[43] దిగవల్లి వెంకటరత్నం (1850-1908)- రచయిత శివరావు గారి తండ్రి మరియూ దివాన్ శివరావుగారి తమ్ముడు

తేదీ వారీగా సంఘటనలు విశేషములు

తేది	విషయం
18-10-1828:	(సర్వధారినామ సం.) కాకినాడలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత భీమేశ్వర స్వామి వారి ఆలయంలో గల శిలా శాసనము వలన వారు ఆ దేవాలయ నిర్మాణం చేసినట్లుగా తెలుస్తోంది.
01-03-1828:	సర్వధారినామ సం: కలెక్టర్ గారైన ఆనస్టే(Anstey) గారికి చెప్పి, తిమ్మరాజుగారు తమ తమ్ముడు రాజన్న గారికి కాకినాడ తాలూకా ఆఫీసులో పేష్కరు పని ఇప్పించారు. తమ్ముడూ, భార్య 1834 సం. వరకూ వారింట్లోనే ఉన్నారు.
1834 :	జయనామ సం: శివరావుగారి అక్షరాభ్యాసం
1835:	మన్మధనామ సం: నాటికి శివరావుగారి తండ్రి తిమ్మరాజు గారు కాకినాడ కలెక్టర్ ఆఫీసులో ఇంగ్లీషు రికార్డ్ కీపరు గా ఉన్నారు.
1836:	దుర్ముఖినామ సం: శివరావుగారి గర్భాష్టమం[44] లో ఉపనయనము.
4- 9-1839:	వికారినామ సం. శ్రావణ బహుళ బుధవారం – శివరావుగారి చెల్లెలు మాణిక్యాంబ గారు జననం. వీరినే అమ్మాయమ్మ గారనే అనేవారు.

---

[44] గర్భాష్టమమం లో ఉపనయనం - 8 ఏండ్ల లోపు గర్భాష్టమమం అంటారు

1846 పరాభవనామ సం||ర నాటికి తిమ్మరాజు గారు కలెక్టర్ కచేరీలో హుజూర్ క్యాష్ కీపర్ ఉద్యోగం చేస్తూ, అవసరాన్ని బట్టి ఇతర ఉద్యోగాలూ నిర్వహించేవారు. గోదావరి ఆనకట్ట నిర్మాణము పథకం అంచనా లెక్కలు కలెక్టరు కచేరీలో తయారు చేశారు. ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణానికి స్పెషల్ అధికారాలతో నియమింపబడిన సబ్ కలెక్టర్ ఫోర్బ్స్ దొర కచేరీ పనులు చూచేవారు.

11- 6- 1849 సౌమ్య నామ సం: రాజన్న గారు (శివరావుగారి పిన తండ్రి) పెద్దాపురంలో అమల్దారు. ఆనకట్ట పనిలో జరిగిన ఆలస్యం గూర్చి సబ్ కలెక్టరు గారు వీరి సంజాయిషీ కోరుతూ తాకీదు పంపించారు.

08-08-1849 సౌమ్య సం: రాజన్న గారు కుటుంబ ఆస్తిలో తనకు వాటా రావాలనే వాదన వదులుకొని తిమ్మరాజు గారి పేర ఒప్పుదల ఖరారునామా వ్రాయించి ఇచ్చారు. .

1849 - 1850 : ఆనకట్ట నిర్మాణం పనులలో ఏదో ఆలస్యం పని చేశారని సబ్ కలెక్టర్ కొందరి మీద చర్య తీసుకున్నారు. తిమ్మరాజు గారికి కూడా ఒక అణా 0-1-0 జుల్మానా విధించారు. దానిపై తిమ్మరాజు గారు ఉత్తర సర్కారుల కమీషనర్ గారికి అప్పీలు చేశారు. జుల్మానా తీసివేసి, తిమ్మరాజు గారు సర్కారులలో చాలా సమర్థుడని, నీతి పరుడు అని కమిషనర్ గారు సర్టిఫికెట్ ఇచ్చారు.

09-07-1850 సాధారణ సం: జేష్ట బహుళ మంగళవారం శివరావుగారి తమ్ముడు - మా తండ్రి వెంకటరత్నం గారు అమలాపురంలో జననము.

11-08-1850 (సాధారణ నామ సం) సబ్ - కలెక్టర్ ట్రాన్స్ఫర్ అయి వెళ్ళాడు.

1850డిసెంబరు: రావు సూర్యారావు గారి మరణము. 1850 అప్పటికి వారి కుమారుడు గంగాధరరామారావు గారు మైనరు.

1851 (విరోధికృత్ నామ సం)రాజమండ్రి కలెక్టర్ ప్రెండరుగాస్టు (Prendergast) గారు తిమ్మరాజు గారిని నెలకు రూ. 250/- లు జీతం మీద పిఠాపురం ఎస్టేట్ కోర్టు ఆఫ్ వార్డ్సు(Court of Wards) మేనేజరుగా నియమించారు. తిమ్మరాజు గారి కచేరీ కలెక్టర్ ఆఫీసులో ఉండేది.

1852 (పరీధావి నామ సం: కలెక్టర్ కచేరి యాక్టింగ్ హెడ్ శిరస్తాదారుగా కూడా పనిచేయమని తిమ్మరాజు గారిని నియమించారు.

1853 (క్రోధినామ సం) పిఠాపురం ఎస్టేట్ మేనేజర్ ఆఫీసులో తిమ్మరాజు గారి చేతి కింద కందుకూరి వీరేశలింగం గారి తండ్రి సుబ్బారాయుడు గారు కూడా గుమాస్తాగా నున్నారు

21-01- 1853: మద్రాసు - పూనమల్లి మధ్య ఎలక్ట్రిక్ టెలిగ్రాఫ్ పని పూర్తయినది.

ఏప్రియల్ 1854 ఆనందనామ సం: ప్రెండర్ గాస్ట్ దొర గారిని గంజాం లో గవర్నర్ గారి ఏజెంటుగా నియమించారు.

పిఠాపురం మైనర్ రాజా వెంకట నీలాద్రి రాయణంరావు గారు చనిపోయారు. వారి తమ్ముడు గంగాధరరామారావు గారు వారసులైనారు. వారి తమ్ముడు వెంకట సూర్యనారాయణ మహీపతి గారిని బొబ్బిలి రాజాగారు దత్తత చేసుకున్నారు. వారికి సీతారామకృష్ణ రాయడప్పరంగారావు గారని నామకరణం చేశారు.

01-.10- 1854 (ఆనందనామ సం) యూనిఫారం పోస్టేజీ ప్రవేశపెట్టారు.

1854 ఆనందనామ సం: శివరావుగారు కూడా తిమ్మరాజు గారి చేతి క్రింద పిఠాపురం ఎస్టేట్ మేనేజర్ ఆఫీసులో పనిచేసినట్టు కనబడుతున్నది - పిండిప్రోలు లక్ష్మణ కవి గారి వార్షికపు కథ.

1855 (రాక్షసనామ సం) తిమ్మరాజు గారు కోరంగిలో నివేశన స్థలం కొన్నారు

14- 06- 1855: మద్రాసురైల్వే మొదటి రైలు బండి ఓడ దిగినది

13- 01- 1856: తిమ్మరాజు గారి మరణ శాసనం.

07- 02- 1856: రాక్షసనామన సం మాఘ శుద్ధ గురువారం. తిమ్మరాజు గారి మరణము

28- 06- 1856 (నల సం) మద్రాసు రైల్వే మొదటి భాగం పబ్లిక్ ట్రాఫిక్ నకు తెరచారు

06- 07- 1856: (నల సం) శివరావుగారి చెల్లె లు మాణిక్యాంబ గారు ప్రసవించారు. మేనల్లుడు సుబ్బారావు[45] గారు ఆషాడ శుద్ధ ఆదివారం రాత్రి. గం. 8-00 లకు – కాకినాడలోజననము.

24- 02-1857: మాణిక్యాంబ[46] గారి భర్త తల్లాప్రగడ వీర వెంకట నారాయణ గారి మరణము. అప్పటికి ఆవిడకు 16 సం||ల వయస్సు.

16- 03- 1858 కాళయుక్తినామ సం: కాళయుక్తి నామ సంవత్సరాది.

16-06-1858: తమ్ముడు వెంకటరత్నం గారి ఉపనయనం రావుగారు చేశారు.

23-07-1858: వెంకటరత్నం గారికి రాజమండ్రిలోని వాడ్రేవు వెంకట నరసింహారావు గారి కొమార్తె సీతమ్మ గారి నిచ్చి వివాహం చేశారు.

21-09-1860: (రౌద్రినామ సం.)నుండి 15-12-1860 వరకు శివరావుగారు జబ్బుగా ఉన్నారు.

29-12-1860: తల్లాప్రగడ సుబ్బారావు గారికి పుట్టు వెంట్రుకలు తీయించారు.

12-04-1861: దుర్మతి నామ: శివరావుగారి చెల్లెలు, మేనల్లుడు దొమ్మేరుకు బయలుదేరి, భద్రాచలం యాత్రకు వెళ్లారు

---

[45] స్వామి తల్లాప్రగడ సుబ్బారావు గారు బ్రహ్మజ్ఞానిగాను పేరు పొందిన మద్రాసు హైకోర్టు వకీలు (1856-1890)

[46] మాణిక్యాంబ గారు దిగవల్లి తిమ్మరాజు గారి ఏకైక కుమార్తె. దివాన్జీ శివరావు (1829-1892) గారికి చెల్లెలు. బ్రహ్మజ్ఞానిగా పేరుపొందిన తల్లా ప్రగడ సుబ్బారావుగారికి తల్లి

1861: గంగాధర రామారావు గారు మంగాయమ్మ రావు గారెని వివాహము చేసుకున్నారు.

31-01-1861: కలెక్టర్ పర్వీస్(Purvis) గారు పిఠాపురం ఎస్టేట్ ను గంగాధరరామారావు గారికి ఒప్పగించారు

18-03-1862: బ్బిలి రాజా శ్వేతా చలపతి రంగారావు గారు మరణము.

21-12-1862: పూజారి పేరయ్య చనిపోయాడు.

1863: బొబ్బిలి రాజా శ్వేతాచలపతి రంగారావు గారు మరణించినందువల్ల, వారి దత్తత కుమారుడు సీతారామ కృష్ణ రాయుడప్ప రంగారావు గారు (గంగాధరరామారావు గారి తమ్ముడు) బొబ్బిలి రాజా గారైనారు.

01-06-1863: రాజాగారు శివరావుగారిని శిరస్తాదారుగా నియమించారు.

1864 సం: బొబ్బిలిలో ఆంగ్లో వర్ణాక్యులర్ స్కూలును స్థాపించారు.

01-11-1864 రక్తాక్షి నామ సం: రాత్రి బందరులో ఉప్పెన వచ్చి, 35 వేలమంది దుర్మరణం పాలయ్యారు.

(చూడు-. కృష్ణా జిల్లా మాన్యువల్ -పే. 110 - 127)

1864 సం: ఇండియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్

1865: (క్రోధ నామసం) కాకినాడ జగన్నాధపురం బ్రిడ్జి, లైట్ హౌస్ తయారైనవి. ఈ బ్రిడ్జికి కావలసిన 18 గర్డర్ల (girders) లో 16 ధవలేశ్వరం వర్క్ షాపులో తయారైనవి.

1866: కాకినాడ మునిసిపాలిటీ అయినది

04-06-1866: మేనల్లుడు తల్లాప్రగడ సుబ్బారావు గారి భార్య బుర్ర్రి కలరా వల్ల మరణించారు

07-11-1866 వెంకటరత్నంగారు అన్ కవెనేటెడ్ సివిల్ సర్వీసు(Un-covenated Civil Service)[47] పరీక్షకు దరఖాస్తు పెట్టినారు.

14-06-1867: (ప్రభవ సం) వెంకటరత్నం గారు యు. సి. ఎస్. (U.C.S: Un-covenated Civil Service) ఇంగ్లీషు బ్రాంచి ప్యాసైనారు.

1868 సం: కాకినాడలో బాలికా పాఠశాలను పిఠాపురం రాజాగారు స్థాపించారు

16-01-1868: వెంకటరత్నం గారికి ప్రథమ పుత్రిక సుందరమ్మ గారు జననము

1868. విభవనామ సం: జూన్ నెల మధ్యలో శివరావుగారు, భార్య మహా లక్ష్మమ్మ గారు రామేశ్వరం యాత్రకు బయలు దేరినారు. శివరావుగారు శిరస్తాదారు గనుక పరివారముతో, పల్లకీలో, బండ్ల లో ప్రయాణము చేశారు. దక్షిణదేశములోని పుణ్యక్షేత్రాలు సేవించి, నాగ ప్రతిష్ట చేసి, తిరిగి చెన్న పట్టణము వచ్చినారు

1868: బొబ్బిలి జమీందారు సీతారామకృష్ణ రాయడప్పరంగారావు గారు (గంగాధరరామారావు గారి జనక సోదరుడు) చనిపోయినాడు.

---

[47] సివిల్ సర్వీసు లో మొదటి రకం ఐ.సి.యస్. అది ఒడంబడికకు లోబడిన సర్వీసు. రెండవ రకం అన్ కవెనేటెడ్ అంటే ఒడంబడిక లేనిది

1869: జనవరి [*దివాన్జీ శివరావు గారి*] తమ్ముడు వెంకటరత్నం గారు కాకినాడలోని హిందూ స్కూలులో చేరి, మెట్రిక్యులేషన్ పరీక్షకు చదవడం. ప్రారంభించారు.

17-12-1869: శుక్ల నామ సంవత్సర మార్గశిర శుద్ధ శుక్రవారం నాడు శివరావుగారు కాకినాడ నుండి సకుటుంబ సపరివారంగా కాశీ యాత్రకు బయలుదేరినారు. చెల్లెల్ని, మేనల్లుడిని తీసుకు వెళ్లారు. కానీ, తమ్ముని భార్య గర్భవతిగా ఉన్నందున వారిని తీసుకుని వెళ్లలేదు. వెంకటరత్నం గారు మెట్రిక్యులేషన్ పరీక్షలో కృతార్థులు. కానందున, తాము కూడా కాశీయాత్రకు బయలుదేరి అన్నగారిని కలుసుకున్నారు.

02-01-1870: శుక్లనామ సం. వెంకటరత్నం గారికి ప్రధమ పుత్ర జననము. తిమ్మరాజని నామకరణం చేశారు

1870: (శుక్లనామసం) మార్చి నెల ఫాల్గుణ మాసంలో శివరావుగారి కుటుంబం కాశీ చేరినారు

01-04-1870: ప్రమోదూతనామ సం. చైత్ర శుద్ధ శుక్రవారం నాడు ప్రయాగ చేరినామని వెంకటరత్నం గారి డైరీలో ఉన్నది.

18-06-1870: ప్రమోదూత నామ సంవత్సర జ్యేష్ట బహుళ నాడు కాశీ యాత్ర చేసి, పిఠాపురానికి తిరిగి వచ్చారు

1870(ఆగస్టు): మేనల్లుడు. తల్లాప్రగడ సుబ్బారావు గారిని హిందూ స్కూల్లో మిడిల్ స్కూల్ తరగతి (3వ ఫారం వంటిది) లో చేర్పించినారు.



24-03-1871: ప్రజోత్పత్తి సంవత్సర చైత్ర శుద్ధ శుక్రవారం కాకినాడలో శ్రీ భీమేశ్వర స్వామి వారి ధ్వజస్తంభ ప్రతిష్టాపనా మహోత్సవములు శివరావుగారు ప్రారంభించి జరిగించారు.

31-03-1871: ప్రజోత్పత్తి నామ సంవత్సర చైత్ర శుద్ధ శుక్రవారం నాడు పిఠాపురం రాజాగారు కడియం గ్రామ మకాములో నుండగా శివరావుగారు కడియం నుండి తమ కుటుంబముతో రామేశ్వరం యాత్రకు బయలుదేరినారు.

07-09-1871: బహుళ సప్తమి బుధవారం నాడు సాయంత్రము శివరావుగారి తల్లి సీతమ్మ గారు కాకినాడలోని స్వగృహములో స్వర్గస్తులైనారు.

1871(అక్టోబరు): వెంకటరత్నం గారు కాకినాడ కలెక్టర్ కచేరీలో హెడ్ అసిస్టెంట్ గుమస్తాగా ప్రవేశించినారు.

1871: లోకల్ ఫండ్ బోర్డుల చట్టం(Local Fund Act of

1871: క్రింద కలెక్టర్ అధికారిగా బోర్డు స్థాపించబడినది. జిల్లాలోని ప్రముఖులను సభ్యులుగా నియమించారు. శివరావుగారిని కూడా *(ఒక)* సభ్యులుగా నియమించారు.

1871(డిసెంబరు): తల్లాప్రగడ సుబ్బారావు గారు మెట్రిక్యులేషన్ పరీక్షలో[48] ఉత్తమ శ్రేణిలో కృతార్థులైనారు. శివరావు

---

[48] 1871 సం మెట్రిక్యులేషన్ పరీక్ష ఫలితాలు మద్రాసు విశ్వ విద్యాలయం వారు ప్రకటించిన గెజెట్ ప్రతి 10వ అనుబంధముగా చేర్చబడినది. ఈ జాబితా వరుసలో 18 వ నంబరులో

గారు ఆయనను చెన్నపట్టణములోని ప్రెసిడెన్సీ కాలేజీలో ఎఫ్. ఏ. చదివించుటకు నిశ్చయించారు.

28-12-1871: తల్లాప్రగడ సుబ్బారావు గారి తల్లి అమ్మాయమ్మ(మాణిక్యమ్మ) గారు కాకినాడ నుండి స్టీమర్ లో చెన్న పట్టణము బయలుదేరి వెళ్ళినారు.

21-02-1872: శ్రీమాన్ మాడభూషి వెంకటాచార్యులు[49] గారు నూజివీడులో శతావధానం చేశారు. నారయ్యప్పారావు *(నూజివీడు జమీందారు)* గారు సభాధ్యక్షులు. శ్రీ పిఠాపురం రాజాగారు కవిగారికి అభినవ పండితరాయలనే బిరుదునిచ్చారు. సభానంతరం కవి గారికి ఘన సన్మానం చేశారు.

26-03-1872: శివరావుగారిని పిఠాపురం రాజాగారు మేనేజర్ గా నియమించారు.

02-09-1872: అంగీరస నామ సం. మహాలక్ష్మమ్మ గారు కాకినాడలో ఉదయం గం. 8-00 వేళ చనిపోయారు. ఆరోజు శ్రావణ బహుళ సోమవారము.

11-09-1872: దిగవల్లి రాజన్న గారి దత్తత కుమారుడు రాజశేఖరుడు గారికి రాజన్న అనే కుమారుడు కలిగినాడు.

16-09-1872: అంగీరస సం. భాద్రపద శుద్ధ సోమవారం గోదావరీ పుష్కరాలు ప్రారంభము.

సుబ్బారావు గారి పేరు, 269 నంబరులో కందుకూరి వీరేశలింగం పంతులుగారి పేరు వున్నవి.

[49] శతావధాని శ్రీ మాడభూషి వెంకటాచార్యులు (1835-1895) నూజివీటి జమీందారి ఆస్థాన కవి. అనేక గ్రంథములు రచించారు

12-10-1872: అంగీరస నామ సం. ఆశ్వయుజ శుద్ధ శనివారం శివరావుగారు సర్పవరం గ్రామములోని శ్రీ భావన్నారాయణ స్వామి వారి ఆలయంలో పెద్ద సుందరమ్మ గారిని ద్వితీయ వివాహము చేసుకున్నారు.

1872: బొబ్బిలి జమీందారు సీతారామకృష్ణ రాయడప్ప రంగారావు గారి భార్య లక్ష్మీ చెల్లాయమ్మా రావు గారు వెంకటగిరి రాజా సర్వజ్ఞ కుమార యాచేంద్రులు మూడవ కుమారుడు రంగ మన్నారు కృష్ణ యాచేంద్రులు గారిని దత్తు చేసుకున్నారు. వీరు వెంకటశ్వేతా చలపతి రంగారావు అను పేరుతో 1881 సం నుండి బొబ్బిలిని పాలించారు.

04-01-1873: వెంకటరత్నంగారు కలెక్టర్ కచేరీలో గుమస్తాగా ప్రవేశించారు

1873: కాకినాడ సూర్యారావు పేటలో పిఠాపురం రాజాగారు బాలికా పాఠశాల భవనానికి శంకుస్థాపన జరిగించారు.

1873: పోస్టు కార్డులు మొదటిసారిగా పరిచయం చేయబడినవి.

28-09-1873: గంగాధర రామారావు గారు వెంకటగిరి రాజాగారి 14 సం||ల ఈడుగల రెండవకుమారుడు రామకృష్ణయాచేంద్రుల వారిని దత్తత స్వీకారము చేసుకొని, రాజా రావువెంకట సూర్యమహీపతి రామకృష్ణారావు గారు అని నామకరణం చేశారు. ఉత్సవాలు జరిపించారు.

01-10-1873: దత్తత స్వీకార పత్రిక రిజిస్టరు చేయించారు

30-05-1874: కాకినాడలో అగ్నిప్రమాదం వల్ల 200 ఇండ్లు తగులబడినవి.

16-11-1874: కాకినాడలో సబ్ కోర్టు స్థాపించారు

03-12-1874: నాళం వెంకట్రాయుడు గారు శ్రీ భీమేశ్వరస్వామి వారికి వెండి నాగాభరణం చేయించి ఇచ్చారు.

01-03-1875: వెంకటరత్నం గారు కలెక్టర్ కచేరీలో నెల 1 కి. రూ.15/-
జీతము పైన ఖాయం గుమాస్తా అయినారు

14-07-1875: రాజాగారు శివరావుగారిని మేనేజర్ గా (దివాన్ గా) నియమించారు.

14-05-1876: వెంకటరత్నం గారి జేష్ట పుత్రుడు తిమ్మరాజు గారి ఉపనయనము. బులుసు పాపయ్య శాస్త్రి గారు శివరావుగారి పట్ల గల గౌరవము వల్ల దగ్గర ఉండి చేయించారు.

15-05-1876: దిగవల్లి వెంకటరత్నంగారి పెద్దకుమార్తె సుందరమ్మగారిని మేనల్లుడు తల్లాప్రగడ సుబ్బారావు గారికిచ్చి కాకినాడలో వివాహము చేశారు.

18-07-1876. పిఠాపురం రాజాగారికి మనుమడు పుట్టాడు.

28-07-1876: రాజాగారి మనుమని బారసాల. గంగాధర రామారావని నామకరణం చేశారు

24-09-1876: పిఠాపురం రాజాగారు సూర్యారావు పేటలో *(వారి దివాన్జీ శివరావుగారినుండి)* తీసుకున్న స్థలానికి

బదులుగా శ్రీ భీమేశ్వర స్వామి[*ఆలయం నిమిత్తం*] వారికి జిరాయితీ [50]భూమికి పట్టా ఇచ్చారు.

01-01-1877: విక్టోరియారాణి ఇండియా మహారాణి అని ఢిల్లీ దర్బారులో లిట్టస్ ప్రభువు ప్రకటన చేశారు. రాజమండ్రిలో కలెక్టర్ దర్బారులో గంగాధర రామారావు గారికి - రాజా - అను బిరుదు ఇచ్చారు.

16-02-1877: రాజాగారి మనుమనికి అన్నప్రాసనము.

04-03-1877: సూర్యారావుపేట చెరువు ప్రతిష్ట.

19-07-1877: నూజివీడు ప్రభువు నారయ్యప్పారావు గారి మరణము.

21-07-1877: దిగవల్లి వెంకటరత్నం గారి ద్వితీయ పుత్రిక మహాలక్ష్మి జననము.

1877: రాజశేఖరుడు గారికి భోగరాజు అను 2వ కుమారుడు *(జననం)*.

18-08-1878: బొబ్బర్లంక లాకుకు గండి పడింది. దిగవల్లి వెంకటరత్నం గారు, [*కలెక్టరు*] ఫాస్టర్(W.S.Foster, District Collector) గారు వెళ్ళి తనిఖీ చేశారు.

08-09-1878: రాజాగారికి, వారి దత్తపుత్రునికి మధ్య ఏర్పడిన వైషమ్యములలో శివరావుగారు కుదర్చబోయిన సఖ్యత నచ్చక, రాజాగారు శివరావుగారిని నిందించి, పనిలో నుండి తొలగించారు.

08-11-1878: దిగవల్లి రాజన్న గారి 2వ భార్య అన్నపూర్ణమ్మ గారి మరణము

---

50 జిరాయితి భూమి అంటే పంట భూమి.

06-01-1879: తల్లాప్రగడ సుబ్బారావు గారు బరోడా హైకోర్టు రిజిస్ట్రారు పదవి వదిలి, చెన్న పట్టణానికి తిరిగి వచ్చారు

21-02-1879: పిఠాపురం రాజాగారి దత్తత కుమారుడు కాకినాడ నుండి చెన్న పట్టణము వెళ్లారు.

1879(మార్చిసెల): రంప పితూరీ[51].

23-04-1879: తల్లాప్రగడ సుబ్బారావు గారు మద్రాసులో గ్రాంట్ దొర దగ్గర అప్రెంటిస్ గా చేరినారు.

28-04-1879: విజయనగరం మహారాజా 3వ విజయరామ గజపతి రాజుగారు చనిపోయినారు.

29-05-1879.నుండి31-05-1879వరకు: కాకినాడలోని శ్రీ భీమేశ్వరాలయంలో అష్టబంధనము [52] పూర్తయినది.

09-07-1879: పిఠాపురం రాజాగారి మనుమనికి పుట్టు వెంట్రుకలు ఉపమాక వెంకటేశ్వర దేవాలయంలో తీయించారు.

1880: మనీఆర్డర్ విధానము ప్రవేశపెట్టారు.

01-03-1880: నుండి వెంకటరత్నంగారి డైరీలో ఉద్యోగానికి సంబంధించిన వివరాలు మాత్రము ఉన్నవి.

---

[51] రంప పితూరీ అంటే బ్రిటిష్ ప్రభుత్వమునకు వ్యతిరేకము గా రంప గ్రామంలో జరిగిన తిరుగుబాటు. చూ. శివరావుగారు రచించిన వ్యాసం ఆంధ్ర పత్రిక 1945 https://archive.org/details/20251005_20251005_0236.

[52] అష్టబంధనము దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ సమయంలో మంత్రపూర్వక పూజలు. ఎనిమిది దిక్కుల నుండీ ప్రసరించు శక్తికోసం

27-02-1882: జాన్సన్ గారు, ఆత్కూరి లక్ష్మీ నరసింహం గారు శ్రీ విద్యా శంకర భారతి స్వామిశంకరాచార్యుల వారి పైన తెచ్చిన పరువు నష్టం దావా కేసు కొట్టివేశారు

27-04-1882: చెన్న పట్టణములో దివ్యజ్ఞానసమాజము స్థాపించ బడినది. ఆర్. రఘునాధ రావు గారు అధ్యక్షుడు. తల్లాప్రగడ సుబ్బారావు గారు కార్యదర్శి.

21-05-1882: తల్లాప్రగడ సుబ్బారావు గారు మరి కొంతమంది చెన్నపట్టణము నుండి కాకినాడకు వచ్చారు

05-10-1882: శివరావుగారు శనివారప్పేట వెళ్ళినారు రాజా వెంకట్రామయ్యప్పారావు జమీందారు గారి దగ్గర మేనేజరుగా కుదిరిరి.

15-01-1883: శివరావుగారు కుటుంబంతో నిడదవోలు వెళ్ళినారు

06-02-1883: **ఆత్కూరి లక్ష్మీనరసింహంగారి కేసులో హైకోర్టు వారు విరూపాక్ష విద్యా శంకర భారతీ స్వాముల వారికి రూ. 200/- లు జుల్మానా విధించారు.**

03-03-1883: మద్రాసు గవర్నర్ గ్రాంట్ డఫ్ (Grant Duff) గారు కాకినాడకు రాక. నాలుగు రోజులు మకాం.

20-04-1884: శ్రీముఖము పోస్ట్ కార్డు మీద వ్రాసినందుకు శ్రీ శంకరాచార్యుల వారికి హైకోర్టు వారు రూ.200/- లు జరిమానా విధించారు.ILR , 6, MADRAS

01-07-1883: దిగవల్లి వెంకటరత్నం గారి కుమారుడు తిమ్మరాజు గారికి కొటికలపూడి సుబ్బారాయుడు గారి కుమార్తె నిచ్చి వివాహము చేయుటకు నిశ్చయమైనది.

12-08-1883: దిగవల్లి వెంకటరత్నంగారి 2వ కుమార్తె మహాలక్ష్మిని రాజమహేంద్రవరం కాపురస్తులు అజ్జరపు వీరయ్యగారి కుమారుడు సుబ్బరాజుగారికిచ్చి వివాహము చేయుటకు రాజమండ్రిలో తాంబూలాలు పుచ్చుకున్నారు. శివరావుగారు కూడా వచ్చినారు.

17-12-1883: విజయనగరం మహారాజుగారు మద్రాసులో టౌన్ హాలుకు శంఖుస్థాపన చేశారు. ఇదే విక్టోరియా పబ్లిక్ హాలు

31-01-1884(స్వభాను) నామ సంవత్సర మాఘ శుద్ధ రాత్రి 27ఘ.100 [*విఘడియ*] లకు ఉదయం గం 4.00 లకు మహాలక్ష్మి వివాహము జరిగినది.

1884: మార్చి శివరావుగారి పేరుతో తిరుపతిలో ఖరీదు చేసిన య.16-23 సెంట్లు భూమికి పన్ను చెల్లించవలసినదని నార్త్ఆర్కాట్ కలెక్టరు కచేరినుంచి తణుకు తాసిల్దార్ ద్వారా డిమాండ్ నోటీసు వచ్చినది. ఈ భూమి రాజాగారి కోసము ఖరీదు చేసినామని, వారే పన్నులు చెల్లించాలని శివరావుగారు జవాబు వ్రాశారు. డిమాండ్ ఆపడానికి వీలులేదని తిరిగి వచ్చిన జవాబు.

06-08-1884: వాడ్రేవు చలమయ్య గారు పిఠాపురం దివాను శివరావుగారికి రూ. 17-04 -08 లు పన్నుల నిమిత్తం మనీ ఆర్డర్ ద్వారా పంపినామని ఉత్తరం వ్రాశారు.

1884 సం: మద్రాసు లోకల్ బోర్డుల చట్టము.



భీమేశ్వరాలయంలో ధ్వజస్తంభము

10-03-1885: దిగవల్లి వెంకటరత్నం గారికి తెల్లవారుజామున కాకినాడలో సీతాపతి అనే కుమారుడు కలిగినాడు.

07-01-1885: కాకినాడలోని శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవాలయంలో ధ్వజస్తంభానికి రాగితాపడము[53] చేయించినారు.

01-04-1885: పిఠాపురం రాజాగారు హైకోర్టులో వాడ్రేవు చలమయ్య గారి పైన క్రిమినల్ కేసు పెట్టారు.21-06-

1885: పిఠాపురం రాజాగారు ఏలూరువచ్చి శివరావుగారిని. శనివారప్పేట రాజాగారి దగ్గర పనిమానుకుని, తమ దగ్గర పనిచేయమని కోరినారు. శివరావుగారు శనివారప్పేట రాజాగారి అనుమతి పొంది అంగీకరించినారు.

02-07-1885: పార్థివనామ సం. జేష్ఠ బహుళ బుధవారం రాత్రి శనివారప్పేట రాజాగారికి కిర్లంపూడి లో వివాహము జరిగినది.

---

[53] 1831 సం.లో దిగవల్లి తిమ్మరాజు గారు కట్టించిన ఈ దేవాలయం ఒక శతాబ్దము పాటు 1939సం.వరకూ ఆ వంశంవారి సంరక్షణలోనే వుండినది. 1885 సం. నాటి రాగి తాపడమును తదుపరి ఇత్తడి తాపడంగా చేసినట్లు తెలియుచున్నది. పై చిత్రంలో ధ్వజ స్తంభము ఇత్తడి తాపడం కలదిగా పాఠకులకు తెలియచేయటమైనది.

15-07-1885: వాడ్రేవు చలమయ్య గారికి [*కలెక్టరు*] ఫాస్టర్ గారు (W.S.Foster) 1 సం.రం 3 నెలలు కఠిన శిక్ష విధించారు

24-07-1885: దిగవల్లి వెంకటరత్నం గారు రెవెన్యూ హైయర్ ఎకౌంటు సహా [54]పరీక్ష ప్యాసయ్యారు.

08-08-1885: దిగవల్లి వెంకటరత్నం గారు చింతలపూడి డిప్యూటీ తహసీల్దారుగా చార్జిపుచ్చుకోడానికి కాకినాడనుండి వెళ్లిరి

.

05-10-1885. పితాపురం రాజాగారి పెద్ద భార్య మంగయ్యమ్మారావు గారు ప్రసవించినారని, వేంకట కుమారమహీపతి సూర్యారావు గారిని కన్నారని ప్రకటించారు.

14-10-1885. దిగవల్లి వెంకటరత్నం గారు బకింగ్ హామ్ కాలువ పైన చెన్నపట్టణము నకు సాయంత్రం 8 గంట లకు చేరారు.

28-10-1885 తిరుపతికి వెళ్లారు.

01-11 -1885. తిరుపతిలో తమపేర కొన్న భూమికి రాజ గారి పేరు లెక్కలలో చేర్చవలసినదని శివరావుగారు నార్త్ ఆర్కాట్ కలెక్టర్ గారికి అర్జీ పంపించినారు.

6-11-1885: దిగవల్లి వెంకటరత్నంగారు శివరావుగారికి చెన్నపట్టణం నుంచి ఉత్తరము వ్రాస్తూ, తిరుపతిభూమిని చూచినామని వ్రాశారు. Most Honoured Brother garu అని సంబోధించారు. కోడలు [కు] శాంతి చెన్న పట్టణములో జరిపించే విషయము.

---

54 సహా పరీక్ష అంటే ఎకౌంటు పరీక్షై వుండవచ్చు.

25-12-1885: శివరావుగారు నార్త్ ఆర్కాట్ కలెక్టరుగారికి వ్రాసిన ప్రొటెస్ట్ ఉత్తరం- తమకు పంపించిన కవరు మీద [*చిరునామాలో*] " గారు" అని లేకపోవడాన్ని గురించి తాము పిఠాపురం రాజాగారి మేనేజరు, లోకల్ ఫండ్ బోర్డు మెంబర్ గా నున్నామని ఇకముందు ఇలాంటి పొరపాటు జరగకూడదని వ్రాశారు.

13-01-1886: దిగవల్లి వెంకటరత్నంగారు (మద్రాసు నుండి) కాకినాడకు స్టీమర్ ఎక్కినారు.

06-02-1986: శివరావుగారు సీతాపతిని[55] దత్తు చేసుకుని ప్రసాదరావు అని నామకరణము చేశారు.

15-02-1886: తిమ్మరాజు గారు మెట్రిక్యులేషన్ పరీక్ష ప్యాసైనారు.

08-09-1886: వ్యయ నామ సం. భాద్రపద శుద్ధ బుధవారము రాత్రి గం.9.15లకు సీతమ్మగారు[*దిగవల్లి వెంకటరత్నంగారి మొదటి భార్య*] కాకినాడలో చనిపోయారు

24-10-1886: శివరావుగారి దత్తుకుమారుడు ప్రసాదరావు (సీతాపతి) పెంటపాడులో వ్యయనామ సంవత్సర ఆశ్వయుజ శుద్ధ ఆదివారము సాయంత్రం 7 గం.లకు చనిపోయినాడు.

31-12-1886: మద్రాసు పార్కుఫెయిర్ లో అగ్నిప్రమాదం 400కు పైగా కాలిపోయినారు. ఇంకాకొందరు మరణించారని వార్త.

---

55 వెంకట రత్నం గారి మొదటి భార్య ఆఖరి కుమారుడు సీతాపతిని దివాన్జీ శివరావు పంతులు గారు దత్తు చేసుకుని ప్రసాదరావు అని పేరు పెట్టారు

గంగాధర రామారావు గారి పిన తండ్రి కుమారుడు కోలంక వీరవరం జమీందారు రావు సూర్యారావు గారు రాజమండ్రిలో చనిపోయారు.

25-03-1887: సర్వజిత్ నామ సం. దిగవల్లి వెంకటరత్నంగారు[56] సూర్యమాణిక్యాంబ గారిని (మా తల్లి గారు) ద్రాక్షారామంలో వివాహము చేసుకున్నారు. చైత్ర శుద్ధ శుక్రవారం సర్వజిత్ నామ సంవత్సరాది.[*నాడు*] పెంటపాడు లో గృహప్రవేశము

.05-05-1887: దిగవల్లి వెంకటరత్నం గారు కొత్తపేట డిప్యూటీ తహసీల్దారుగా చార్జి తీసుకున్నారు.

01-01-1888: శనివారప్పేట రాజా వెంకట్రామయ్యప్పారావు గారు ఏలూరులో చనిపోయినారు.

24-05-1888. విక్టోరియా మహారాణి జన్మదినము.

19-08-1888: రావు సూర్యారావు గారి భార్య చెల్లాయమ్మారావు గారు కోలంక- వీరవరం జమీందారిణి శివరావుగారిని(నెలకు రూ.75/- లు జీతముపై [*సంస్థానం*] మేనేజరుగా నియమించారు.

01-04 -1889 విరోధి నామ సంవత్సరాది హిందూ ఇంగ్లీషు పత్రిక. దినపత్రిక గానూ వారమునకు మూడుసార్లు ప్రకటించుచున్నారు.

---

56 దివాన్ శివరావుగారి తమ్ముని (రచయిత తండ్రిగారి) ద్వితీయ వివాహం

13-05-1889: విరోధి నామ సంవత్సర వైశాఖ శుద్ధ సోమవారం నాడు దిగవల్లి శివరావుగారి షష్టిపూర్తి మహోత్సవం కాకినాడలో స్వగృహంలో వైభవముగా జరిగింది.

27-06-1889: తల్లాప్రగడ సుందరమ్మ గారికి జబ్బు చేసినది.

04-07-1889: చెన్న పట్టణములో దివ్యజ్ఞాన సమాజ సభ్యులు తల్లాప్రగడ సుబ్బారావు గారి స్నేహితులు డాక్టరు కుక్ (Dr. Cook)గారిని తిమ్మరాజుగారు కాకినాడకు తీసుకువచ్చారు .

15-07-1889: తల్లాప్రగడ సుబ్బారావు గారు, తిమ్మరాజు గారు , డాక్టర్ కుక్ గారు చెన్నపట్టణం వెళ్ళినారు.

16-12-1889: పిఠాపురం రాజావారు తమ ఎస్టేట్ ను వేంకట కుమార మహీపతి సూర్యారావు[57] గారికి చెందజేస్తూ,వీలునామా వ్రాశారు.

01-05-1890: శివరావుగారికి కాకినాడలో ఇన్ఫ్లుయంజా ఫ్లూ జ్వరము వచ్చినది

7-10-1889 : చెన్నపట్టణములో తల్లాప్రగడ సుబ్బారావుగారు చాలా జబ్బుగానున్నారని తెలిసి ,చెన్నపట్టణానికి ప్రయాణమైనారు.

20-06-1890: బెజవాడలో కృష్ణ దాటి తాడేపల్లి లో ఉదయం 7 గం.ల 15 నిలకు రైలు ఎక్కి, వినుకొండ,కంభం, నంద్యాల, గుత్తి మార్గంద్వారా ప్రయాణం చేశారు

---

[57] గంగాధరరామారావు గారి ఔరస పుత్రుడు


24-06-1890: వికృతి నామ సంవత్సర ఆషాడ శుద్ధ సప్తమి. మంగళవారము ఎగ్మూరులో రంగపిళ్ళ బంగళాలో సుబ్బారావు గారు చనిపోయినారు

11-07-1890: పిఠాపురం దత్తుడు(రాజాగారి దత్తత పుత్రుడు) గారు శివరావుగారిని, కుటుంబము వారిని పరామర్శించారు.

18-07-1890: శివరావుగారి కుటుంబము చెన్నపట్టణము నుండి బకింగ్ హం కాలువ పైన పడవలో తిరిగి ప్రయాణం చేశారు. బుడిద వాకం ప్రళయ కావేరి దగ్గర ఒక తోటలో బస చేశారు.

21-07-1890: శెట్టిపేట, చంగల్ రాయుడు సత్రం 50 మైళ్ళు.

22-07-1890: పిఠాపురం రాజా గంగాధరరామారావు గారు కాకినాడలో చనిపోయినారు.



31-07-1890: కృష్ణానదిని చక్రాల బోటులో[58] దాటి బెజవాడ చేరినారు.

13-08-1890: పిఠాపురం దత్తునికి చెన్నపట్టణములో మూడవ కుమారుడు కలిగినాడు.

24-08-1890: పిఠాపురం దత్తుడుగారు కాకినాడకు వచ్చినారు.

29-08-1890: మద్రాసు అటార్నీ గ్రాంటు గారు కాకినాడలో స్టీమర్ దిగినారు

---

[58] పెద్ద బోటులకు చక్రాలు వుండినట్లు తెలియుచున్నది. మోటారు బోటులలో స్టీరింగు చేయుటకు చక్రాలు.

07-09-1890: దిగవల్లి వెంకటరత్నం గారు పిఠాపురం[*రాజాగారి*] దత్తుని దర్శించినారు.

11-09-1890: దిగవల్లి వెంకటరత్నంగారు ఆలమూరు డివిజన్ తహసీల్దారుగా చార్జి తీసుకున్నారు

01-10-1890: మద్రాసు గవర్నర్ ఈస్ట్ కోస్ట్ రైల్వే లైను బెజవాడలో ప్రారంభించినారు.

14-10-1890: నవరాత్రులు ప్రారంభము. కాకినాడలో పిఠాపురం రాజాగారి పశువులు వేలం వేసినారు.

22-11-1890: **కాకినాడ సబ్ జడ్జి శ్రీ రేకం మనవాళ్లయ్యగారిని లంచములు పుచ్చుకుంటున్నారని సస్పెండ్ చేశారు**

12-12-1890: వికృతి నామ సంవత్సర కార్తీక బహుళ... దిగవల్లి రాజశేఖరుడు. గారు చనిపోయినారు.

07-02-1891: శనివారము మధ్యాహ్నము దిగవల్లి వెంకటరత్నం గారు ఆలమూరు నుండి పోలీసు ఇన్స్పెక్టర్ బోటులో కాకినాడకు బయలుదేరినారు

08-0 2-1891: కాకినాడకు చేరినారు. సాగరాల అమావాస్య[59]

11-02-1891: శివరావుగారు స్టీమర్ లో చెన్నపట్టణమునకు వెళ్లడానికి సిద్ధపడి గాలిసరిగా లేనందున వెళ్లలేదు

13-02-1891: స్టీమర్ ఎక్కి వెళ్ళినారు.

18- 02-1891: కాకినాడ సబ్ జడ్జి మన వాళ్ళయ్యకు 18 నెలలు శిక్ష. అందులో 3 నెలలు సోలిటరీ కన్ఫైన్మెంట్, రూ.1000/-లు జరిమానా విధించారు.

---

[59] సాగరాల అమావాస్య గోదావారి జిల్లాలో పాటించే చొల్లంగి అమావాస్య లాంటిదే

01-04-1891: పిఠాపురం దత్తుడుగారు రాజమండ్రి జిల్లా కోర్టులో 0.5.6/91 నెంబరు దావా దాఖలు చేశారు.

23-03-1892. ఖర నామ సంవత్సర ఫాల్గుణ బహుళ బుధవారము ఉత్తరాషాడ నక్షత్రము రోజున దిగవల్లి వేంకట శివరావుగారు మధ్యాహ్నం 1.00 గంటలకు కాకినాడలోని స్వగృహములో చనిపోయినారు.

అనుబంధము-1

పిఠాపురం కైఫియ్యతు[60]

(Local record Vol xix p 46)

జల్లూరు పరగణే ప్రోలునాడు తాలుకే కైఫియ్యతు



Mackenzie (Colin Mackenzie 1754-1821) Manuscript prepared evidently in the year 1814 quoted in గద్య చింతామణి. It shows that Reddys were ruling the country both sides of Godavari[61] వేమారెడ్డి గారి ఏలుబడిలో ప్రోలునాడు,శీలపాకనాడు, కాకినాడ

[60] కైఫియతు అనగా ఒక సంగతి, వివరణము circumstance. 19వ శతాబ్దములో మొదటగా మనదేశములో బ్రిటిష్ కంపెనీ కాలం లో కైఫియత్తులు తయారగుటకు శ్రీకారం చుట్టిన దొర కొలిన్ మెకంజీ

[61] రచయిత శివరావుగారి వివరణ

కోలిన్ మెకంజీ (1754–8 May 1821)

మూడమున్న మట్టిపిల్లి వారు అనే కమ్మవారిని జమీందారీగా కాయపరచబడినది.

అప్పుడు జల్లూరు గ్రామాము ప్రోలునాడు సీమలో వెల్లుతూ ఉండేది. ఈ కుటుంబములో అన్నదమ్ములు కలహించి చచ్చిరి. మిగిలినవారి వల్ల తాలూకా పని నిర్వాహకం కానందున కాకినాడ, ప్రోలునాడు, శీలపాకనాడు యీ మూడు సీమలకు జమీందారీగా వెలమదొరలైన చిట్నీడి ధర్మారాయణిం గారికి యిచ్చినారు. ఆయన తరువాత ఆయన కుమారులు, మనుమలు దొరతనం చేస్తూ ఉండిరి. చిట్నీడి రాయణిం



గారికి పుత్ర సంతతి లేనందున మేనల్లుళ్లు అయిన రావు తెలుగు రాయణిం గారిని దగ్గర ఉంచుకొనిరి.

అదివరకు సుల్తాన్ అబ్దుల్ హసన్ కుతుబ్ ముల్క్ గారు(1626-72) తాలూకాను గురించి పైకము పాలికలకు బాకీ ఉంటే వాయిదా పాయిదా వేసుకుని దానికి రావు తెలుగు రాయణం గార్ని జామీను ఇస్తూ చిట్నీడి రామారాయణంగారు దొరతనం చేస్తూ ఉండిరి.

రావు తెలుగు రాయణిం గారికి ఏడుగురు కుమాళ్లు. వీరు చిట్నీడి వారి స్థలంలో శ్యామనకోట గ్రామంలో గృహాలు కట్టుకుని వుండేవారు. ఈ ఏడుగురు కొమారులలో వెంకట కృష్ణరాయణంగారు గోల్కొండ సుల్తాన్ అబ్దుల్ హసన్ ఉల్ ముల్కుగారి దగ్గర రెండు వేల మంది తోటి సర్దారీ కొలువు చేస్తూ వుండేవారు. వారు జబ్బు చేసి మూడు నెలలు సెలవు పుచ్చుకొని ఇంటికి వచ్చిరి. మూడు నెలలు దాటినది. తమ్ముడు గోల్కొండ వెళ్ళగా దర్బార్ లో వారిని నిందించినారు. అంతట ఆయన బాకుతో పొడుచుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అంతట సుల్తాన్ గారు వెంకటకృష్ణ రావు గారిని హుజూరికి పిలిపించిరి. ఈ లోపుగా రావు తెలుగు రాయణం గారు జగన్నాథ యాత్రకు వెళ్లి చనిపోయిరి. చిట్నీడి రామారాయణం గారు చామర్లకోటలో చనిపోయిరి. అంతట సుల్తాన్ గారు చిట్నీడి రామారావుగారు కాలం చేసినారు. గనుక కాకినాడ, ప్రోలునాడు, శలపాకనాడు, మూసనాళ్లు రావు వెంకటకృష్ణా రావు గారికి జమీందారీగా ఇచ్చినారు. ఆయన వచ్చి అన్నగారైన చంద్రాయణం గారికి పట్టాభిషేకం చేసిరి. ఆయన తర్వాత రావు వంశంవారి జ్ఞాతులు దొరతనం చేస్తూ వుండిరి. రావు వెంకట కృష్ణారాయణం గారి దొరతనంలో హాజీ హుస్సేన్(రుస్తుం జా)పైన తిరుగుబాటు. జ్ఞాతి యైన బుచ్చన్న గారితో మన్యమునకు పోయిరి. బుచ్చన్న గారి తల కొట్టిరి. బుచ్చన్న గారి కుమారులు చిన్న మాధవరాయణం గారు 3 సంవత్సరాలునూ, ఆయన తరువాత పెద వెంకట మహీపతి రావు గారు 20 సం.లు దొరతనం చేసినారు. తరువాత వీరి జ్ఞాతి నీలాద్రి రాయణం గారు 12 సంవత్సరాలు దొరతనం చేసిరి. 1794-1828 సం.*(మధ్య)* వరకు పాలించిన వెంకట నీలాద్రి రాయణం గారు బుచ్చి వెంకట్రాయణం గారి కొమాళ్ళు.

అనుబంధము-2

పిఠాపురం సంస్థానం

రాజమండ్రి సర్కారులో కాకినాడ, ప్రోలునాడు, శెలపాక,పరగణాలతో కూడిన పిఠాపురం పురాతన సంస్థానము. పిఠాపురం, సామార్లకోట, కరప మల్లవరం, పలివెల, కడియం అను ఆరు ఠాణాలు. అనంతర కాలమున ఇతర సంస్థానాల నుండి అనంతవరము,పోలవరము ఏజెన్సీ, వీరవరము, పట్టిసం, తోటపల్లి మొదలైనవి ఎస్టేటు [*వారు*] ఖరీదు చేసి సంస్థానంలో కలిపినారు. చివరి జమీందారు గారి హయాంలో అమలాపురం, ఉత్తరార్కాటు, చోడవరము, తుని రాజమండ్రి ప్రాంతంలోని అనేక గ్రామాలు ఖరీదు చేయబడినవి. పూర్వము 128 గ్రామాలు గల సంస్థానము 168 గ్రామాల దైనది. వైశాల్యము 400 చ.మై. పోలవరంతో కలిపి 743 చదరపు మైళ్ళు. ఇంచుమించు మూడు లక్షల జనాభా. రాబడి 12 లక్షలు. పేష్కస్సు 2 1/2 లక్షలు.

1881సం. నాటి జనాభా 1,84,018. 1871సం. నుండి 24 వేలు తగ్గినది. అప్పటి ఆదాయము 7 1/2 లక్షల రూపాయలు. పిఠాపురం కాకినాడకు పది మైళ్ళు. పిఠాపురము, సామర్లకోట, విలస మల్లవరం, పలివెల, కడియం అను ఆరు ముఠాలుగా పరిపాలన జరుగుచున్నది. మచిలీపట్నం చీఫ్ కు లోబడిన సంస్థానాల స్థితిగతులు విచారించడానికి నియమింప బడిన సర్క్యూట్ కమిటీ వారు పిఠాపురం కంపెనీ రాజ్యంలో చాలా సాగుబడి గల జమీందారీ అని 1787సం.లో వ్రాశారు.

కాకినాడ దగ్గర జగన్నాధపురం, ఒలాందలనే దచ్చి వారి కింద ఉన్నది. వారు జగన్నాధపురం, గొల్లపాలెం, గుండవరం గ్రామాలను

పిఠాపురం రాజు గారి వారి వల్ల కౌలు పొంది వ్యాపారం చేస్తున్నారు. జగన్నాధపురం లో ఫ్యాక్టరీ పెట్టారు. ప్రతియేటా లక్ష వరహాలు, బంగారము, రొక్కము, సుగంధ మసాలా దినుసులు తెచ్చేవారు. అందులో 40వేల వరహాలు కేవలం ఛాయ బట్టలను కొని ఎగుమతి చేయడానికే వినియోగించేవారు. ప్రయివేటు వర్తకులు డెల్టాలో తయారయ్యే ముదుక, సన్నరకాల నూలు వస్త్రాలు ఎగుమతి చేసేవారు. సన్నని లాంగ్ క్లాత్ తాను 20 వరహాల ఖరీదుండేది. అది మంచి ధర. ఈ ప్రాంతాలు ఇంగ్లీషు వారికి లోబడిన తరువాత డచ్చి వారీ గ్రామాలకు వారికి క్విట్ రెంటు చెల్లించేవారు. అయితే 1787సం. నాటికి కూడా కాకినాడ దగ్గర ఉప్పుటేరు దగ్గర ఎగుమతుల పైన నూటికి 5 వంతులు దిగుమతుల పైన మూడు వంతులు సుంకములు వసూలు చేసేవారు. ఏ అధికారాన్ని బట్టి చేసేవారో తమకు తెలియడం లేదని 1787సం.లో సర్క్యూటు కమిటీ(circuit committee) వారు వ్రాశారు. అప్పట్లో పిఠాపురం రాజాగారు కాకినాడలో ఎగుమతి దిగుమతుల సరుకుల పైన సాయరు సుంకము వసూలు చేస్తూ ఉన్నారు. ఈ స్థితిలో డచ్చివారు కూడా వసూలు చేయడం అక్రమమని అన్నారు. (Godavari District Manual 203-4)


1787సం.లో మొగల్తుర్రుకు పేష్కస్ బాకీని జప్తు చేసి 1791సం.లో కంపెనీ రాజ్యంలో కలుపుకున్నారు. అప్పట్లో కంపెనీ వారు ఈ సంస్థానాల ఆదాయంలో 2/3 వంతులు పేష్కస్సు గా, 3 సం.లకు 5 సంవత్సరాలకు నిర్ణయించి వసూలు చేసేవారు.

1794సం. లో ఉత్తర సర్కారులు జిల్లాలుగా విభజించి నప్పుడు పెద్దాపురము, పిఠాపురము సంస్థానాలను గోదావరి నది వరకు గల ప్రదేశము ఒక డివిజన్ గా చేసి కలెక్టర్ కచేరిని కాకినాడలో పెట్టారు.

సామర్లకోటలో సైన్యమున్నందున కాకినాడలో కలెక్టర్ ఉన్నందువలన ఈ సంస్థానాలకు ఊపిరి తిరిగేది కాదు. అందువల్ల అణగి యుండేవారు. సామర్లకోటలో 1786 సం.లో బారకీచులు[62] నిర్మించి రెండు పటాలాల సిపాయిల దళముల నుంచారు.

1802సం||లో సంస్థానాధిపతుల ఆయుధబలమును, అధికారాలను తీసివేసి వారిని కేవలం పెద్ద భూస్వాములుగా చేసి శాశ్వత పేష్కస్సు చెల్లించే జమీందారీ సన్నదు లివ్వడంతో పెద్దాపురం, పిఠాపురం మొదలైన సంస్థానాధిపతులు జమీందారులు అయినారు. వారు ముఠాలు కొన్న ప్రొప్రైటర్ల స్థితికి దిగిపోయినారు

ఉప్పు- సురేకారము పన్నులు, సాయరు, అబ్కారి ఎక్సైజ్ మొతర్ఫా, సంతలు, బజార్లు మార్కెట్లు పైన పన్నులు జమీందారులు వసూలు చేయకూడదు. ఇనాములు పైన వారికి అధికారం లేదు.



1802సం.లో పిఠాపురం జమిందారు గా వున్న రావు

[62] బారకీచులు; సైనిక శిబిరములు(army barracks)

వేంకట నీలాద్రిరావు[63] గారి హయాము నాటికి 128 గ్రామాలు న్నవి. సాలు ఆదాయము 4 లక్షలుగా అంచనా వేసి అందులో 2 2/3 లక్షలు పేష్కస్సు గా నిర్ణయించారు.

నీలాద్రిరావు గారు చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. పెద్దాపురం సంస్థానం వారు, ఇతరులు ఋణములు చేసి పేష్కస్సు బాకీ పడగా వారి గ్రామాలు వేలంకాగా నీలాద్రి రావు గారు (1)ఖండవల్లి (2) అత్తిలి (3) కొవ్వూరు (4)ముని కొడవలి(5) భీమనపల్లి (6) పోడూరు(7) పెనుగొండ(8) గొల్లప్రోలు ముఠాలను కొని జమీందారీని వృద్ధి చేశారు. పెద్దాపురం సంస్థానం తాలూకు (1)వీరవల్లి పాలెము, (2)నగరం, (3)అన్నదేవరపేట ప్రక్కిలంక,(4) కిర్లంపూడి, (5)పెనుగొండ పోడూరు, (6)దొంతమూరు జగ్గంపేట, (7)బెండమూర్లంక ముఠాలు కొని బంధువులకు ఇచ్చారు.

1822సం. సెప్టెంబరు 1వ తేదీన మద్రాస్ గవర్నర్ సర్ థామస్ మన్రో గారు ఉత్తర సర్కారులలో పర్యటించినప్పుడు నీలాద్రి రావు గారు దర్శించినారు. తమ జమీందారీలో యావత్తు శిస్తులు రొక్కము లోనే వసూలు చేస్తామనిన్నీ సాధారణంగా మూడు సంవత్సరాలకొక మారు గ్రామాధికారుల లేక పెత్తందారుల(Head of the Village)తోగానీ రైతులతో గాని అమరకం ఏర్పాటు చేస్తామని గవర్నరు గారికి చెప్పారు.(Minutes of SirThomas Munro24-01-1823)

---

63 *[పై ఛాయాచిత్రం పిఠాపురం కోటనుండి లభ్యమైనది. ఇది గంగాధర రామారావుగారి తాతగారైన నీలాద్రిరాయణంగారు (జీవిత కాలం1775(1778)-1828). వీరినే రావు వేంకట నీలాద్రిరావు గారని వ్రాతప్రతిలోనూ, వికీపీడియాలోనూ ప్రకటించబడియున్నది. పరిపాలనాకాలం 1793-1828 ----------------సంపాదకుల వివరణ]*

పిఠాపురం సంస్థానంలో చిరకాలం నుంచి 'పంతువారడి' అనే అమరక పద్ధతి అమలు జరుగుతున్నది. ప్రతి గ్రామానికి చెల్లవలసిన[*వర్తించిన]* శిస్తును రాజుగారి ఉద్యోగులు గ్రామ అధికారులతో సాధారణంగా మూడు సంవత్సరాలకు ఒకసారి ఏర్పాటు చేస్తారు. గ్రామంలోని భూములకు ఆయా రైతులు చెల్లించవలసిన శిస్తు గ్రామాధికారులు నిర్ణయిస్తారు. ఒక రైతు పొలానికి అయిన[*శిస్తు]* అలాంటి ప్రక్క రైతు పొలానికి [*అయిన శిస్తు*] కన్నా హెచ్చు శిస్తు నిర్ణయించినట్లు తోస్తే ఆ ప్రక్కవాని పొలానికి తాను హెచ్చు శిస్తు చెల్లిస్తానని సవాలు చేయవచ్చును. అప్పుడు ఆ పక్క రైతు పొలానికి ఆ హెచ్చు శిస్తు కట్టుకొనాలి. లేదా ఫిర్యాదీ పొలానికి తగ్గించాలి లేదా ఆ పొలాలను ఉభయులు మార్చుకోవాలి. ఈ ఆచారము గోదావరి జిల్లాలోని ఇతర గ్రామాలలో కూడా ఉన్నది. దీనిని కొందరు కలెక్టర్లు విమర్శించారు కానీ 1845-1854సం. మధ్య కలెక్టర్ గా ఉన్నప్రెండర్ గాస్ట్(Prendergast) గారు ఇది న్యాయమైన ఆచారమని ప్రజలు భావిస్తున్నారని, భూమిశిస్తులను గురించి పెద్ద తగాదాలు రాకుండా పరిష్కరించడానికి ఇది మంచి మార్గం గానే ఉన్నదని ది5-03-1850వ తేదీన ఉత్తర సర్కారుల కమిషనర్ కు వ్రాశారు.

రావు వెంకట సూర్యారావు గారు ది.27-11-1850వ తేదీన చనిపోగా కోర్ట్ అఫ్ వార్డ్స్ క్రింద కలెక్టర్ తిమ్మరాజు గారిని ఎస్టేట్ మేనేజర్ గా నియమించిన తరువాత 1862సం.లో గంగాధరరామారావు గారికి ఎస్టేట్ స్వాధీనమైన తర్వాతను కూడా ఈ ఆచారం అమలు జరిగినది.

వెంకట నీలాద్రి రావు గారు 1778సం.లో జన్మించారు. 1793సం.లో జమీందారైనారు. 1828 సం.లో చనిపోయారు. అప్పటికాయన

కుమారుడు వెంకట సూర్యారావు గారు ఐదు సం.ల వారు. అందువల్ల ఎస్టేటును కలెక్టరు అన్ స్టే(Anstey) గారు Court of Wards క్రిందకి తీసుకున్నారు. 1841సం.లో సూర్యారావు గారికి యుక్త వయసు వచ్చినది గాని అప్పటి కలెక్టర్ జి.ఎ. స్మిత్తు(G.A.Smith) గారు ఎస్టేట్ స్వాధీన పరచలేదు. ఆయన మైనారిటీలో మామగారు, బావగారు మేనేజ్ మెంటులో ఋణము చేసినారని కంపెనీ ప్రభుత్వానికి 98,691-07-10 పేష్కస్సు బాకీ పడినారని కిర్లంపూడి దావా పైసలా కాలేదని సాకు చెప్పారు. పేష్కషుకు , మొతర్ఫా కూడా చేర్చి బాకీ చూపుతున్నారని, ఈ బాకీ కావటానికి కంపెనీ వారే బాధ్యులనీ జమీందారు గారు గవర్నమెంటు కు విన్నపం చేశారు.

సర్ హెన్రీ మాంట్గోమెరి(Montgomery) గారు విచారించి ఏడు ముఠాలు తప్ప మిగిలిన ఎస్టేటును స్వాధీనం చేయవలసిందని సిఫారసు చేశారు. ఆ ప్రకారము ముని కొడవలి, కొవ్వూరు, పెనుగొండ, భీమునిపల్లి, పోడూరు ముఠాలున్నూ మరి రెండు ముఠాలూ గవర్నమెంట్ క్రింద వుంచుకుని మిగిలిన ఎస్టేటు స్వాధీన పరిచారు. సూర్యారావు గారు ది27-11-1850వ తేదీన చనిపోయినారు. ఆయన పెద్ద కుమారుడు వెంకట నీలాద్రి రాయనింగారు మైనరైనందున కలెక్టరు ప్రెండర్ గాస్టు (Prendergast)గారు Court of Wards కింద తీసుకొని దిగవల్లి తిమ్మరాజు గారిని 1851సం.లో ఎస్టేట్ మేనేజర్ గా నియమించారు.

నీలాద్రిరాయణిం గారు 1854సం.లో అకాలమరణం పొందగా తమ్ముడు వెంకట మహీపతి గంగాధరరామారావు గారు వారసులైనారు. ఆయన మైనరైనందున ఎస్టేట్ యధాప్రకారం కోర్ట్ అఫ్ వార్డ్సు తరఫున ఎస్టేట్ మేనేజరు గారి క్రిందనే వుంచారు. గంగాధరరామారావు గారు 1844సం. లో జన్మించారు. ఆయనకు యుక్త వయస్సు రాగా ది. 31-

01-1862న తేదీన కలెక్టర్ పర్వీస్(Purvis) గారు ఎస్టేటునూ, నాలుగు లక్షల నిలువ రొక్కమును, 3 లక్షల గవర్నమెంట్ పత్రాలతో స్వాధీనపరిచినారు.

వెంకట సూర్యారావు గారి మూడవ కుమారుడునూ గంగాధరరామారావు గారి తమ్ముడైన వెంకట సూర్యనారాయణ మహీపతి గారిని 1854సం.లో బొబ్బిలి జమిందారైన శ్వేతా చలపతి రంగారావు బహద్దరు గారు (1810-1862) దత్తు చేసుకుని సీతారామకృష్ణ రాయడప్ప రంగారావని నామకరణం చేశారు. ఆయన భార్య ఇనుగంటి వారి ఆడపడుచు, లక్ష్మిచెల్లాయమ్మగారు. బొబ్బిలి రాజాగారు 1862సం.లో చనిపోగా ఈ రాయడప్పారంగారావు గారికి 1863సం.లో యుక్త వయస్సు రాగా జమీందారైనారు . ఈయన 5 సంవత్సరాలు పాలించి 1868సం. లో చనిపోయారు. ఆయన ఇచ్చిన దత్తత ఆనుజ్ఞతతో భార్య వెంకటగిరి రాజా సర్వజ్ఞ కుమార యాచంద్రుల వారి మూడవ కుమారుడు రంగమన్నారు కృష్ణ యాచంద్రుని 1871సం.లో దత్తు చేసుకుని రావు వెంకట శ్వేతా చలపతి రంగారావు గారని నామకరణం చేశారు. ఈయన 1881 సం.లో యుక్త వయసు వచ్చి జమీందారై సర్. బిరుదు పొందారు. 1893సం.లో ఐరోపా పర్యటన చేసి విక్టోరియారాణిని దర్శించారు. మద్రాసు శాసనసభ్యులుగా నున్నారు. లక్ష్మీచెల్లాయమ్మగారు వంగరాష్ట్ర కఱవులో 1000 గరిసెల ధాన్యం విరాళముగా యిచ్చినందులకు గవర్నమెంట్ వారు ఆమెకు 1876సం.లో రాణి అనే బిరుదునిచ్చారు



ఇప్పుడున్న పిఠాపురం కోటగేటు

గొల్లప్రోలు

గంగాధరరామారావు గారి ఇంకొక తమ్ముడు వెంకట్రావు గారు. వీరు వెంకట సూర్య రావు గారి నాలుగో కుమారుడు. వీరికి జీవనాధారం నిమిత్తం అన్యాక్రాంతం చేయకుండా అనుభవించే పద్ధతిని గంగాధరరామారావు గారు గొల్లప్రోలు ఎస్టేటుని ఇచ్చారు. దీని ఆదాయం 60 వేలు. పేష్కస్సు 12 వేలు. ఇందులో ఇసుకపల్లి, గొల్లప్రోలు, భోగాపురం అని మూడు గ్రామాలు ఉన్నవి. వెంకట్రావు గారు 4-11-1871 తేదీన చనిపోయారు. ఆయన భార్యలైన రామాయమ్మ, వెంకాయమ్మ గార్ల పేర ఎస్టేట్ రిజిస్టర్ అయినది. వెంకాయమ్మగారు 1889సం. చనిపోగా రామాయమ్మ గారే హక్కురాలైనారు.

రామాయమ్మగారు తన చెల్లెలు కుమారుని దత్తు చేసుకొనగా. తమతో సంప్రదించలేదని గంగాధరరామారావు గారు దత్తు రద్దు చేయమని దావా తెచ్చినారు. దానిని కోర్టు వారు కొట్టి వేశారు. వెంకాయమ్మ గారు 1889సం. లో చనిపోయిన తరువాత ఆమె వాటా తమకు రావాలని ఇంకొక దావా వేసినారు. గానీ దానిని కూడా కోర్టువారు కొట్టివేశారు.

కోలంక-వీరవరము

రావు వెంకట నీలాద్రి రావు గారి కుమారులు (1)వెంకట సూర్యరావు గారు (2) వెంకట మహీపతి రాయణిం గారు. వీరిద్దరి తల్లి బొబ్బిలి కాపురస్తులైన చెలికాని రామారాయణిం గారి కుమార్తె భావయాంబ గారు. వెంకట సూర్యారావు గారు (1804-1850) మహీపతి రాయణిం గారి జీవనం నిమిత్తం గొల్లప్రోలు పరగణాలోని తొమ్మిది గ్రామాలను కోలంక ముఠా అనే పేరుతో ఇచ్చారు. రావు మహీపతి రాయణం గారి కుమారుడైన సూర్యారావు గారికి వారి పితామహి భావయాంబ గారు వీరవరం ఇచ్చారు. అందువల్ల ఈ సూర్యరావు గారు కోలంక వీరవరం జమీందార్లయ్యారు. ఈ సూర్యరావు గారి భార్య చెల్లాయమ్మ గారు. భర్త గారు 1887సం. జనవరిలో చనిపోగా ఆమె జమీందారిణి అయినారు. ఈమె చాలా ధర్మాత్మురాలు. కుమార మహీపతి రావుగారిని దత్తు చేసుకున్నారు. భార్య రామాయమ్మ గారు. కుమార మహీపతి రావు గారు బాల్యంలోనే చనిపోగా రామాయమ్మ గారు 1932సం. లో అప్పటి వెంకటగిరి రాజా సర్వజ్ఞ కుమార కృష్ణ యాచేంద్రుల వారి కనిష్ట సోదరులు ప్రద్యుమ్న కృష్ణ యాచేంద్రులను దత్తు చేసుకున్నారు. ప్రద్యుమ్నకృష్ణ మహీపతి సూర్యారావు అని నామకరణం చేశారు. 1838సంలో వీటి రాబడి రూ1,43,647. పేష్కస్సు రూ.37000

కిర్లంపూడి

వెంకట నీలాద్రి రావు గారు (1778- 1828). ఈయన 1793సం. నుండి 1828సం. వరకు పిఠాపురం జమీందారుగా ఉన్నారు. వీరు మొదట ఇనుగంటి చిన చిన్నరాయణిం గారి కుమార్తె వెంకట రమణయమ్మను వివాహం చేసుకున్నారు. పిల్లలు కలుగలేదు. అంతట తమతోడి అల్లుడు

చిత్రాడ కాపురస్తులు రావు వెంకయ్య గారి కుమారుని దత్తుని గా స్వీకరించి తమ తండ్రిగారైన బుచ్చి వెంకట రాయణిం గారి పేరు పెట్టారు. ఆ బాలుడు అకాల మరణం పొందగా మరల అతని సోదరుడైన బుచ్చి తమ్మయ్య గారిని దత్తు చేసుకున్నారని (భార్య గారు వాదించారు) లేదని వెంకట నీలాద్రి రావు గారు సర్ థామస్ మన్రో గారితో చెప్పారు. (1822 సెప్టెంబరు)

నీలాద్రిరావు గారికిని వెంకటరమణయమ్మగారికిని సరిపడనందున ఆమె గారు పిఠాపురం వదిలి దత్తపుత్రునితో తమ పుట్టిల్లు గోరస గ్రామానికి వెళ్లి దత్తపుత్రుని పేరు కలెక్టర్ చేత ఎస్టేట్ వారసునిగా రిజిస్టర్ చేయించి భరణం నిమిత్తం దావా వేశారు. ఈ స్థితిలో ఆయన రెండో భార్యకు వెంకట సుర్యారావు గారని ఔరస పుత్రుడు పుట్టినాడు. ఈ సంగతులు కూడా మన్రో గారికి చెప్పి కలెక్టర్ గారు తమకు తెలియకుండా పేరు రిజిస్టర్ చేయడం అక్రమమని నీలాద్రిరావు గారు అన్నారు. (Minutes of Sir Thomas Munroe 24/01/1823). వెంకట రమణమ్మ గారు పెద్దాపురం వారికి చెందిన కిర్లంపూడి ముఠాను ఖరీదు చేశారు. ఈ బుచ్చి తమ్మయ్య గారి భార్య బుచ్చి సీతాయమ్మ గారు. వారి కుమార్తె ఇనుగంటి వెంకటనరసింహారావు గారి భార్య.

అనుబంధము-3

గోదావరి జిల్లా జమీందారీలు[64]

(1) 1769సం.నాటి గోదావరి జిల్లా జమీందారీలు

మన్యం జమిందారీలు	ఇతర జమిందారీలు
పోలవరం	పెద్దాపురం
రంప	పిఠాపురం
	కోట-రామచంద్రపురం
	మొగలితుర్రు

(2)శాశ్వత ఫైసలా (1802సం.) నాటి గోదావరి జిల్లా జమీందారీలు

(Godavary District Mannual p280)

పురాతన జమీందారీలు		అప్పటి ఆదాయం	నిర్ణయమైన పేష్కస్సు
1. పెద్దాపురం	వత్సరాయి రాయజగపతి రాజు గారు	974623	667817
2. పిఠాపురం	రావు వెంకట నీలాద్రిరావు గారు	392182	258979
3. పోలవరం	రెడ్డి లక్ష్మీనారాయణ దేవు గారు	199853	105700
4. కోటరామచంద్రపురం	జగన్నాధ రాజు గారు	178902	124596

[64] పిఠాపురం సంస్థానానికి సంబంధించినవి కీ.శే. దిగవల్లి వేంకటశివరావుగారి అప్రకటిత గ్రంథం -ఆంధ్రుల చరిత్ర ఆధారములు నుంచి ప్రకటించబడినది

5. వేగాయమ్మ పేట

6. వెలంపాలెం

7. వెంకటాయపాలెం

8. వెల్ల

9. వోణంగిపల్లి

9. తెలికచర్ల

10. జాలిమూడి

11. ఉండేశ్వరపురం

12.ముక్కామల

13. విలస, జానువల్లి

14. బంటుమిల్లి

(3)ప్రొప్రైటరీ ఎస్టేటులు

రాజమహేంద్రవరం	పెనుగుదురు
కొవ్వూరు	పేరూరు
వీరవాసరం	కాజ
మొగలితుర్రు	గుణుపూడి
ఉండి	సఖినేటిపల్లి
బెండమూర్లంక	నాగులపల్లి
కాపవరం	మురారి
రాఘువేంద్రపురం	దొడ్డిపట్ల
పెనుగొండ	అమలాపురం (అమర్చింది అమన్న)
తణుకు	చాందాడ

ఆచంట	సిద్ధాంతం
అత్తిలి	దువ్వ
నీలపల్లి	ఉప్పాడ

కిర్లంపూడి

వెంకట నీలాద్రి రాయణిం గారు (1770 -182)

ఈయన 1793 నుండి 1828 వరకు పిఠాపురం జమీందారు. ఇనుగంటి చిన్న బుచ్చి రామయ్య గారి పుత్రిక వెంకట రామాయ్యమ్మగారని వివాహం చేసుకున్నాడు. పిల్లలకలుగలేదు. తోడేల్లుడు చిత్రాడ కాపురాస్తులు రావు వెంకయ్య గారి పుత్రుడుని దత్తతగా స్వీకరించి తమ తండ్రి బుచ్చి వెంకటరాయణి గారి పేరు పెట్టారు. ఆ బాలుడు అకాల మరణం చెందగా మరల అతని సోదరుడైన బుచ్చితమ్మయ్యని దత్తత చేసుకున్నారు. కొంతకాలానికి నీలాద్రిరావు గారికి ని వెంకటరామాయ్యమ్మ గారికిని సరిపడలేదు. రాణి గారు పిఠాపురం వదలి దత్తపుత్రుని తీసుకుని తమ పుట్టిల్లు గోరస గ్రామమునకు వెళ్లినారు[65]. ఈమె పెద్దాపురం వారికి చెందిన కిర్లంపూడిని ఖరీదు చేశారు.

---

65 See the minutes of St Thomas Monroe 1823: refers to the interview of NiladriRao and his complaint about his wife

అనుబంధము-4

శివరావు పంతులు (1829-1892) గారి కుటుంబ సభ్యులు

కుటుంబములో 3 తరాలుగా వస్తున్న పేర్లు, వారి జీవిత కాలం

పేరు	తరం1	తరం2	తరం3
తిమ్మరాజు	1794-1856	1870-1936	1915-1985
వెంకటరత్నం	1850-1908	1899-1964	1936-2010
వేంకటశివరావు	1829-1892	1898-1992	1964-

1. తిమ్మరాజు [1] (1794-1856): దివాన్జీ శివరావు(1829-1982) గారి తండ్రి . రచయిత శివరావు (1898-1992) గారి తాత గారు
2. వేంకటశివరావు[1] (1829-1892) వీరు మొదటి తరం శివరావుగారు ఈ సంపుటిలో ప్రస్తావించిన పిఠాపుర దివాన్జీ. రచయిత శివరావుగారి పెదతండ్రి
3. వెంకటరత్నం[1] (1850-1908): వీరు మొదటి తరం వెంకటరత్నం గారు. తిమ్మరాజు గారి ద్వితీయ పుత్రుడు రచయిత శివరావు(1898-1992) గారి తండ్రి
4. వేంకటశివరావు [2] (1898-1992) వీరు రెండవ తరం శివరావుగారు. ఈ సంపుటి రచయిత. దివాన్జీ శివరావుగారి తమ్ముని కుమారుడు

5. మాణిక్యాంబ (అమ్మాయమ్మ): దిగవల్లి తిమ్మరాజు (1794-1856) గారి ఏకైక కుమార్తె. దివాన్జీ శివరావు(1829-1892) గారి చెల్లెలు. బ్రహ్మజ్ఞాని తల్లాప్రగడ సుబ్బారావుగారి తల్లి. రచయిత శివరావుగారి మేనత్త

6. తిమ్మరాజు [2] (1870-1939) : వీరు రెండవ తరం తిమ్మరాజు గారు. వెంకటరత్నం గారి కుమారుడు- ఉయ్యూరు దివాన్ గా సేవలందించారు.

7 సుందరమ్మ [1]: దివాన్జీ శివరావు(1829-1892) గారి భార్య


8. సుందరమ్మ[2] వెంకట రత్నం గారి ప్రధము కుమార్తె. బ్రహ్మ జ్ఞాని తల్లాప్రగడ సుబ్బారావు(1856-1890) గారి భార్య

9.తల్లాప్రగడ భాస్కర తిమ్మరాజు(1890-1908): తల్లాప్రగడ సుబ్బారావు గారి దత్తత పుత్రుడు. వీరికి తిమ్మరాజు[2](1872-1939) గారి కుమార్తె సీతామహాలక్ష్మి(బుల్లెమ్మ) నిచ్చి వివాహం చేశారు. కానీ వీరు 1908 లోనే అకాలంగా మరణించగా భార్య జీవితాంతం వైధవ్యం అనుభవించి వృద్ధాప్యంలో తన తమ్ముడు (వెంకటరత్నం[2] 1899-1964)) గారి కుమారుని దత్తత చేసుకున్నారు.

10. వేంకటశివరావు[3](1964-) వీరు 3వ తరం శివరావు. రచయిత శివరావుగారి మనుమడు. అమెరికా వాస్తవ్యుడు. ఈస్టు టెన్నిసీ స్టేట్ యూనివర్సిటీలో ఫార్మకాలజి ప్రొఫెసర్. గూగుల్ స్కాలర్


అనుబంధము-5

దివాన్జీ శివరావు పంతులుగారు పిఠాపురం రాజాగారి పేర వ్రాసిన భూమి పట్టా https://archive.org/details/1885-.



అనుబంధము -6

దిగవల్లి వంశ వృక్షము -1వభాగము



దిగవల్లి వంశవృక్షం -2భాగం

(సహ సంపాదకుని వంశవృక్ష సమన్వయం)

రాజులు గారు(మూలపురుషునికి 3వ తరం క్రింద)

సూరన్న (1700-) వానప్ప(1704-1764)

జోగిరాజు వెంకయ్య

శేషాచలం రామలింగం(1764-1850)

లక్ష్మయ్య

శేషాచలం తిమ్మరాజు(1794-1856)

వెంకట రత్నం------- జోగిరాజు వెంకట రత్నం(1850-1908)

అప్పారావు శేషగిరిరావు[66] వేంకటశివరావు(1898-1992)

వెంకట సూర్యసత్యనారాయణ(1928-1966) రామచంద్ర (1943-)

(ఈ సంపుటి సంపాదకులు)

వేంకట చంద్రశేఖర రావు(1956) (ఈ సంపుటి సహ సంపాదకులు)

కమల బిందు(1979)

శరత్ చంద్ర(1988)

---

[66] విజయవాడలో ఆధ్యాత్మిక సంస్థ వ్యవస్థాపకులు. వారు రచించిన 3 ప్రముఖ పుస్తకములు English Translation of ప్రాణాయమము, యోగ సాధన, జ్ఞానేశ్వరి భగవద్గీత. వీరు రచయిత శివరావు(1898-1992)గారి సమకాలీకులు

అనుబంధము-7

పిఠాపురం రాజుల వంశ వృక్షం (పరిపాలనా కాలం1793-1890) పిఠాపురం-కిర్లంపూడి-కోలంకవీరవరం వెంకటగిరి- బొబ్బిలి- గొల్లప్రోలు సంస్థానాధీశుల సంబంధ బాంధవ్యాలు) ..

వెంకట నీలాద్రిరావు(1793-1828)

రావు వెంకట సూర్యారావు(1844-1850)

- నీలాద్రిరావు
- గంగాధర రామారావు(1863-1890)
- సూర్యనారాయణ మహీపతి(బొబ్బిలి రాజాకి దత్తుడు)
- రావు వేంకటరావు (గొల్లప్రోలు జమీందారు)

గంగాధర రామారావు(1863-1890):

- రావు వేంకట సూర్య మహీపతి రామకృష్ణారావు (దత్తపుత్రుడు)
- రావు వేంకట కుమార మహీపతి సూర్యారావు(1906-48) (ఔరస పుత్రుడు)

NOTES:- (1) వెంకట నీలాద్రిరావు గారు(1778-1828) - పిఠాపురం రాజా(1793-1828). వీరు కిర్లంపూడి ఇనుగంటి చిన బుచ్చి రాయణం గారి అల్లుడు(రమణమ్మగారి భర్త) పిల్లలు కలుగలేదు. చూడు పుట163. కోలంక వీరవరం ముఠాలను కొన్నారు. అప్పటి వారి భార్య(భావయాంబ గారి) వల్ల కలిగిన కుమారులు వెంకట సూర్యారావు కోలంక వీరవరానికి వారసులైనారు. వివిరణకు చూడు పుట 164.

(2) 1851సం.లో గంగాధరరామారావు వెంకటగిరి రాజా 2వ కుమారుడైన సర్వజ్ఞకుమార యాచేంద్రుని దత్తత చేసుకుని వెంకట సూర్య మహీపతి రామకృష్ణారావు బహద్దర్ అని పేరు పెట్టారు


(3) 1854 సం లో గంగాధరరామారావు గారి తమ్ముడు వేంకట సూర్యారావుని బొబ్బిలి రాజా దత్తత చేసుకుని సీతారామకృష్ణ రాయుడప్ప రంగారావు అని నామకరణం చేశారు

(4) 1871 సం. లో బొబ్బిలి రాణి లక్ష్మీచెల్లాయమ్మా రావు(సీతారామకృష్ణ రాయుడప్ప రంగారావు భార్య) వెంకటగిరి రాజాగారి 3వ కుమారుడైన రంగమన్నారు కృష్ణయాచేంద్రుని దత్తత చేసుకుని రావు వెంకట శ్వేతాచలపతి రంగారావు అని నామకరణం చేశారు.

(5) గంగాధర రామారావుగారి ఆఖరి తమ్ముడు వెంకట రావుగారికి గొల్లప్రోలు ఎస్టేటును ఇచ్చినారు (చూడు పుట161)

అనుబంధము -8

1871 సం.పు మెట్రిక్యులేషన్ పరీక్షాఫలితాల జాబిత- గెజెట్ ప్రకటన



FORT ST. GEORGE GAZETTE, SUPPLEMENT.

TUESDAY EVENING, FEBRUARY 28, 1871.

DIEU ET MON DROIT

UNIVERSITY OF MADRAS.


The following Candidates have passed the Matriculation Examination, held in December last :—

Rank.	Register Number.	Names.	Different Schools, at which Educated.
		FIRST CLASS.	
1	33	Home, W. A.	Bishop Corrie's Grammar School, Madras.
2	[illegible]	V...raghava Chari, C.	Patcheappa's High School, Madras.
3	[illegible]	Pattabi Ramaiyar, C. R.	Provincial College, Combaconum.
4	[illegible]	Gopalaswami, T. V.	Do. do.
5	237	Smith, H. W.	Normal School, Madras, and Private Study.
6	312	Vitheanatha Aiyar, R.	Provincial College, Combaconum.
7	28	Ince, T. S.	Civil Military Orphan Asylum and Bishop Corrie's Grammar School, Madras.
8	513	Subrayalu, A.	Zillah School, Cuddalore, and Presidency College, Madras.
9	975	Varada Chariar, V.	Presidency College, Madras.
10	256	Venkatesa Aiyar, S. S.	Zillah School, Salem.
11	544	Lakshmana Rau, G.	Provincial School, Bellary.
12	300	Chakravarthi, R.	Provincial College, Combaconum.
13	593	Rama Rau, K.	German Mission School, and Provincial School, Mangalore.
14	1220	Narayana Menon, K.	Rajah's School, Ernakolam.
15	648	Samuel Thambi Durai, M.	S. P. G. A.-V. School, Vepery, Madras.
16	1118	Kristna Rau, G.	High School, Bangalore.
17	564	Bhimasana Rau, P.	Provincial School, Bellary.
18	203	Suba Rau, T.	Zillah School, Kurnool.
19	307	Strinivasa Aiyar, C.	Provincial College, Combaconum.
20	322	Kristna Rau, P. S.	Zillah School, Cuddalore, and Provincial College, Combaconum.
21	309	Strinivasa Aiyar, T. V.	Provincial College, Combaconum.
22	851	Narasima Chari, K.	Presidency College, Madras.
23	875	Smith, A. J.	Doveton Protestant College, Madras.
24	302	Jayaram Aiyar, A.	Provincial College, Combaconum.
25	405	Andrew, E. F.	Presidency College, Madras.
26	585	Mangesh Rau, R.	German Mission School, and Provincial School, Mangalore.
27	1131	Venkataswami, M.	Taluq School, Trivalore, and Provincial College, Combaconum.
28	298	Narayanaswami, A. C.	Provincial College, Combaconum.
29	1214	Chandrasekera Aiyan, S.	Rajah's School, Ernakolum.
	334	Hensman, E. S.	Church Mission Seminary, Jaffna, and Provincial College, Combaconum.
	748	Palpanaba Aiyan, S	High School, Trevandram.
32	342	Jambunatha Aiyar, V.	Provincial College, Combaconum.

ఇంటర్నెట్ ఆర్కైవ్సు లో పూర్తి జాబితా చూడగలరు https://archive.org/details/madras-university-1871-batch-of-maతల్లాప్రగడ సుబ్బారావుగారు 18వ స్థానం, కందుకూరి వీరేశలింగం గారు 269 స్థానం

అనుబంధము -9

తూర్పు గోదావరి జిల్లా పఠము- పిఠాపురం సంస్థానంలోని కొన్ని గ్రామాలతో



పై పటములో పిఠాపురం, పరిసర గ్రామాల పేర్లు ఇచ్చట చూచుట సాధ్యపడదు. ఇ-పుస్తకముగా వెలువడిన ఈ సంపుటిలో చూడవచ్చును. ఈ సంపుటిలో ప్రస్తావించిన కొన్ని ముఖ్యమైన ప్రాంతాలు, గ్రామాలు అలనాటి సంస్థానంలోనివే కాక తదితర జమీందారీ ప్రాంతాలవికూడా జాబితాగా ఈ క్రింద ప్రకటించబడినవి.

సంపుటిలో ప్రస్తావించబడిన ప్రాంతాలు(సంస్థానంలోనివి)


కాకినాడ సర్పవరం అరట్లకట్ట మొగల్తూరు	కడియం రాజమండ్రి ధవళేశ్వరం తాటిపర్తి	మల్లవరం పిఠాపురం సామర్లకోట ఉండూరు	పవర అయినవిల్లి కొత్తపేట పలివెల
కిర్లంపూడి వీరవరం కాపవరం కొత్తపల్లి	శానపల్లంక చంద్రంపాలెం చిత్రాడ రమణయ్యపేట	గన్నవరం అమలాపురం ఉప్పాడ అమీనాబాద్	జల్లూరు హుస్సేన్ పురం ఫక్రుద్దీన్ పాలెం దొమ్మేరు
తోటపల్లి ఎస్టేట్ బొబ్బర్లంక కొవ్వూరు పెద్దాడ	పాచిపెంట లక్కవరం		

<u>ఇతర సంస్థానాలు జమీందారీలు, ఇతర ప్రాంతాలు:</u>

బొబ్బిలి, పెద్దాపురం, కోలంక-వీరవరం, తిరువాన్కూరు, ఉత్తర ఆర్కాటు, వెంకటగిరి, విజయనగరం, నూజివీడు, రంప, శనివారప్పేట, మొగల్తూరు, పోలవరం, పాచిపెంట, లక్కవరం, చల్లపల్లి, మాడుగుల, వనపర్తి, సాలూరు, ఉండ్రాజవరం, ఎర్నగూడెం, కపిలేశ్వరపురం, ముత్యాల, ఉయ్యూరు, పాపన్నపేట, కురుపాం, చెన్నపట్నం, విశాఖపట్నం, తిరుపతి, గణపవరం, నిడదవోలు, అనకాపల్లి, ఏలూరు, తణుకు

అనుబంధము-10[67]

రచయిత శివరావుగారికి శ్రీ చెళ్ళపిళ్ళ వారి లేఖ[68]- అసలు ప్రతి, నకలు



రచయిత శివరావుగారికి ది.19-11-1944 వ తేదిన శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు వ్రాసిన లేఖ:

శ్రీమత్పరదేవతాయై నమః

క్షీరసాగరం ఆదివారం

19-11-44

మ.రా.రా దిగవల్లి శివరావు గారికి - ఆశీః

అయ్యా, మా తిరుపతి శాస్త్రి గారి చిరంజీవిని[69] మీ దర్శనమునకు పంపుతున్నాను. విషయము వీడెత్మతో[70] [*వీడాత్మతో*] మనవి చేయును. ఉపకరింప గోరెదను

చిత్తగించవలెను

వేం|| శా, శతావధాని

---

[67] ఈ సంపుటిలో రచయిత చెళ్ళపిళ్ళ వారిని చాలా సార్లు ప్రస్తావించారు. వీరిరువురి సన్నిహిత సంబంధము తెలియచేయుటకై శ్రీ చెళ్ళపిళ్ళ వారు రచయితకు వ్రాసిన ఒక లేఖ ప్రకటించబడినది

[68] రచయిత శివరావుగారి ఆప్తమిత్రులు డా. ఘంటసాల సీతారామశర్మగారికి శ్రీ చెళ్ళపిళ్ళ శాస్త్రిగారు తమ వార్ధక్య అవస్థలనుగూర్చి వ్రాసిన మరొక పెద్ద లేఖ చూ. శివరావుగారి జ్ఞాపకాలు2వ భాగము పుట 107,110.

[69] తిరుపతి శాస్త్రిగారి చిరంజీవి: దివాకర్ల వేంకట శాస్త్రిగారు (జంటకవులలోఒకరైన తిరుపతి శాస్త్రిగారు దివాకర్ల వేంకటావధానిగారి పినతండ్రి).

[70] విడె తమతో అని సరళమైన లేక సులభమైన పదంగా గ్రహించవచ్చు

........సంపాదకుని వివిరణ

(2) ఈ సంపుటి పుట 175లో ప్రస్తావించబడిన శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట

శాస్త్రిగారి పద్యం- నకలు

శా.	వీరస్వామి యనంగ నేనునుగుల సద్వి
	ఖ్యాత వంశంబునన్ ధీరోదాత్త గుణో
	త్తరుండు గుణ వర్ధిష్ణుండు జన్మించి కా
	శీ రామేశ్వర ముఖ్య యాత్రలను
	సేవించి యా సేవలోఁ
	జారిత్రంబును వ్రాసెనయ్యవి
	గనన్ సంతోష మొప్పారెడిన్

(యాత్రలో అని పాఠాంతరం)

తే.గీ	హితులతోడను తన పురోహితులతోడ
	భార్యతోడను మరి పరివార జనులతో సు
	మారు నూర్వురతోడ ధూర్వహుండు
	సల్పె నేన్గుల మంత్రి యనల్పయాత్ర

ఉ.	ఏ దినమందునెయ్యెడల నెట్టివిశే
	షములుప్పతిల్లెనా

యాదినమందు నయ్య

వి మహామహుడా సచివోత్తముండు మ


ర్యాదలతోడ సర్వమును

వాడుక భాష   లిఖించి పెట్టె, దా

నేదియు వీడకా

	చరితమెంతయు సంతసమయ్యె జూచితిన్

పై పద్యానికి[71] అసలు ప్రతి




[71] రచయిత శివరావుగారు 1941 సం సంకలనంచేసి ప్రచురించిన ఏనుగుల వీరాస్వామయ్య గారి కాశీయాత్ర చరిత్ర అను పుస్తకమును శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు చదివి పద్యం రచించి రచయితకు పంపినారు. ఈ పుస్తకమును ఇంటర్నెట్ ఆర్కైవ్సులో చూడగలరు.

అనుబంధము-11

కాకినాడ పట్టణములో క్రీ.శే. దిగవల్లి తిమ్మరాజు పంతులు గారు 1828, 1831 సం.లలో కట్టించిన శ్రీ త్రిపురసుందరీ సమేత భీమేశ్వరాలయంలోని శిలాశాసనాలు(చూడు ఈ సంపుటి పుట 35)


(1)మొదటి శిలాశాసనం:



మొదటి శిలాశాసనం క్రీ.శ. ది18-10-1828 (శా.శ 1750) మంటప నిర్మాణము

పై శిలాశాసనానికి శుద్ధ ప్రతి:

శ్రీమదఖిల జగజ్జేగీయ్యమాన శ్రీ త్రిపురసుందరీ సమేతులై కాకినాడలో వేంచేసియున్న శ్రీ భీమేశ్వర స్వామివారికి శాలివాహన శకాబ్దములు ౧ ౭ ౫ ౦(1750) యగు నేఁయి వర్తమాన వ్యవహారిక చాంద్రమాన సర్వాధారి నామ సంవత్సర ఆశ్వీజ శు ౧౦ (10) స్థిరవాసరమున కౌండిన్యస గోత్రోత్భవుడైన దిగవల్లి వెంకయ్య యొక్క పౌత్రుడున్నూ రామలింగముయొక్క పుత్రుడున్నూ అయిన తింమ్మరాజు కట్టించి సమర్పించిన శిలామయ మంటపము శ్రీ శ్రీ శ్రీ శ్రీ



(2) రెండవ శిలాశాసనం: ది15-03-1831తేదీన (శాలివాహన శకాబ్దము1753 ఖరనామ సం. జయవారం) గోపుర ప్రాకారాలను కట్టించినటుల తెలియుచున్నది

పైన చూపిన శాసనముయొక్క శుద్ధ ప్రతి:

"శ్రీమదఖిల జగజ్జేగీయ్యమాన శ్రీమత్త్రిపుర సుందరీ సమేతులైన కాకినాడ లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వర స్వామి వార్కి శాలివాహన శకాబ్దములు ౧ ౭ ౫ ౩ **(1753)** నేటి వర్తమాన వ్యవహారిక చాంద్రమాన ఖరనామ సంవత్సర చయిత్ర శు ౧ జయవారము (గురువారము) **(15** మార్చి **1831)**[72] శ్రీమత్కౌండిన్య గోతృద్భవుండైన, నాపస్తంభసూత్రుండును శ్రీ దిగవల్లి కులాంబుధి సుధా కరుడు నాగువమ్మాఖ్య ధర్మపత్ని సమేత వేంకయ్య మాత్య పౌత్రుండును, సీతామాఖ్య ధర్మపత్ని సమేత రామలింగ పుత్రుండును సకల సుధ విధేయుండునగు తిమ్మరాజు నామధేయుండ శ్రీమచ్ఛాశ్వత స్థితి యోగ్య శాలామయ శ్రీముఖ్యాలయ జగజ్జన్యాలయ శ్రీకళ్యాణ మండప శ్రీ గోపుర ప్రాకారాదులు నిర్మాణము చేయించి సమర్పించెను

శ్రీ సాంబశివార్పణమస్తు

72 శాలివాహన సం. 1753 నకు 78 కలిపిన వర్తమాన క్రీస్తు శకం 1853.

అనుబంధము-12

పిఠాపురం పర్యటనలో సహ సంపాదకుడు శ్రీ దిగవల్లి వేంకట చంద్రశేఖర రావుగారు సేకరించిన ఛాయాచిత్రములు



19వ శతాబ్దములో రాజా గంగాధరరామారావుగారు కాకినాడలో త్రవ్వించిన మంచినీటి చెరువు. రాజా ట్యాంకు పేరుతో ఇప్పటికినీ పట్టణానికి మంచినీటి సరఫరా చేయు మూలాధారముగానుండిన రాజాగారికి స్మారక చిహ్నము. ట్యాంకు చుట్టూత నడక మార్గలాతోనూ, పిల్లల జారుడు బల్లలోతోనూ పార్కులాగ అబివృద్ధి అయి కాకినాడ పట్టణవాసులకు నిత్య ఉపయోగముతో అలరారుతున్నది.


పిఠాపురం కోటలో కీ.శే. రాజా గంగాధర రామారావు గారి మనుమడు శ్రీ రత్నాకరరామారావు గారితో సహ సంపాదకుడు, శ్రీ దిగవల్లి వేంకట చంద్రశేఖరరావుగారు





దిగవల్లి తిమ్మరాజు పంతులుగారు 1820సంలో ఇంగ్లీషు రికార్డుకీపరుగా ప్రవేశించి 1850సం నాటికి హుజూర్ శిరస్తాదారుగానూ, పిఠాపురం సంస్థానానికి కోర్టు ఆఫ్ వార్డ్సు మేనేజరుగాను(Court of Wards Manager) పనిచేసిన గోదావరి జిల్లా కలెక్టరు కార్యాలయము. -ఈ నాటి ముఖ ద్వారం. అలనాడు నిర్మించిన కార్యాలయ ప్రధాన భవనం (క్రింది ఛాయాచిత్రం)





రాజా గంగాధరరామారావు గారి కుమారుడు రాజా వెంకట కుమారమహీపతి సూర్యారావు బహద్దర్ (పరిపాలనా కాలం1906-1948) విద్యాబివృద్ధికి చేసిన ఆర్థిక సహాయంతో కందుకూరి వీరేశలింగం పంతులుగారు రాజమహేంద్రవరంలో స్థాపించిన హితకారిణి పాఠశాలకు నిర్మించిన ఈ భవనం 27-11-1911 తేదిన ప్రారంభమైనదని రచయిత శివరావుగారు తమ సాహిత్య జీవితం[73] సంపుటి పుట 33లో ప్రస్తావించారు.





పిఠాపురం రాజా గంగాధర రామారావుగారు 26-04-1873 నాడు శంకుస్థాపన చేసి భవనమును కట్టించి స్థాపించిన చిరస్మరణీయమైన బాలికల పాఠశాల భారత దేశములో పురాతన చారిత్రాత్మక విద్యాసంస్థ: ఈనాటి P.R. COLLEGE (చూడు పుట 96)

---

[73] రచయిత శివరావుగారు 1911సం నుండీ 1916సం. వరకూ చదువుకున్న హితకారిణి పాఠశాల భవనం. ఆనాటి రాజమహేంద్రవరం విశేషాలు చాలా ప్రస్తావించిరి (చూడు శివరావుగారి జ్ఞాపకాలు1వ భాగం,పుట67-83)

ప్రస్తావించబడిన దొరలు(పుట సంఖ్యతో)

ప్రస్తావించబడిన ప్రముఖులు

(పుట సంఖ్యతో)

ప్రస్తావించబడిన కవి పండితులు

(పుట సంఖ్యతో)

ప్రస్తావించబడిన సంస్థానాధీశులు, జమీందార్లు(పుటసంఖ్యతో)

(ముందు తరంలోని వారి పేర్లు కొన్ని క్రొత్త తరంలోనుండుటవలనూ, దత్తతవలన మారిన పేర్లు, పిఠాపురం, పరిసర సంస్థానాధీశుల పేర్లు కూడ ఈ సంపుటిలో ప్రస్తావించియుండటవలననూ సంక్లిష్టత అధికమగుటచేత ఈ జాబితాలో ముఖ్యమైన కొద్దిమందికి మాత్రమే వివరణ ఇచ్చుట సాధ్యపడినది. జాబితాలోని అన్ని పేర్లకు పూర్తి వివరణలకు సంబంధిత పుటలలో చూడగలరు)

వీరికి ఈ పేరు పెట్టారు 1881నుండీ బొబ్బిలి రాజాగా నుండిరి

వెంకట్రామయ్యప్పారావు,111,139,144 శనివారప్పేట జమీందారు

వేంకట కుమార మహీపతి సూర్యారావు,: గంగాధర రామారావుగారి ఔరస పుత్రుడు

సీతారామకృష్ణ రాయుడప్ప రాంగారావు,42,86,109,135157: బొబ్బిలిరాజా, శ్వేతా చలపతి రావు గారికి దత్తత పుత్రుడు (గంగాధర రామారావుగారి తమ్ముడు. అసలు పేరు వెంకట సూర్యనారాయణ మహీపతి)

సర్వజ్ఞకుమార యాచేంద్ర బహద్దర్,110,135,157,: వెంకటగిరి రాజాగారి 2వ ఔరస పుత్రుడు. వీరిని గాధరరామారావుగారు దత్తత చేసుకునిరి.

ప్రస్తావించబడిన పారిభాషిక పదాలు(పుట సంఖ్యతో)

అంగరఖా, 55: పైన ధరించు పొడుగు కోటు

అందలము,68 : రెండు ప్రక్కలా తెరిచియుండిన పల్లకీ

అంబర్ హౌనా,62 : సువాసననిచ్చు ద్రావణం

అంబారీ,59,67 : ఏనుగుపై కూర్చొను ఆసనము

అణా, 37,108,126: రూపాయలో 16వ వంతు

అపత్నీకులు, : భార్యలేనివారు

అప్రతి గ్రహీత,103 : దానాలు ఆశించని వారు

అబ్కారి,40,153: సారాయి పై పన్ను

అభిచారక్రియలు,45 : మంత్రతంత్రములతో కూడిన ప్రతిక్రియలు

అమరకము(అమరకం),48,74,76,154,155 , : భూమి శిస్తు నిర్ణయించే పద్ధతి

అమీన్,32: చిన్న ప్రదేశములపై న్యాయాధిపతి , ఉద్యోగి.

అమల్ దారీ, అమల్దారు,28,31,32,34,38,126: రెవెన్యూ పని, రెవెన్యూ పనిచేసే ఉద్యోగి

అర్జీలు,33,48,51,118 : ఏదైనా కోరుచూ లేదా అనుమతి కోరుచూ ప్రభుత్వానికి సమర్పించు దరఖాస్తు

అష్టబంధనము,138: విగ్రహ ప్రతిష్ఠ లేక మంత్రపూర్వక పూజలసమయంలో 8 దిక్కులా శక్తిచే బంధించుట

ఇలాయిల చుట్టలు,54,63: రాత్రిపూట వెలిగించు పెద్ద కాగడాలకు తగిలించు నూలు చుట్టలు

ఉప్పాడ జరీ,66: ఉప్పాడ గ్రామంలో తయారుకాబడే జరీ, వస్త్ర అంచులకు చెమ్కీ

ఉమ్మేదువారీ,27,30,66 ఉమ్మేదువాలి, :పని నేర్చుకునేవారు

ఉటంకించు: ప్రస్తావించు

ఎకసెక్కె,102: ఎగతాళి

ఔరస పుత్రుడు,5,113,145,160,169 : తను జన్మనిచ్చిన పుత్రుడు

కరవాలము,85: ఖడ్గము

కలికితురాయి, 67: శిరోవేష్టము, తలపాగాపై పక్షి ఈకతో చేసిన అలంకరణ

కలుపు వ్రాత, 33: అక్షరములను కలుపుతూ వ్రాయుట

కమ్మిపరచు,40 : పద్దులు తారుమారు లేక తోలగించుట చేయుట

కాయిలా,28: అనారోగ్యము

కార్పణ్యము, 70: కసి , విరోధము

కిలత్,85 : బహుకరణార్ధము ఇచ్చు వస్త్రము

కుండలము,105: పండితుల చెవులకు ధరించు ఆభరణం

కైజారు,67: కత్తికి తొడుగు, వర

కెయిజర్ ఈ హింద్,87: హిందూ దేశానికి మహా రాణి

కోడిగలు, 64: ఒక రకమైన ఆభరణాలు

కోరా సైను, 63: ఒకరకమైన ముతక చేనేత వస్త్రము

కోలాలు, 54: ఇనప కడ్డీలు

ఖజానా, 30: ధనాగారము

ఖరారునామా, 28,126: వప్పంద పత్రము

ఖాయం గుమస్తాలు,46: శాశ్వత ఉద్యోగులు

గర్డరులు, 14,79,130 : ఇనప దూలాలు

గరిసెలు,:86,157 ధాన్యం కొలతకు కొలమానము గరిసె- 2 బస్తాలు

గర్భాష్టమము, గర్భాష్ఠకము,32 : 8 సం లలోపల చేయు ఉపనయనము

గవిసెనలు,67 : ఏనుగులకు పైన కప్పు వస్త్రము

గుంట ఓనమాలు, 33:ఇసుకపై లేదా నేల పై వ్రాసి అక్షరములను నేర్చుకొను పద్ధతి

గోష్వారా (Abstract), గోష్వారా లెక్కలు,49,50,: సంగ్రహపు లెక్కలు

గ్రామయాదాస్తు, 50: గ్రామానికి ఆదాయనిచ్చే ఆస్తులు

గొర్రెల ఖండె,106 : ఏలేరు నదీ పాయ పేరు

చడావులు,55 : పాదరక్షలు, చెప్పులు

చరువులు,64 : స్త్రీలు తలకి అలంకరించుకునే ఆభరణాలు

చాకళ్లు,54,65: పల్లకీ లేదా మేనా ఇరుపైపుల (వెంట) నడచు వారు

చావడి, 62: వరండా

చేరపీటలు,119 : వెనక్కి జార్ల బడి కూర్చొనే పీటలు

చోపుదారులు,68: దారి చూపు వారు

ఛాయ బట్టలు,152 , : రంగు బట్టలు

జమాబందీ,40: రెవెన్యూ అధికారులు క్రింది సిబ్బందితో రెవెన్యూ లెక్కలు తనిఖీచేసే సమావేశం

జరీ బుటేదారీ,66,67: జరీతో అల్లిక చేసిన వస్త్రము

జవాబునీసులు,50: శిరస్తదారు కార్యాలయంలో సహాయ ఉద్యోగలు

జాకాన ఫలీల,63 ,: వాయిద్యములలో ఒకరమైన వాయద్యము

జిరాయితీ,73,96,100,137: సాగుబడి భూమి

జరిమానా,139,147 , జుల్మానా, 37,126,139: అపరాధముగా విధించు ద్రవ్యపు సిక్ష

జేగురు,62 : సింధూరపు రంగు (ఒకరమైన ఎరుపు)

ఠాణా, 30,39,47-49,107, ఠాణేదారు,104, : సంస్థానాలలో పర్యవేక్షణ కార్యలయం. ఠాణా అధికారి

తంజా, 53: పడక కుర్చీ వసతి గలిగిన పల్లకీ

తమ్మట్లు,55,65,67 : చెవులకు పెట్టుకునే ఆభరణాలు

తరివిణి, 54,: కర్రలకు చెక్కలకు చిత్రక పట్టుట

తాశీల్దారు, తహశీల్దార్, తహసీల్దారు,25,3650,60,92,117: శిస్తు వసూలు అధికారి

తాఖీదు,36,37,50,51 ,: అధికారపు ఆజ్ఞా, ఉత్తర్వుల పత్రం

తానులు, 63: బట్టల షాపు లో అధిక పొడుగ గల ఒకే రకమైన వస్త్రపు మొత్తం కట్ట

తార్కికప్రజ్ఞ, 104: మంత్ర తంత్ర పరిజ్ఞానము

తాషామరఫా మేళాలు,63: వినోదమునిచ్చే వాయిద్య బృందాలు

తాబెదారులు,12,36 :క్రింది స్థాయి ఉద్యోగులు

తిరుచూర్ణ రేఖ,68 : నుదుటిపై తీర్చి దిద్దుకొను రంగు నిలువు బొట్టు

దివాణం, 47,49,51,52,112,116,122,: సంస్థానంలోని అందరు ఉద్యోగులుండే కార్యాలయం
దివాన్, ,దివాన్గిరీ,49,69,140: రాజాగారి తరఫున పర్యవేక్షణ అధికారి, వారి పదవీ నిర్వాహణ
దివిటీలు,54: రాత్రి పూట వెలుతురు కేసం వెలిగించు కాగడా
దేశపాండ్య,29,44 : జిల్లాలో శిస్థు వసూలు లెక్కలు అజమాయిషి ఉద్యోగం
దొర, : విదేశీయుడు
నమోదు,51,116-119: పుస్తకములో చేర్చుట
నాయబు శిరస్తాదారీ,28: డెప్యుటి(సహాయ) శిరస్తదారు
నిఘమానులు,39: పరిశోధించు వారు
నిస్సంతు,27 : సంతానము లేనివారు
నిరతాన్న దాత,60 : నిత్యము అన్నదానం చేయువారు
పగిడి,55: తలపాగా
పటకా,85: నడుముకి ధరించునది
పటాలాలు,153 : సైనికుల దళామును కొలమానము(unit of soldiers)
పట్టెవర్ధనములు, 67: నుదుటిపై పెట్టుకునే బొట్టు విభూతి రేఖలు
పఠాని వేషం,64: పఠానులు ధరించే వేషం
పావోశులు,55 : ఒకరమైన నేత బట్ట
పుట్టి, 32: ధాన్యం కొలత
పుట్టెడు(పుట్ల) భూమి, 32,102,104: భూమి కొలత (పిఠాపురం సంస్థానంలో1 పుట్ట= 8 ఎకరాలు)
పుట్రలు,26: ఊత పదం భూములు (భూములు-పుట్రలు)
పేష్కరు,(పేష్కార,73,83,125 : అమల్దారు క్రింద ఉద్యోగి
పేష్కషు, పెష్తస్సు, పేష్కస్ , 29,39,82,151-161: ప్రభుత్వానికి చెల్లించవలసిన శిస్తు లేద కప్పము
పేష్కారు, పేష్కార్లు,32,39,50 , : పేష్కస్సు వసూలు చేసే అధికారి
పైజారులు,67 : ఒకరకమైన పాదరక్షలు
ప్రోప్రైటర్,32,94,153 : ప్రభుత్వ భూములను వేలంలో కొన్న భూస్వామి
ప్రపితా మహుడు : ముత్తాత
ప్రెసిస్,92 :(Precis)ద్ద వ్యాసమును కుదించి వ్రాసినది

బతునగారా,67 : జంతు చర్మంతో చేసిన ఒకరకమైన వాయిద్యం

బట్వాడా, 14,30:ఉత్తరములు సరఫరా చేయుట

బర్తరఫ్,37: తొలగించుట

బళ్ళారి పైజారులు,55 : బళ్లారీ తయారీ పాద రక్షలు

బారకీసులు,153: సైనిక శిబిరాలు

బిందరీలు,65 ,: స్త్రీలు తలకి ధరించే ఆభరణాలు

బుక్కుమజిలీను,66 : ఒకరమైన నేత బట్ట

బూటేదారీ, 55: అల్లిక పని తనం

బోయీలు,53,54,65 : పల్లకీ మోసే మనుష్యులు

బోయీల సవారీ, 53,54: బొయీలు మోసే పల్లకి

భామకలాపం(భామాకలాపం),104: కూచిపూడి నృత్యములలో ఇది ఒకటి. సత్యభామ కలహము అభినయించి చేసే నృత్యం

భుజబందులు,67: భుజములకు ధరించు ఆభరణాలు

భూరి, 84,101: అధికమొత్తము

మజిలీను,66: ఒకరమైన జరీ వస్త్రము

మజుందార్,29 : సంస్థాన ఉద్యోగలు

మదత్గార్, మదత్ గారీ,28, : సహాయక ఉద్యోగుడు, సహాయక ఉద్యోము

మిరాశి,26: వంశ పారంపర్యపు హక్కు

మహావయ్యా కరణులు,103 : వ్యాకరణ శాస్త్ర పండితులు

మాధ్వ పంతులు, మాధ్వ వ్యాపారులు,30,60 : మహారాష్ట్ర బాహ్మలు

మాణేగార్లు, 39 :సంస్థానం లో ఒక స్థాయికి చెందిన ఉద్యోగులు

ముఖమల్,66: ఒకరకమైన మెత్తటి వస్త్రం

ముక్త్యారు, 117 : అధికారం కలిగినవారు, అధికారం కలిగినవారిచే ఇవ్వబడిన పత్రం

ముఠాలు,82,83,107,153-156 : కొన్ని గ్రామాలతో కూడిన భూములు

మున్షీ,30 : చదువు చెప్పువారు, లేఖకుడు

మురిడిగొలుసులు,67 :ముంజేతికి ధరించే ఆభరణాలు

ముసద్దీలు,50 : శిరస్తదారు క్రింద ఉద్యోగులు

మెటెడులు,100: కొద్దిపాటి శిస్తుతో ప్రత్యేకంగా ఇచ్చిన భూములు

మేనాసవారి,53 : దూర ప్రయాణాలకు పడుకుని వెళ్లే వసతి గల పల్లకీ

మేస్తర్,28 : ఆంగ్లములోని మిస్టరుకు వికల్పం

మొతర్ఫా,28,82: పారశ్రామికుల పన్ను

మొకాసాదారు,43 : కొంత విస్తీర్ణ భూమి పై హక్కు దారు

మొహరు,51 : అధికారిక ముద్ర

యాదాస్తులు,49,50 : ఆస్తి మొత్తం, ఆదాయం

రండోలు మేళము,63: ఒక రకమైన మేళాలు

రంప పితూరీ,138: రంప గ్రామంలో జరిగిన తిరుగుబాటు

రిక్త గౌరవాలు,85 : ఉపయోగం లేని గౌరవములు

రికార్డు మదద్గారి 28: రికార్డులు లేక దస్త్రములును భద్రపరుచు సహాయకుడు

లావాజ్ మాల్,26: గ్రామ సేవకుల జీతముపై పన్ను వసూలు హక్కు

లోగిలి, 31 : ఇళ్ళ నిర్మాణలో ఒక విధనమైన కట్టడం, ఇంటి లోపల ఒక విభాగము

లాలూచి,40: కుమ్మక్కు

వంతువారడి అమరకపు,74-76,154 : శిస్తు నిర్ణయ పద్ధతి

వెట్టి మోతాదు,36,39 : చిన్న పనివాళ్లు

వార్షికములు, 97,101,120-122,128: సంవత్సరం వారీ ఇవ్వబడునవి

విప్ర వినోదులు,64: వినోదపరిచే బ్రాహ్మణులు

విరుగుడుచేవతో,67 : గట్టతనముగల నల్ల చెక్క

వెరసులు,33: లెక్కలు పద్దులు చివరకు తేల్చిన మొత్తములు కూడికల

వెల్ల, వెల్ల వేయించుట,62,162 : సున్నం , ఇంటికి కొత్త పెయింటు వేయించుట

వ్యవహర్త,69: కార్య దక్షత కలిగిన వారు

శిరస్తా ముదల్గారీ,28,: శిరస్తదారుకి సహాయ కార్యాలంయ

శిరస్తాదార్,శిరస్తాదారు, శరిస్తాదారీ, 25,28,30,31,40,48-50,60,83,122,127,13-131: ప్రభుత్వరివెన్యూ విభాగములోనూ, రాజుల సంస్థానములలోను ఉన్నతాధికారి

శిస్తు,20,48,50,75: ప్రభుత్వానికి రైతులు కట్టవలసిన భూమి పన్ను

శ్రుత పాండిత్యం,104: వినడం ద్వారా వచ్చిన పాండిత్యము

శ్రౌతపండితులు,102: వేద పండితులు

శ్రౌతులు,64: పండితులు

షరాయి,55: నడుముకి క్రింద ధరించే వస్త్రం

సంప్రతి కరణాలు,26: కొన్ని గ్రామాలపై కరణీకం చేయువారు

సంజాయిషీ,41,126 : జవాబు లేక వివరణ చెప్పుకొనుట

సదరీ , సదరీ అమీన్,28: సదరీ తాత్కాలికంగా (యాక్టింగ్) పదవి, తాత్కాలిక అమీన్

సదస్యం,64: సమావేశం

సదావృత్తులు,100: జీవానాధారపు వృత్తులు

సన్నదులు85,88, : అధికారపు వుత్తర్వులు

సన్నిధి కోలలు,54 : దేవుని ఉత్సవాలలో వెలిగించే కాగడాలు

సముద్దారులు39,47,49,50,: సంస్థానం ఒక ఉద్యోగులు

సరంబీ, 62: చేక్కతో చేసిన అటక

సర్వ ముక్త్యారు,117 : పూర్తి అధికారము, అధికారము

సవారీ, 53,104,: గుర్రాలమీద వెళ్లుట

సవాలు,74,155: అభ్యంతరం వ్యక్తం చేయుట

సాగరాల అమావాస్య,147: సముద్రపు వడ్డున అమావాస్య రోజున ఆచరించు కార్యక్రమము

సాదరవాడి, 30: కలెక్టరు కార్యాలయం లో నొక విభాగము

సాయరు, సాయరు సుంకములు,152,153: మత్తు పానీయాలపై సుంకములు

సాల్టు, సాల్ట్ రైటరీ, 28,40: ఉప్పు పరిశ్రమకు సంబంధించిన రెవెన్యూ లెక్కలు వ్రసే ఉద్యోగము

స్టీమరు,45,56,58,134,143,146,147: నీటి ఆవిరి శక్తితో నడిచే యాంత్రిక పడవ

సిరస్తా మదత్ గారీ,28

కాకినాడ దేవాలయం వీధిలో ని

శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ భీమేశ్వరస్వామి

వారి దేవాలయం



దివాన్ శివరావు పంతులుగారి తండ్రి, దిగవల్లి తిమ్మారాజు పంతులు (1794-1856)గారి చే కాకినాడలో 1828సం.మంటపము,1831 సం. ఆలయ మంటప గోపురము నిర్మించబడినది

కాకినాడ దేవాలయం వీధిలో ని

శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత శ్రీ భీమేశ్వరస్వామి

వారి దేవాలయం



దివాన్ శివరావు పంతులు గారి చే 1885 సం॥లో


రాగితాపడముతో నిర్మించబడిన

ధ్వజ స్తంభము

(ఈ నాటి ఇత్తడి తాపడముతో)

C

ధవళేశ్వరం ఆనకట్ట - నిర్మాణ సారధులు



ఆనకట్ట



1827 సం. నాటి లెఫ్టనెంట్(Lieutenant) ఆర్థర్ కాటన్

D



కెప్టెన్ ఆర్ (Captain Orr)



రాయ్ బహద్దూర్ వీనం వీరన్న

G




పిఠాపురం కోట



రాజా రావు వేంకట మహీపతి గంగాధర రామారావు గారు(1844-1890)

H




భావన్నారాయణ స్వామివారి దేవాలయం- సర్పవరం



ముక్తి సరస్సు- సర్పవరం




తెలుగు రాయణిం జననం 1570



రాజా రావు నీలాద్రిరాయణం (1775-1828)

J



రాజారావు వేంకట సూర్యారావు బహద్దర్ (పరిపాలన1844-1850)




రాజారావు వేంకట కుమార మహీపతి సూర్యారావు(1885-1964)

F



MAHAKAVI DASU SREERAMULU (1846-1908)

శ్రీ దాసు శ్రీరాములు గారు(1846-1908)



శ్రీ ఆదిభట్ల నారాయణ దాసు గారు(1864-1945)

A

గ్రంథ రచనకు తోడ్పడిన మూలాధారాలకు మూలపురుషులు

దిగవల్లి వేంకటరత్నం పంతులు గారు(1850-1908)



వీరు రచయిత శివరావుగారి తండ్రి, దివాన్ శివరావుగారి తమ్ముడు రచయితకు తోడ్పడిన మూలాధారాలలో వీరి దినచర్యపుస్తకము చాలా ప్రముఖమైనది




చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు(1870-1950)శ్రీ శాస్త్రీగారు రచతయతతో చేసిన వ్యక్తిగత సంభాషణలు ఉపన్యాసాలు, రచనలు ఈ సంపుటికి తోడ్పడిన మూలాధారాలలో ప్రముఖములైనవి)

B



డా. గూడూరి నమశ్శివాయ(1912?-1992 జులై). ఆయుర్వేద వైద్యులు. వీరి తండ్రి వియ్యన్న గారు మచిలీపట్నంలో శ్రీ చెళ్ళపిళ్ళ శాస్త్రిగారికి వైద్యులు. వీరు రచయిత శివరావుగారి అనుచరులుగా నుండి వారు రచించి ఈ సంపుటి చేతివ్రాత ప్రతికి(మరికొన్నిటికి కూడా)1980 దశాబ్దములో శుద్ధప్రతులు వ్రాసి మహోపకారం చేశారు.




శ్రీ చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు బందరు హిందూ పాఠశాలలో ఉపాధ్యాయులుగా నుండినప్పడు డా.శర్మగారు ఆ పాఠశాల విధ్యార్ధిగా నుండిరి. వీరి ద్వారానే రచియిత శివరావుగారికి 1920 దశాబ్దమునుండి శ్రీ చెళ్ళపిళ్ళ శాస్త్రిగారితో పరిచయం కలిగి తదుపరిగా చాల సన్నిహితులైనారు.

డా. ఘంటసాల సీతారామశర్మ L.C.P&S (1894-1952)

E

బ్రహ్మజ్ఞాని, స్వామి తల్లాప్రగడ సుబ్బారావు (1856-1890)

అడయార్ దివ్యజ్ఞాన సమాజ స్థాపక ప్రప్రధమ కార్యదర్శి. వీరు దివాన్ దిగవల్లి



వేంకట శివరావు పంతులుగారి మేనల్లుడు, రచయిత శివరావుగారి మేనత్త కుమారుడు.



అడయారు దివ్యజ్ఞాన సమాజము



కీ.శే. దిగవల్లి వేంకటశివరావు

బి.ఎ.,బి.ఎల్.(1898-1992):

జననం:1898 ఫిబ్రవరి 14, కాకినాడ. చదువు: రాజమండ్రి వీరేశలింగం హైస్కూలు(1910-1916), మద్రాసు ప్రెసిడెన్సీకాలేజ్(1916-1920), మద్రాసు లా కాలెజి (1920-1922). వృత్తి: న్యాయవాది, విజయవాడ (1922-1970). రచనలు: 1928 నుండి 1992 వరకూ సుమారు 60 పుస్తకాలు రచించారు. వాటిలో 45 ప్రచురించబడినవి. వీరి వ్యాసములు సుమారు 300 వివిధ పత్రికలలో 1918సం. నుండి 1988సం. వరకూ ప్రచురితమైనవి. స్వాతంత్ర్య పోరాట కాలంలో వీరు1930సం.లో రచించిన చిన్న పుస్తకములను, కర పత్రములను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వము వారు నిషేధించిరి. 1930,1931 సం.లలో వీరిపై రెండు సార్లు రాజద్రోహం కేసులు పెట్టబడినవి. వృత్తిరీత్య న్యాయవాదులైన ప్పటికినీ, వీరు చరిత్ర పరిశోధకులుగా గుర్తింపు పొంది యుండిరి. అలనాటి తెలుగు రచయితలలో అగ్రగణ్యులు. 1959 లో వీరి ఆఫ్రికా జాతీయోద్యమము అను పుస్తకమును భారత రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్ర ప్రసాదు గారు ఆవిష్కరించిరి. 1966 లో రాష్ట్ర ప్రభుత్వముచేత సన్మానింపబడిరి. బ్రిటిష్ ఇండియా యుగం 18,19 శతాబ్దాలనాటి చరిత్రలు వీరి ప్రత్యేకత. 1960 దశాబ్దములో రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన తెలుగు పరిభాష (గ్లాసరీ) నిఘంటువు సంకలన సభ్యులు. సర్వ శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డి, మాడపాటి హనుమంతరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి మున్నగు ప్రముఖులు వీరి రచనలను ప్రశంసించిరి. వీరి రచనలు, వ్యాసములు అనేక చరిత్ర పరిశోధకులు పి.హెచ్.డి పొందుటకు తోడ్పడుచున్నవి. ఏనుగుల వీరాస్వామయ్య గారి కాశీయాత్ర చరిత్ర(1941సం) వీరి పరిశోధనా పటిమకు నిదర్శనం. మరణం: 1992, అక్టోబరు 3. భోపాల్, మధ్య ప్రదేశ్.

సంపాదకులు:

దిగవల్లి రామచంద్ర (జననం1943) M.Sc., Ph.D. విశ్రాంత A.G.M, Bank of India.

సహసంపాదకులు: దిగవల్లి వేంకట చంద్రశేఖరరావు (జననం1956) B.Com., B.L విశ్రాంత M.P.D.O తూర్పుగోదావరి జిల్లా